
సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+12 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 328
మంగళవారం 18-2-2020
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'




## కెయిన్స్ కప్ క్వీన్ హంపి...

తెలుగు తేజం, ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కెరీర్‌లో మరో గొప్ప విజయాన్ని సాధించింది. గతేడాది డిసెంబర్‌లో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించిన హంపి... తాజాగా అమెరికాలో జరిగిన కెయిన్స్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లోనూ విజేతగా నిలిచింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య జరిగిన ఈ టోర్నీలో 32 ఏళ్ల హంపి ఆరు పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. తాజా ప్రదర్శనతో ఆమె ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకోనుంది. - స్పోర్ట్స్‌లో

● కోవిడ్‌పై మరింత అప్రమత్తం..


### కఠిన చర్యలు



కోవిడ్ మృతులతోపాటు బాధితుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతుండటంతో చైనా మరిన్ని కఠిన చర్యలు ప్రకటించింది. పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న హుబే ప్రావిన్స్‌లో ట్రాఫిక్ ఆంక్షలతోపాటు బహిరంగ ప్రదేశాల్లో జనం గుమికూడరాదని ఆదేశాలు జారీ చేసింది. - 5లో

● తాజా డెత్ వారంట్..


### మార్చి 3న ఉరి



'నిర్భయ' దోషుల ఉరిశిక్ష అమలుకు తేదీ ఖరారయ్యింది. నలుగురు దోషులకు ఢిల్లీ కోర్టు తాజాగా డెత్ వారంట్ జారీ చేసింది. రోజుకో మలుపు తిరుగుతూ యావత్ దేశం దృష్టినీ ఆకర్షిస్తోన్న నిర్భయ కేసులో దోషులకు మార్చి 3న ఉదయం ఆరు గంటలకు ఉరిశిక్ష అమలు చేయాలని ఢిల్లీ కోర్టు తీర్పునిచ్చింది. - 5లో

● 'నిరసన'పై సుప్రీం...

### ప్రాథమిక హక్కే.. కానీ!



ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రాథమిక హక్కే కానీ, ఆ కారణంగా రహదారుల దిగ్బంధనం జరగడం ఆందోళనకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజలకు ఇబ్బంది కలగని ప్రాంతంలోకి తమ నిరసనల కేంద్రాన్ని మార్చుకోవాలని సీఏఏ వ్యతిరేక ఆందోళనకారులకు సూచించింది. - 5లో

● లింగ వివక్ష తగదు..

### నారీ.. సైన్యాధికారి



కమాండ్ రోల్స్‌లో మహిళా సైనికాధికారుల నియమించే విషయంలో కొనసాగుతోన్న వివక్షకు చెల్లుచీటీ ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. శారీరక పరిమితులు, సామాజిక కట్టుబాట్ల పేరుతో మహిళా అధికారులను నియమించకపోవడం తగదని స్పష్టం చేసింది. - 5లో

# ఇదే లాస్ట్ చాన్స్!

## వేలాడుతున్న హెచ్1బీ కత్తి

- ఓపీటీపై ఉన్న 68 వేల మంది భారతీయ టెకీలకు ఈ ఏప్రిల్ చివరి అవకాశం
- వీరిలో 20 నుంచి 24 వేల మంది తెలుగు రాష్ట్రాల ఐటీ ఉద్యోగులు
- మూడేళ్ల ఓపీటీ గడువు పూర్తయ్యేలోపు హెచ్1బీ వీసా రాకపోతే తిరుగు పయనమే
- మళ్లీ ఎంఎస్ లేదా పీహెచ్‌డీలో అడ్మిషన్ లేదంటే అంతే సంగతులు
- ఈసారి కూడా వీసా రాదేమోనన్న ఆందోళనలో టెకీలు




### అమెరికాలో పరిస్థితులు మారాయి..

ఇప్పటికే రెండు సార్లు లాటరీలో నాకు అవకాశం రాలేదు. ఈ ఏప్రిల్‌లో రాకపోతే ఇండియా తిరిగి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. అమెరికాలో పరిస్థితులు మారిపోయాయి. హెచ్1బీ వీసా మరింత కష్టమవుతుంది. ఐటీ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఉంది. నాలుగైదేళ్లలోనే పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఒక్క ఉద్యోగానికి ఐదారుగురు తెలుగు టెకీలే పోటీ పడుతున్నారు.

ఈలి అనసూయ,
ద్వారకానగర్, విశాఖపట్నం

(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

అమెరికా వెళ్లి ఉన్నత విద్య పూర్తి చేసి, ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) అర్హతతో ఉద్యోగం చేస్తున్న దాదాపు 68 వేల మంది భారతీయ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇప్పుడు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. మూడేళ్ల కాలవ్యవధి కోసం ఇచ్చే ఓపీటీ ఈ ఏడాదితో పూర్తి కానుండటమే దీనికి కారణం. ఇప్పటికే రెండుసార్లు హెచ్1బీ వీసా అవకాశం కోల్పోయిన ఈ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఈ ఏప్రిల్ చివరి అవకాశం. అప్పటికీ వీసా రాకపోతే స్వదేశానికి తిరిగి వెళ్లడం లేదా మళ్లీ విశ్వవిద్యాలయంలో చేరి పీహెచ్‌డీలో చేరడం (అన్ని అర్హతలు ఉంటే)లేదా ఎంఎస్‌లో మరో కోర్సు చేయడమే ప్రత్యామ్నాయం. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిలో అత్యధికులు తిరిగి ఎంఎస్‌లో చేరడానికి సుముఖంగా లేరు. ఒకవేళ వీసా రాకపోతే భారత్ తిరిగి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. 2015–16లో అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన వారు ఇప్పుడు వీసా సమస్యలు ఎదుర్కొంటున్నారు. 2014 నుంచి ఉన్నత విద్య కోసం వెళుతున్న వారి సంఖ్య రెట్టింపు కావడమే

మిగతా 3వ పేజీలో ▶


సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు. చిత్రంలో కేసీఆర్ సతీమణి శోభ, కోడలు శైలిమ, మనవడు హిమాన్షు, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ తదితరులు

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

2,3 ల్లో

- శాసనసభ ఆవరణలో మొక్కలు నాటిన స్పీకర్, మండలి చైర్మన్.. జలవిహార్‌లో మంత్రి తలసాని ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు..
- వికలాంగులకు వీల్ చైర్లు.. అంధులకు దుస్తులు పంపిణీ.. మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపిన వివిధ ప్రభుత్వ శాఖలు



## రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర


**బీజేపీపై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం**

- గత 6 ఏళ్ల బీజేపీ పాలనలో దేశ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఉత్తమ్ చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తే నేడు బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలుచేయడంలో భాగంగా ఆ రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. -4లో

NECC Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు
గుడ్డ ఒకటైల్ ధర ₹ 60 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 54 కిలో
డ్రెస్డ్ స్కిన్‌తో 110 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 76 కిలో
స్కిన్‌లెస్ 125 కిలో
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

## ఇక బీఎస్సీ డేటా సైన్స్, బీకాం అనలిటిక్స్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు రాబోతున్నాయి. బీఎస్సీ డేటా సైన్స్, బీకాం అనలిటిక్స్ వంటి కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా విధి విధానాలను ఖరారు చేసేందుకు అధికారులు, పారిశ్రామిక వర్గాలతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కోర్సులపై చర్చించారు. రాష్ట్రంలోనూ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు అవసరమైన



- డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ఉన్నత విద్యామండలి చర్యలు
- 2020–21 నుంచే ప్రభుత్వ కాలేజీలు, గురుకులాలు, టాప్ ప్రైవేటు కాలేజీల్లోనూ..
- ఇటు మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులకు అవకాశం.. విధివిధానాల ఖరారుకు కమిటీ ఏర్పాటు.. వచ్చే వారంలో నిర్ణయం

కోర్సులను ప్రవేశపెట్టాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. వచ్చే వారం రోజుల్లో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. 2020–21 విద్యా సంవత్సరం నుంచే కొత్త కోర్సులను అమల్లోకి తేనున్నారు. ఇప్పటివరకు డిగ్రీలో మ్యాథ్స్, స్టాటస్టిక్స్‌తోపాటు కంప్యూటర్ సైన్స్ కోర్ సబ్జెక్టులుగా చదివే అవకాశముంది. అయితే ఇకపై మ్యాథ్స్, స్టాటస్టిక్స్‌తోపాటు డేటా సైన్స్‌ను చదువుకోవచ్చు. అలాగే బీకాంలో బిజినెస్ అనలిటిక్స్‌ను కూడా చదువుకునే వీలు కల్పించనుంది. వీటిల్లోనే ఆనర్స్

మిగతా 2వ పేజీలో ▶


సోమవారం పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కార్ల్ జూన్‌కు బయో ఆసియా జినోమ్ వ్యాలీ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును అందజేస్తున్న మంత్రి కేటీఆర్

## చికిత్సలపై పరిశోధనలకు ప్రపంచస్థాయి కేంద్రం

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం: మంత్రి కేటీఆర్
సీసీఎంబీ సహాయ సహకారాలు తీసుకుంటాం
జీవశాస్త్ర రంగాల వృద్ధికి మరిన్ని చర్యలు
ఫార్మాసిటీ ఏర్పాటుకు రంగం సిద్ధమని వెల్లడి
ఘనంగా బయో ఆసియా సదస్సు ప్రారంభం

14 లో

## 'జీఎస్టీ'లో దూకుడు

**19** జనవరిలో గత ఆర్థిక ఏడాదితో పోలిస్తే 19 శాతం వృద్ధి

**4** మహారాష్ట్ర, గుజరాత్‌కు దీటుగా 4వ స్థానంలో తెలంగాణ

**24 వేల కోట్లు** జనవరిలో రూ. 3,787 కోట్ల వసూళ్లతో రూ.24 వేల కోట్ల వసూళ్లు




- ఈ ఏడాది అంచనాలకు మించి వసూలయ్యే అవకాశం..
- జీఎస్టీ పనితీరుపై ఆర్థిక సంఘం కితాబు

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో వృద్ధి కన్పిస్తోంది. గతేడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో ఏకంగా 19 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది జనవరిలో జీఎస్టీ కింద రూ.3,195 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అది రూ.3,787 కోట్లకు చేరింది. జనవరి జీఎస్టీ రాబడులకు సంబంధించి కేంద్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను మినహాయిస్తే చండీగఢ్ రాష్ట్రంలో అత్యధిక వృద్ధి 22 శాతం నమోదు కాగా, గుజరాత్, మహారాష్ట్రలతో దీటుగా 19 శాతం వృద్ధిని నమోదు చేసిన తెలంగాణ నాలుగో స్థానానికి చేరింది. మన రాష్ట్రం తర్వాత కేరళలో 17 శాతం వృద్ధి ఉందని గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఈ ఏడాది జనవరిలో వసూలైన రూ.3,787 కోట్లతో కలిపి 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను, 10 నెలల కాలంలో మొత్తం రూ.24,135.3 కోట్లు జీఎస్టీ ద్వారా వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.31,186.67 కోట్లు జీఎస్టీ రూపంలో ఆదాయం వస్తోందని అంచనా వేయగా, అందులో 77.3 శాతం రాబడి వచ్చింది. గతేడాది రూ.34,232.93 కోట్లు జీఎస్టీ రాబడులుంటాయని అంచనా వేయగా, 2019 మార్చి ముగిసే నాటికి 84.09 శాతం.. అంటే రూ.28,786.44 కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది మరో 2 నెలలు మిగిలి ఉండటంతో ఈ 2 నెలల్లో కలిపి మరో రూ.6 వేల కోట్లు వచ్చే అవకాశముందని, దీంతో బడ్జెట్

మిగతా 2వ పేజీలో ▶

### ఇదండీ జాతర్


మీ ఆశీస్సులతో ఇంకా ముందుకు వెళతా సార్!

# కాకతీయ కాలువలో కుటుంబం జలసమాధి

## కారు కాలువలో పడటంతో ముగ్గురు దుర్మరణం

### ఘటన జరిగిన 21 రోజుల తర్వాత వెలుగులోకి..

- ఆదివారం రాత్రి కాలువలోకి బైక్ దూసుకెళ్లి మహిళ గల్లంతు.. ఆమె కోసం గాలించే క్రమంలో బయటపడిన కారు
- కారులో కుళ్లిన స్థితిలో ముగ్గురి మృతదేహాలు
- మృతులు పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెల్లెలు, బావ, వారి కుమార్తెగా గుర్తింపు
- 21 రోజులుగా కనిపించకపోయినా ఫిర్యాదు చేయని కుటుంబ సభ్యులు
- హైదరాబాద్ వెళ్తూ ప్రమాదానికి గురై ఉంటారని పోలీసుల నిర్ధారణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లోని కాకతీయ కాలువలో ఓ కుటుంబం జల సమాధి అయింది. కారు కాలువలో పడటంతో ముగ్గురు మృతిచెందారు. అయితే, సంఘటన జరిగిన 21 రోజుల తర్వాతే ఈ విషయం వెలుగు చూసింది. ఆదివారం రాత్రి బైక్ కాలువలోకి దూసుకెళ్లి ఓ మహిళ గల్లంతయ్యారు. ఆమె కోసం గాలించేందుకు నీటి ప్రవాహం తగ్గించడంతో ప్రమాదానికి గురైన కారు బయటపడింది. పోలీసులు క్రేన్‌తో కారును బయటకు తీయగా, అందులో కుళ్లిపోయిన స్థితిలో మూడు మృతదేహాలు కనిపించాయి. మృతులను పెద్దపల్లి శాసనసభ్యుడు దాసరి మనోహర్‌రెడ్డి సోదరి రాధ (50), ఆమె భర్త సత్యనారాయణరెడ్డి (55), వారి కుమార్తె సహస్ర (21)గా గుర్తించారు. మృతదేహాలకు అక్కడే పోస్టుమార్టం చేశారు. అనంతరం శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాలుగా వారు కనిపించకపోయినా, కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. ఘటనా స్థలంలో ఉన్న పరిస్థితులను బట్టి దీనిని ప్రమాదంగానే భావించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ నరేష్‌రెడ్డి తెలిపారు.

**కుమార్తెను హైదరాబాద్ తీసుకెళ్దామని...**
సత్యనారాయణరెడ్డి కరీంనగర్‌లో సాయితిరుమల ఆగ్రో ఏజెన్సీస్ సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఆయన భార్య రాధ కొత్తపల్లి మండలం మల్కాపూర్ ప్రైమరీ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. బీటెక్ చదువుతున్న వారి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం సిరిసిల్లలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమార్తె సహస్ర నిజామాబాద్‌లోని మేఘన డెంటల్ కాలేజీలో బీడీఎస్

మిగతా 2వ పేజీలో ▶


కాకతీయ కాలువలో పడిన కారును బయటకు తీస్తున్న దృశ్యం..


సత్యనారాయణరెడ్డి


రాధ


సహస్ర

## నేడు పట్టణ ప్రగతి సన్నాహక సదస్సు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న పట్టణ ప్రగతి కార్యక్రమం సన్నాహకం కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రగతి భవన్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, కమిషనర్లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లను ఈ సమావేశానికి ఆహ్వానించారు. పట్టణ ప్రగతి కార్యక్రమ నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న వారందరినీ మంగళవారం మధ్యాహ్నం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్మించిన వెజ్–నాన్‌వెజ్ మార్కెట్‌ను, శ్మశాన వాటికలను సందర్శించడానికి తీసుకెళతారు.

## అడ్ హాక్ ప్రమోషన్లు ఇవ్వండి

### కలెక్టర్లకు పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఖాళీగా ఉన్న పోస్టులను అడ్ హాక్ ప్రాతిపదికన భర్తీ చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ నిర్ణయించింది. మండల, జిల్లా పరిషత్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి వాటిలో ప్రమోషన్లలో సీనియారిటీ జాబితా ఉన్నవారిని నియమించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా.. జిల్లా కలెక్టర్లకు రాసిన లేఖలో వెల్లడించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచినట్లు 'మోడల్ విలేజ్'లక్ష్యంగా ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని స్పష్టంచేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు మొదలు ఎంపీవో, ఎంపీడీవో, డీఎల్‌పీవో, డీపీవో, డిప్యూటీ సీఈవో, సీఈవో వరకు రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యేవరకు అడ్ హాక్ ప్రమోషన్లు ఇవ్వాలని, అధికారాలను బదలాయించాలని ఆయన ఆదేశించారు.

## ప్రతి మంగళవారం ఆర్టీసీ వెల్ఫేర్ బోర్డు మీటింగ్స్

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఆదేశంతో కొత్తగా ఏర్పాటైన ఆర్టీసీ వెల్ఫేర్ బోర్డులు ఇక నుంచి ప్రతి మంగళవారం సమావేశం కానున్నాయి. ఈమేరకు ఎండీ సునీల్‌శర్మ అన్ని డిపోల మేనేజర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మంగళవారం తొలి భేటీ నిర్వహించాలని తెలిపారు. డిపో స్థాయిలో సిబ్బంది లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని, వారి పరిధి దాటి ఉన్న అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లాలని డీఎంలకు సూచించారు. సిబ్బంది లేవనెత్తిన సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టంచేశారు. ఇక రీజియన్ స్థాయిలో నెలకోసారి, జోన్ స్థాయిలో ప్రతి రెండు నెలలకోసారి, కార్పొరేషన్ స్థాయిలో ప్రతి మూడు నెలలకోసారి బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఎండీ ఆదేశించారు.

## డాక్టర్ వసంత్‌కుమార్ పోస్టింగ్‌కు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: గాంధీ ఆసుపత్రిలో పెట్రోల్ బాటిళ్లతో హల్‌చల్ చేసిన డాక్టర్ వసంత్‌కుమార్‌కు హైదరాబాద్ డీఎంహెచ్‌వో పరిధిలో పోస్టింగ్ ఇవ్వాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది. వసంత్‌ను హైదరాబాద్ డీఎంహెచ్‌వోకు అటాచ్ చేస్తూ ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం హైదరాబాద్ కోఠిలోని ప్రజారోగ్య కార్యాలయంలో వసంత్ రిపోర్ట్ చేశారు. హైదరాబాద్ డీఎంహెచ్‌వో పరిధిలో ఏదో ఒక దవాఖానలో ఆయన్ను వైద్యాధికారిగా నియమించే అవకాశముంది. గాంధీలో వైద్యునిగా పని చేస్తున్న వసంత్‌ను ప్రజారోగ్య సంచాలకుని కార్యాలయానికి సరెండర్ చేసిన సంగతి తెలిసిందే.

## మంత్రి పువ్వాడకు తప్పిన ప్రమాదం

హైదరాబాద్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆయన కాన్వాయ్ ఒకదానికొకటి ఢీకొని దెబ్బతిన్నాయి. సోమవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ రోడ్ నెం 1లోని వెంగళ్‌రావు పార్కు ముందు ఈ ఘటన చోటు చేసుకుంది. అజయ్‌కుమార్ మధ్యాహ్నం తన కాన్వాయ్‌లో ప్రగతి భవన్ వైపు వెంగళ్‌రావు పార్కు మీదుగా వెళ్తున్నారు. మంత్రి కూర్చున్న కారు ముందున్న ఎస్కార్ట్ ఓ ద్విచక్ర వాహనం అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఎస్కార్ట్ కారు వెనకాల ఉన్న మంత్రి కారు ఢీకొట్టింది. ఆ వెనకాల ఉన్న కాన్వాయ్‌లోని మరో రెండు కార్లు కూడా ఒక దానికొకటి ఢీకొన్నాయి. దీంతో కార్లన్నీ దెబ్బతిన్నాయి. ఘటనతో మంత్రి షాక్‌కు గురయ్యారు. ఆ వెనకాలనే ఆయనకే చెందిన ప్రైవేట్ వాహనం రావడంతో అజయ్‌కుమార్ అందులోనే ప్రగతిభవన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మార్చి 15 నుంచి ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

హైదరాబాద్: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 16వ జాతీయ మహాసభలను హైదరాబాద్‌లో మార్చి 15 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తిరుమలై మాట్లాడుతూ.. ఈ సభలకు దేశవ్యాప్తంగా 950 మంది వామపక్ష, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రోగ్రెసివ్ యూత్ ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.



సోమవారం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న కె.కేశవరావు. చిత్రంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి తలసాని, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్ తదితరులు

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ 66వ జన్మదినం సందర్భంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. జలవిహార్‌లో కోలాటాలు, బతుకమ్మలు, ఒగ్గుడోలు నృత్యాలు నిర్వహించారు. మంత్రులు, వివిధ శాఖల అధికారులు భారీగా మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తమ పెద్ద కొడుకుగా భావిస్తూ రాష్ట్ర ప్రజలు సీఎం 66వ పుట్టిన రోజును పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నారని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా శాసనసభలో జరిగిన పలు కార్యక్రమాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దంపతులతో పాటు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఆవరణలో 66 మొక్కలను నాటి, స్పీకర్ చాంబర్‌లో కేక్‌ను కట్ చేశారు. శాసనసభ, శాసనమండలిలో విధులు నిర్వహిస్తున్న 280 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సతీమణి పుష్ప, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సతీమణి అరుంధతి చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫిట్‌నెస్ సెంటర్ (జిమ్)ను స్పీకర్, మండలి చైర్మన్ కలిసి ప్రారంభించారు.

### టీ షర్టులతో ఎమ్మెల్యేల సందడి

ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా గులాబీ రంగు టీ షర్టులు ధరించి అసెంబ్లీకి వచ్చిన పలువురు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సందడి చేశారు. 'లాంగ్ లివ్ కేసీఆర్' నినాదాలు ముద్రించిన టీ షర్టులు ధరించిన ఎమ్మెల్యేలు ఎ.జీవన్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, క్రాంతి కిరణ్, గ్యాదరి కిషోర్‌తో పాటు ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అసెంబ్లీ ఆవరణలో మొక్కలు నాటారు.

అనంతరం కేక్ కట్ చేసి సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు.

### తెలంగాణభవన్‌లో...

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల్లో కేసీఆర్ రోల్ మోడల్‌గా నిలుస్తున్నారని శాసన మండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర దివ్యాంగుల సహకార కార్పొరేషన్ డా.కె.వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ పోచంపల్లి చేతుల మీదుగా 66 మంది దివ్యాంగులకు వీల్‌చెయిర్లు, 66 మంది అంధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ రక్తదానం చేశారు. అమెరికా కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో టీఆర్‌ఎస్ నేత దండె విఠల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 150 ప్రవాస భారతీయ కుటుంబాలు మొక్కలు నాటి, స్థానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### మొక్కలు నాటిన మంత్రులు

ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు పుట్టినరోజును పురస్కరించుకుని రవాణాశాఖ మంత్రి పువ్వాడ్ అజయ్‌కుమార్ ఖైరతాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. టీఎస్‌ఆర్టీసీ ఆఫీసర్స్ గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, శామీర్‌పేట బస్‌స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ సిటీ ఈడీ వెంకటేశ్వర్లు మొక్కలు నాటారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి మంత్రుల గృహసముదాయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. రోడ్లు భవనాల శాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మొక్కలు నాటారు. సంజీవయ్య పార్కులో హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

## జలవిహార్‌లో ఘనంగా వేడుకలు

నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో 66 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి, 10వేల మందికి విందును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, బతుకమ్మ, ఒగ్గుడోలు, పులివేషధారణలు, నృత్యాలు, యక్షగానంతో సహా వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. సీఎం కేసీఆర్ జీవిత నేపథ్యాన్ని వివరిస్తూ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ ప్రారంభించారు. వికలాంగులకు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఉదయం బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్, ఎంపీ సంతోష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవాలయ సమీపంలో మొక్కలు నాటారు.



## తల్లిని కన్న తనయుడు.. మా నాన్న: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'తల్లిని కన్న తనయుడికి జన్మదిన శుభాకాంక్షలు'అంటూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన సందేశం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల సందేశాల్లో ప్రత్యేకంగా నిలిచింది. నాకు తెలిసిన బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహసి, కారుణ్యమూర్తి, ప్రజాకర్షక, శక్తిమంత నేత మా నాన్న కావడం గర్వకారణం అని కేటీఆర్ పేర్కొన్నారు. 'మీ దూరదృష్టి, చిత్తశుద్ధితో కలకాలం ఇలాగే స్ఫూర్తి నివ్వాలి'అని సందేశంలో పేర్కొంటూ, కేసీఆర్ పెయింటింగ్‌ను జత చేశారు. తన తండ్రిని ఉద్దేశిస్తూ కేటీఆర్ చేసిన ట్వీట్‌ను వేలాది మంది రీట్వీట్ చేయడం ద్వారా కేటీఆర్, కేసీఆర్‌లపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## ఫోన్‌లో జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ఆయన జన్మదినం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం కేసీఆర్‌కు వైఎస్ జగన్ ఫోన్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గారికి హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు. దేవుని ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉండాలని, చిరకాలం ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా' అని ముఖ్యమంత్రి జగన్ ట్వీట్ కూడా చేశారు.

## ఈ నేలకు మీరే శ్రీరామ రక్ష

### మంత్రి హరీశ్‌రావు భావోద్వేగ ట్వీట్



కేసీఆర్ జన్మదినం సందర్భంగా ట్విట్టర్లో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు భావోద్వేగ సందేశాన్ని పోస్ట్ చేశారు. 'తెలంగాణ మీ స్వప్నం. ఈ రాష్ట్రం మీ త్యాగ ఫలం. ఈ అభివృద్ధి మీ దక్షతకు నిదర్శనం. ఈ నేలకు మీరే శ్రీరామ రక్ష. తెలంగాణ జాతిపిత కేసీఆర్ గారు శత వసంతాలు చూడాలని కోరుకుంటా' అంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

Joel Reifman
@USCGHyderabad

Wishing Chief Minister KCR a very happy birthday! The #USIndia partnership is strong and getting stronger in #Hyderabad and across #Telangana.



సోమవారం యూఎస్ కాన్సుల్ జనరల్ జోయల్ రీఫ్‌మన్ ట్విట్టర్‌లో కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ఫొటోను జత చేశారు.

### సంతోషంగా ఉండాలి

హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

### ఉత్తమ్ శుభాకాంక్షలు

కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్‌కు ట్విట్టర్‌లో శుభాకాంక్షలు తెలిపిన ఉత్తమ్, ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

# కుటుంబం జలసమాధి

మొదటి పేజీ తరువాయి

చివరి సంవత్సరం చదువుతోంది. త్వరలోనే చదువు పూర్తికానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో మూడు నెలలపాటు హౌస్‌సర్జన్ శిక్షణ ఇప్పించాలని తండ్రి నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో జనవరి 26న ఆయన హైదరాబాద్ వెళ్లి కుమార్తె కోసం కొంపల్లిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అందులో కొన్ని సామాన్లు సర్ది ఇంటికి తిరిగి వచ్చారు. మరుసటిరోజు సాయంత్రం 4 గంటల సమయంలో భార్య, కూతురుతో కలిసి బ్యాంకు కాలనీలోని ఇంటి నుంచి ఏపీ15బీఎన్ 3438 అనే నంబర్ గల కారులో హైదరాబాద్ బయలుదేరారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం లేదు. బంధువులు ఎన్నిసార్లు కాల్ చేసినా ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో నాలుగైదు రోజుల తర్వాత వారి నివాసానికి వెళ్లి సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. ముగ్గురూ కలిసి కారులో వెళ్లినట్టు గుర్తించారు. అయినప్పటికీ అనుమానంతో ఇంటితాళం పగలగొట్టి లోపలకి వెళ్లి చూశారు. అనుమానాస్పదంగా ఏమీ లేకపోవడంతో ఏదైనా టూర్‌కి వెళ్లి ఉంటారని భావించి మరో తాళం వేసి వెళ్లిపోయారు.

**టూర్ వెళ్తున్నానని చెప్పిన సహస్ర..**

జనవరి 26వ తేదీ కంటే ముందు సహస్ర ఇంటికి వచ్చింది. తాము టూర్‌కు వెళ్తున్నట్టు తన స్నేహితురాళ్లకు చెప్పింది. నాలుగైదు రోజులు గడిచినా ఆమె రాకపోవడంతో వారు ఫోన్ చేశారు. అది స్విచ్ఛాఫ్ వచ్చింది. సుమారు వారం రోజులకు ఈ విషయం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తెలియంతో ఆయన తన చెల్లెలి కుటుంబం ఎక్కడుందో తెలుసుకునే ప్రయత్నాలు చేశారు. పనిమనిషిని అడగ్గా.. పది పదిహేను రోజులు టూర్ వెళ్తున్నట్టుగా తనకు చెప్పారని ఆమె వెల్లడించింది. హైదరాబాద్‌లో ఇల్లు అద్దెకు తీసుకున్న కొంపల్లిలో విచారించగా అక్కడికి కూడా రాలేదని తెలిసింది. ఫోన్ ట్రాకింగ్ చేసి చూస్తే కరీంనగర్‌లోనే సిగ్నల్ చూపించింది. అయితే, తరచూ యాత్రలకు వెళ్లే అలవాటున్న చెల్లెలు కుటుంబం దుబాయ్ వెళ్లి ఉండొచ్చని ఎమ్మెల్యే భావించినట్లు ఆయన బంధువులు తెలిపారు. అయితే ఇంత జరిగినా పోలీసులకు మాత్రం ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సత్యనారాయణరెడ్డి స్నేహితుడు ఒకరు కరీంనగర్ మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పటికీ, సీఐ లేకపోవడంతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయకుండానే తిరిగి వచ్చారు.

**విషయం వెలుగుచూసింది ఇలా..**

ఆదివారం రాత్రి పరాంకుశం వెంకటనారాయణ ప్రదీప్, కీర్తన దంపతులు బైక్‌పై కరీంనగర్ నుంచి గన్నేరువరం బయల్దేరారు. అల్గునూర్ శివారులోని కాకతీయ కాలువ వద్దకు రాగానే బైక్ లైటు వెలుతురుకు భారీగా పురుగులు వచ్చాయి. అవి ప్రదీప్ కళ్లలో పడటంతో బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో అటు వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు కాలువలో కొట్టుకుపోతున్న ప్రదీప్‌ను కాపాడారు. కీర్తన గల్లంతయ్యారు. దీంతో ఆమె కోసం గాలించేందుకు ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి కాలువకు నీటి విడుదల నిలిపివేయించారు. గజఈతగాళ్లు కీర్తన కోసం గాలించగా.. మానకొండూరు మండలం ముంజపల్లి వద్ద ఆమె మృతదేహం లభించింది. కాలువలో నీటి ప్రవాహం తగ్గడంతో గతనెల 27న అందులో పడిపోయిన సత్యనారాయణరెడ్డి కారు బయట పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని కారుని బయటకు తీయించారు. కారు నంబర్ ఆధారంగా అది సత్యనారాయణరెడ్డి పేరున ఉన్నట్టు గుర్తించారు. ఆయన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి స్వయానా బావ అని తెలుసుకుని ఆయనకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి హుటాహుటిన వచ్చిన మనోహర్‌రెడ్డి.. కారును పరిశీలించి తన బావ కారుగా నిర్ధారించారు. అందులో ఉన్న మూడు మృతదేహాలను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. గతనెల 27న ఇంట్లో నుంచి వెళ్లారని, అప్పటినుంచి తెలిసినవారి ఇళ్లలో ఆరా తీస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్ వెళ్తున్నట్టు పొరుగువారికి చెప్పారని, ఆ క్రమంలో ప్రమాదవశాత్తు కాలువలో పడి ఉంటారని పేర్కొన్నారు. సంఘటనపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని, ఆత్మహత్య చేసుకునేంత ఇబ్బందులు కూడా వారికి లేవని వెల్లడించారు.

**ఆత్మహత్యకు అవకాశం తక్కువే!**

సత్యనారాయణరెడ్డి కుటుంబం మృత్యువాత పడడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నా.. అది ప్రమాదమేనని పోలీసులు భావిస్తున్నారు. ఇరుకుగా ఉన్న వంతెనపైకి రాకముందే కారు పూర్తిగా ఎడమవైపు వచ్చి కాలువలో పడి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. ఒకవేళ రెయిలింగ్‌ను తాకి కారు ప్రమాదానికి గురై ఉంటే రోడ్డుపై వెళ్లేవారికి తెలిసేదని అంటున్నారు. జరిగిన సంఘటనను పరిశీలిస్తే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కొంచెం కూడా కనిపించడంలేదని పోలీసులు చెబుతున్నారు. పైగా ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు అనామకులుగా చనిపోవాలని భావించరని, కారుతోపాటు కాలువలోకి వెళ్లాలనుకోరన్నది వారి వాదన. అక్కడ సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తే ఏం జరిగిందో తెలిసే అవకాశం ఉంది.

### కారులో సామాన్లు సర్ది వచ్చాను

గతనెల 27న మా సార్ల్ వాళ్ళు ఊరెళుతున్నారని చెప్పడంతో బెడ్‌షీట్లు, రైస్‌కుక్కర్‌తోపాటు కొని సామాన్లు కారులో పెట్టి వచ్చాను. అదేరోజు సాయంత్రం సత్యనారాయణరెడ్డి సారు రాధ మేడం ఫోన్ నుంచి నుంచి కాల్ చేసి తన ఫోన్‌లో బ్యాలెన్స్ అయిపోయిందని, రీచార్జి చేయించాలని చెప్పారు. నేను వెంటనే రీచార్జి చేయించాను. మరుసటిరోజు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. నాలుగైదు రోజులు ఫోన్ కలవకపోవడంతో మా సార్ స్నేహితులు, బంధువుల షాప్‌కు వస్తున్నాడా అని నన్ను అడిగారు. ఇన్ని రోజులుగా మా సార్ వస్తారని ఎదురుచూస్తూ ఉన్నాను.

– నర్సింగ్, సత్యనారాయణరెడ్డి షాపులో పనిచేసే వ్యక్తి

### అన్ని కోణాల్లో దర్యాప్తు

పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బావ నారెడ్డి సత్యనారాయణరెడ్డి కారు కాలువలో పడి, ఆయనతో పాటు భార్య రాధ, కుమార్తె సహస్ర మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నాం. ఈ ఘటనపై గతంలో మాకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఏ పోలీస్ స్టేషన్‌లోనూ మిస్సింగ్ కేసు కూడా నమోదు కాలేదు. ప్రమాదం ఎలా జరిగిందనేదానిపై విచారణ జరుపుతాం. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎలాంటి అనుమానాలు లేవని నిర్ధారించినందున ప్రమాదవశాత్తూ కారు కాలువలో పడి ఉంటుందని భావిస్తున్నాం. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ సీపీ

### ప్రమాదమేనని తేలింది

సత్యనారాయణరెడ్డి కుటుంబం చనిపోయిన ఘటన ప్రాథమిక విచారణలో ప్రమాదమే అని తేలింది. వీలైనంత తొందరగా విచారణ పూర్తిచేస్తాం. ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరిగిందనే విషయాలు దర్యాప్తులో బయట పడతాయి.

– నితికాపంత్, ట్రైనీ ఐపీఎస్

# 'జీఎస్టీ'లో దూకుడు

మొదటి పేజీ తరువాయి

అంచనాలతో సమానంగా లేదంటే అంతకు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉందని పన్నుల శాఖ వర్గాలు చెపుతున్నాయి. కాగా, జీఎస్టీ వసూళ్లలో రాష్ట్ర పనితీరును 15వ ఆర్థిక సంఘం కూడా మెచ్చుకుంది.

**2019–20 ఆర్థిక సంవత్సరంలో వసూలైన జీఎస్టీ వివరాలు**

| నెల | వసూలైన మొత్తం రూ. కోట్లలో |
|---|---|
| ఏప్రిల్–19 | 1,573.95 |
| మే | 1,364.47 |
| జూన్ | 3,387.93 |
| జూలై | 1,884.79 |
| ఆగస్టు | 3,427.88 |
| సెప్టెంబర్ | 1,186.26 |
| అక్టోబర్ | 1,271.98 |
| నవంబర్ | 4,121.21 |
| డిసెంబర్ | 2,129.83 |
| జనవరి–20 | 3,787 |
| మొత్తం | 24,135.3 |

# ఇక బీఎస్సీ డేటా సైన్స్, బీకాం అనలిటిక్స్

మొదటి పేజీ తరువాయి

డిగ్రీలను కూడా ప్రవేశపెట్టాలని భావిస్తోంది. రెగ్యులర్ డిగ్రీల కంటే ఆనర్స్ డిగ్రీల్లో 20 నుంచి 30 క్రెడిట్స్ ఎక్కువగా ఇచ్చి అమలు చేయాలని యోచిస్తోంది. ఇవి కాకుండా కాలేజీలు ముందుకొస్తే బీఎస్సీ మెషీన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అయితే ఈ కోర్సులను ముందుగా సోషల్ వెల్ఫేర్ గురుకులాలు, అటానమస్ కాలేజీలు, ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అలాగే నాణ్యత ప్రమాణాలు పాటించే, ఆయా కోర్సులను నిర్వహించగలిగే సత్తా కలిగిన టాప్ ప్రైవేటు కాలేజీల్లోనూ ఆయా కోర్సులను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే ఆయా సబ్జెక్టులను బోధించే ఫ్యాకల్టీకి ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో పారిశ్రామిక వర్గాలను భాగస్వాములను చేయనుంది. సమావేశంలో కమిటీ సభ్యులు, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్లు ఆర్.లింబాద్రి, వెంకటరమణ, ఓయూ మాజీ వీసీ ఎస్.రామచంద్రం, ప్రొఫెసర్లు ఫాతిమా బేగం, జయశ్రీ, ఓయూ రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, టీసీఎస్, కాగ్నిజెంట్ నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.





సోమవారం సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా స్టేట్ హోంలో వీణావాణీలతో కేక్ కట్ చేయిస్తున్న హిమాంశు



సీఎం కేసీఆర్‌కు మొక్కను అందజేస్తున్న మంత్రి సత్యవతి



సీఎంకు మొక్కను అందజేస్తున్న మంత్రి సబిత. చిత్రంలో కార్తీక్ రెడ్డి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సీఎంకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంత్రి తలసాని



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీఐఐసీ చైర్మన్ రోజాతో హిమాంశు కరచాలనం



మొక్కను నాటుతున్న ఎంపీ సంతోష్. చిత్రంలో పుల్లెల గోపీచంద్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్



మొక్కను నాటుతున్న సీఎస్ సోమేశ్ కుమార్



మంత్రి జగదీశ్‌రెడ్డి



మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



తెలంగాణ లోకాయుక్త సీవీ రాములు

# రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు 66వ జన్మదినం సందర్భంగా రాష్ట్రపతి, ప్రధానితో సహా దేశం నలుమూలల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సుఖ సంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో నిండు జీవితం గడపాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఫోన్ ద్వారా సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. చిరకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. 'జన్మదిన శుభాకాంక్షలు సీఎం కేసీఆర్ గారూ, ఆరోగ్యంగా, సంతోషంగా రాబోయే రోజుల్లో మరింత ప్రజా సేవ చేయాలని కోరుకుంటున్నా'అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాశ్ బిర్లా కూడా కేసీఆర్‌కు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ అనుసూయ ఉయికె, పంజాబ్ గవర్నర్ వీపీ సింగ్ బద్నోర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, సీఎంలు జగన్, మమతా బెనర్జీ తదితరులకు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

## సందడిగా ప్రగతి భవన్

కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల, అకాడమీల చైర్మన్లు, అధికారులు, వివిధ రంగాలకు చెందిన వారితో సోమవారం ప్రగతిభవన్ పరిసరాలు సందడిగా మారాయి. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన పాటల సీడీని ఈ సందర్భంగా సీఎం విడుదల చేశారు.

# ముఖ్యమంత్రికి పచ్చని బహుమతి

## హైదరాబాద్‌తో సహా వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటిన అటవీశాఖ సిబ్బంది...

- పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, రాజేశ్వర్ తివారి, ఇతర అధికారులు
- వివిధ శాఖల ఆధ్వర్యంలోనూ మొక్కలునాటే కార్యక్రమం

**సాక్షి, హైదరాబాద్:** సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో పాలపిట్ట, సైక్లింగ్ పార్కుల్లో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ రఘువీర్, కెనరా బ్యాంకు జీఎం వీరభద్ర రెడ్డి, డీజీఎం చక్రవర్తులు మొక్కలు నాటారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ సంజీవని వనం అర్బన్ ఫారెస్ట్ పార్కులో అటవీశాఖ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారి, ఇతర అధికారులు మొక్కలు నాటారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో మొక్కలు నాటారు. నగరంలోని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్, రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ) ప్రాంగణంలో ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ సి.పార్థసారథి, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారులు ఎస్‌డి ముఖర్జీ, ఎం.భాంజా, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి, వివిధ విభాగాల అధిపతులు, సైంటిస్టులు, ఈపీటీఆర్ఐ ఉద్యోగులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన హోంమంత్రి

తెలంగాణ పోలీసులు లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చేస్తూ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచారని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా, రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి, నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్‌లతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐజీ మల్లారెడ్డి, నగర అదనపు కమిషనర్లు చౌహాన్, స్వాతి లక్రా, నగర ట్రాఫిక్ పోలీసు కమిషనర్ అనిల్ కుమార్, జాయింట్ సీపీలు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ డీసీపీలు తదితరులు పాల్గొన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున మొక్కలు నాటారు. డీజీపీ స్థాయి నుంచి హోంగార్డ్‌ల వరకు తప్పని సరిగా మొక్కలునాటాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో అన్ని జిల్లాలు, పోలీస్ సంస్థల్లో నేడు ఒక్క రోజే 56,872 మొక్కలను నాటారు.

### ట్రెసా ఆధ్వర్యంలో...

కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం సీసీఎల్ఏ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి, ఇతర ట్రెసా నాయకులు మొక్కలు నాటారు.

### 80 వేల మొక్కలు నాటిన పీఆర్‌టీయూటీఎస్

కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 80 వేల మొక్కలను నాటినట్లు పీఆర్‌టీయూ–టీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు తెలిపారు. ప్రగతి భవన్‌లో సోమవారం వారు సీఎం కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నారాయణగూడలోని పీఆర్‌టీయూ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, జీడిమెట్ల పాఠశాలలో మరో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మొక్కలు నాటారు.

### పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో..

పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, రైస్ మిల్లుల ఆవరణలు, పెట్రోల్ బంకుల వద్ద మొక్కలు నాటినట్లు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### టీఎన్‌జీవో, టీజీవో కార్యాలయాల్లోనూ...

కేసీఆర్ జన్మదినం సందర్భంగా పలువురు అధికారులు, సంఘాల నేతలు కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుడు సి.విఠల్, టీఎన్‌జీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారెం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.మమత, సత్యనారాయణ సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే టీఎన్‌జీవో, టీజీవో కార్యాలయాల్లో మొక్కలు నాటారు.

# సీఏఏపై లౌకికపార్టీలతో కలిసి ఉద్యమించాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మొండిగా వ్యవహరిస్తున్నందున, సీఏఏకు వ్యతిరేకంగా రాష్ట్రంలో లౌకికవాద పార్టీలతో కలిసి ఉద్యమించాలని సీఎం కేసీఆర్‌కు సీపీఐ విజ్ఞప్తి చేసింది. సీఏఏను రద్దు చేయాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానించడం హర్షణీయమని, పౌరసత్వం విషయంలో మతపరమైన వివక్ష తగదని సీఎం పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా అసెంబ్లీలో కూడా సీఏఏ రద్దుపై తీర్మానం చేయాలని నిర్ణయించడాన్ని ఆహ్వానిస్తున్నట్టు సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# అధర్ సిన్హా బదిలీ

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హాను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆయన్ను సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

# భాష ఏదైనా.. నో ప్రాబ్లం!

## ఐఐఐటీ హైదరాబాద్ వినూత్న ఆవిష్కరణ.. 'లిప్‌గాన్ మాడ్యూల్'

- వీడియో క్లిప్స్‌ను ఒక భాష నుంచి మరో భాషలోకి అనువదించే టూల్
- యానిమేషన్, డబ్బింగ్, మీడియా, ట్రాన్స్‌లేషన్ రంగాలకు ఉపయుక్తం



**సాక్షి, సిటీబ్యూరో:** మీరు ఆంగ్లభాషలోని ఓ వీడియో క్లిప్పింగ్ వీక్షిస్తున్నారనుకోండి. ఆ క్లిప్‌లో మాట్లాడుతున్న వ్యక్తి భాష, లిప్‌మూమెంట్ అర్థంకాక తల పట్టుకుంటున్నారా?.. ఇకపై ఆ అవస్థలు తీరనున్నాయి. భాష ఏదైనా, ఆ మాట్లాడే వ్యక్తి భావాన్ని యథాతథంగా తెలుగు ఆడియో క్లిప్ ద్వారా మీకందించే సరికొత్త టూల్‌ను ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ– హైదరాబాద్ (ఐఐఐటీ–హెచ్) రూపొందించింది. మిషన్ లెర్నింగ్ సాంకేతికతలో ఇదో సరికొత్త ఆవిష్కరణ అని ఐఐఐటీ వర్గాలు చెబుతున్నాయి. వీడియో క్లిప్‌ను ఒక భాష నుంచి మరో భాషలోకి తేలికగా అనువదించేందుకు ఈ టూల్ అద్భుతంగా పనిచేస్తుందని ఐఐఐటీ–హెచ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ సీవీ జవహర్ తెలిపారు.

### లిప్‌గాన్ మాడ్యూల్

డీన్ జవహర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంగ్లిష్ భాష నుంచి పలు భారతీయ భాషల్లోకి వివిధ రకాలైన వీడియో క్లిప్‌లను ఈ టూల్ ద్వారా తర్జుమా చేసుకోవచ్చు. డబ్బింగ్ సినిమాలు, యానిమేషన్, మీడియా రంగాలకు ఈ టూల్ ఉపయుక్తంగా ఉంటుంది. పెదాల కదలికల ఆధారంగా జరిగే సంభాషణ కూడా ఎలాంటి పొరపాట్లు లేకుండా, లిప్ సింక్రనైజేషన్ మిస్ కాకుండా తర్జుమా చేసుకోవచ్చు. టెక్నాలజీ పరిభాషలో ఈ ఆవిష్కరణను 'లిప్‌గాన్ మాడ్యూల్' అంటారు. తర్జుమా అయ్యే భాషకనుగుణంగా ఈ మాడ్యూల్ వీడియో క్లిప్‌లోని వ్యక్తి లిప్ మూమెంట్‌ను సరిచేస్తుంది. కొన్నిసార్లు డబ్బింగ్ సినిమాల్లో లిప్ మూమెంట్ సరిగ్గా లేక వీడియో క్లిప్ నాణ్యత అంతగా ఉండదు. లిప్‌గాన్ మాడ్యూల్‌తో అటువంటి అవస్థలుండవు. దీని ద్వారా గంటల నిడివి ఉన్న వీడియోలను సైతం సులభంగా భారతీయ భాషల్లోకి తర్జుమా చేసుకోవచ్చు. ఈ మెషీన్ టూల్‌పై 'టువార్డ్స్ ఆటోమేటిక్ ఫేస్ టు ఫేస్ ట్రాన్స్‌లేషన్'పేరుతో పరిశోధన పత్రాన్ని సిద్ధం చేశారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన అంతర్జాతీయ మల్టీమీడియా సదస్సులోనూ దీన్ని సమర్పించారు. మరిన్ని పరిశోధనలు, ప్రయోగ పరీక్షల అనంతరం ఈ మిషన్ లెర్నింగ్ సాంకేతికతను ఆయా రంగాలు వినియోగించుకునేలా తీర్చిదిద్దుతారు.

# ఇదే లాస్ట్ చాన్స్!

మొదటి పేజీ తరువాయి

దీనికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కంప్యూటర్ రంగంలో పని చేసేవారికి అమెరికా ఏటా 85 వేల మందికి హెచ్1బీ వీసాలు మంజూరు చేస్తోంది. కానీ, భారత్ నుంచి ఉన్నత విద్యకు వెళ్లి ఆపైన హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య 2016లోనే లక్ష దాటింది. ఈ ఏడాది భారతీయుల సంఖ్య 1.5 లక్షలు దాటుతుందని న్యూయార్క్‌కు చెందిన హెచ్1బీ వ్యవహారాల నిపుణుడు అటార్నీ నీల్ ఏ వెయిన్‌రిచ్ అంచనా వేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో హెచ్1బీ వీసా కోసం దరఖాస్తు చేసే భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల సంఖ్య 2 లక్షలు దాటినా ఆశ్చర్యం లేదని, వారిలో 65 నుంచి 70 వేల మందికి మాత్రమే వీసాలు దక్కుతాయని చెబుతున్నారు.

### తెలుగు రాష్ట్రాల నుంచి 24 వేల మంది!

ఓపీటీ గడువు దాటుతున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు 20 నుంచి 24 వేల మంది ఇంజనీర్లు ఉంటారని అంచనా. నిర్ణీత గడువులో వీసా రాకపోతే స్వదేశానికి వెళ్లి మళ్లీ హెచ్1బీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బంది లేని భారతీయ టెకీలు అక్కడే ఉండేందుకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. 'డబుల్ డిగ్రీ ఓ ప్రయాస. మా విశ్వవిద్యాలయంలో డబుల్ కోర్సు చేసిన అనేక మంది విద్యార్థులు చివరికి వారికి తగిన ఉద్యోగాలు రాక కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలకు వెళ్లారు. ఉద్యోగం కోసమే అమెరిక వస్తే సమస్యలు తప్పవు'అని యూనివర్సిటీ అఫ్ కాలిఫోర్నియా (బర్కిలీ) కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ ఎరిక్ అలెన్ బ్రూవర్ ఇటీవల న్యూయార్క్ టైమ్స్‌కు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం వస్తున్న వారు ఉపాధి అవకాశాలను లక్ష్యం చేసుకుని వస్తున్నారా లేదా విజ్ఞానం పెంపొందించుకోవడానికి వస్తున్నారా అనే దానిపై భారత్ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఇటీవల ముంబైలో యూనివర్సిటీ అఫ్ సదరన్ కాలి ఫోర్నియ ప్రొఫెసర్ బారీ విలియమ్స్ అన్నారు.

### హెచ్1బీ ఉన్న వారి కోసం వేట

వీసా సమస్య నుంచి బయటపడేందుకు భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు హెచ్1బీ వీసా కలిగి ఉన్న వారిని జీవిత భాగస్వాములను చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలో హెచ్1బీ వీసా ఉన్న వారి సంబంధాలు చూడాలని భారత్‌లో తమ తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారు. హెచ్1బీ వీసా కలిగి ఉండి (గ్రీన్‌కార్డు కోసం వెయిటింగ్‌లో ఉంటే) జీవిత భాగస్వాములు ఉద్యోగం చేసుకునే వీలు ఉంటుంది. గ్రీన్‌కార్డు కోసం వెయిటింగ్‌లో లేని హెచ్1బీ వీసా అబ్బాయి లేదా అమ్మాయిని పెళ్లి చేసుకుంటే అమెరికాలో చట్టబద్ధంగా ఉండేందుకు అవకాశముంది. ఇప్పుడు భారత్‌లో మ్యారేజ్ బ్యూరోలు దీన్నో లాభసాటి వ్యాపారంగా మలుస్తున్నాయి.

### హెచ్1బీ రాకపోతే భారత్‌కు వెళ్లిపోతా..

2015లో అమెరికా వచ్చి అలబామ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేశా. 2017లో ఓపీటీ కార్డు రావడంతో శాన్‌ఫ్రాన్సిస్‌కోలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరా. 2018, 2019లో హెచ్1బీ కోసం దరఖాస్తు చేశా. లాటరీలో నా దరఖాస్తు పిక్ కాలేదు. ఈ ఏడాదైనా లాటరీలో పిక్ అవుతుందన్న ఆశతో ఉన్నా. లేదంటే భారత్ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నా.

- గాయం రామాంజనేయరెడ్డి, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

### పీహెచ్‌డీలో చేరుతా..

ఈ ఏప్రిల్‌లో నాకు హెచ్1బీ వీసా రాకపోతే పీహెచ్‌డీలో చేరుదామని అనుకుంటున్నా. ఒక్లహమా విశ్వ విద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేసి ప్రస్తుతం షికాగోలో సిస్టమ్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నా. ఇప్పటికీ 2 సార్లు నా దరఖాస్తు రిజెక్ట్ అయ్యింది. ఈసారి కూడా అదే జరిగితే ఉద్యోగం ద్వారా ఇప్పటిదాకా సంపాదించి దాచుకున్న మొత్తాన్ని పీహెచ్‌డీ కోసం ఖర్చు చేస్తా. తిరిగి ఇండియా వెళ్లాలన్న ఆలోచన లేదు.- వల్లబ్‌రెడ్డి సతీశ్, కోదాడ, నల్లగొండ జిల్లా

# 'దిశ' ఘటనను ఉద్వేగభరితంగా మలుస్తాను

## శంషాబాద్ ఏసీపీని కలిసిన దర్శకుడు రాంగోపాల్ వర్మ



**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనమైన 'దిశ'ఘటనను తనకున్న సామర్థ్యంతో ఉద్వేగభరితంగా చిత్రం తీసేందుకు యత్నిస్తున్నానని ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ అన్నారు. 'దిశ'చిత్ర కథను తయారు చేసుకునే క్రమంలో సోమవారం శంషాబాద్ ఏసీపీ అశోక్‌కుమార్‌తో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కథ పరిశోధనలో ఉండటంతో అందులో ప్రధానమైన అంశం ఏమిటనేది ఇప్పుడే చెప్పలేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సంచలనమైన సంఘటన కాబట్టి దిశ తల్లిదండ్రుల అనుమతి కూడా అవసరం లేదని ఆయన ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

# ఎన్‌పీఆర్‌పై సమాచార సేకరణ ఆపేయండి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** జాతీయ పౌర పట్టిక (ఎన్‌పీఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి విరుద్ధంగా జిల్లా కలెక్టర్లు దీని అమలుకు జిల్లా యంత్రాంగాలను సమాయత్తం చేయడంపై విచారణ జరిపించాలని సీపీఎం కోరింది. వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ ఎన్‌పీఆర్‌కు అవసరమైన అప్‌డేటెడ్ సమాచారం సేకరించమని ఈ నెల 8న ఆ జిల్లా యంత్రాంగానికి సర్క్యులర్ పంపించిన అంశంపై విచారించాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో విజ్ఞప్తి చేసింది. వెంటనే ఎన్‌పీఆర్ సమాచార సేకరణ నిలుపుదలకు అవసరమైన చర్యలు చేపట్టి, వివాదాస్పదమైన సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీలను రాష్ట్రంలో అమలుకాకుండా చూడాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. సీఎంకు రాసిన లేఖతోపాటు వరంగల్ రూరల్ కలెక్టర్ జిల్లా అధికారులకు పంపించిన సర్క్యులర్ ప్రతిని కూడా జతచేశారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED Energetic Agricultural Graduates as
RETAIL OUTLET MANAGERS
to look after Retail Sale of various Agro Inputs
like Agro Chemicals,Fertilisers,Growth Promoters Etc.
Qualification : B.Sc.(Agri )- 5 Years Exp. M.Sc.(Agri)-5 Years Exp.
For Field Promotion-Qualification:Dip(Agri)-5 Years Exp.
Mail your Resume to: goretail20@gmail.com



## 6, 7, 8 తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6, 7, 8వ తరగతుల్లో (ఇంగ్లిషు మీడియం) ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్యభట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు ఈ నెల 29లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులు mjptbcwreis.telangana.gov.in, mjptbcwreis.cgg.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్ ఫోన్: 0878-2950033
No.SE: 23/19-20 నుండి 30/19-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 13.02.2020
ఈ క్రింది రాజన్న సిరిసిల్లా జిల్లాలోని చెక్‌డ్యాం నిర్మాణం పనుల యొక్క బిడ్లను ఆహ్వానించడమైనది. డివిజన్ పేరు: రాజన్న సిరిసిల్లా డివిజన్ పరిధిలోని మూలవాగుపై (8) చెక్‌డ్యాంల నిర్మాణం, మొత్తం అంచన విలువ: రూ.3383.79 లక్షలు, టెండర్లు స్వీకరించు చివరి తేది మరియు సమయం: 25.02.2020 మ॥3.00 గంటల వరకు. గమనిక: మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ tender.telangana.gov.in శ్రీ జి.అశోక్ కుమార్, బి.ఇ., పర్యవేక్షక ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I&CADD, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్
DIPR RO.No.2458-DP/CL/Advt/1/2019-20, Dt: 17.02.2020

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, PIU డివిజన్, కొత్తగూడెం
NIT No.78 to 103/2019-20 టెండరు ప్రకటన తేది: 05.02.2020
పనుల సంఖ్య: (26), పనుల పేర్లు: అశ్వరావు పేట మండలంలోని వేదాంతపురం మరియు వివిధ గ్రామాల వద్ద అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం మరియు ఇతర ఇదేతరహా అన్ని సివిల్ పనులు కోసం దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.2.08 కోట్లు. టెండరు షెడ్యూలను 12.02.2020 నుండి 19.02.2020 సా.5.00 గం. వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాలను www.tenders.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును.
సం/- జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్, PIU డివిజన్, కొత్తగూడెం
DIPR RO.No.2459-DP/CL/Advt/1/2019-20, Dt: 17.02.2020

నోటిఫైడ్ ఏరియా కమిటీ కార్యాలయం
హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఏరియా
శంషాబాద్ - తెలంగాణ రాష్ట్రం
టెలిఫ్యాక్స్: 040-24008258
టెండరు నోటీసు
టెండరు నం.36/NAC/Tender/2019 తేది: 18.02.2020
"శంషాబాద్, RGIA, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఏరియాలో డ్రైనేజ్ సిస్టం మెరుగుపరుచుట - R1 రిజర్వాయర్ బండ్ పటిష్టపరుచుట" పనుల కోసం ఇదేతరహా పనులలో అనుభవం ఉన్న మరియు ఇంతకుముందు ఆం.ప్ర. ప్రభుత్వం లేదా తెలంగాణ ప్రభుత్వంతో తగిన ఇ-రిజిస్ట్రేషన్ శ్రేణి కలిగిన అర్హతగల కాంట్రాక్టర్ల నుండి నోటిఫైడ్ ఏరియా కమిటీ (NAC) ఇ-టెండర్ కోరుతోంది. ECV: రూ.1,12,58,217/-. ఆన్‌లైన్ దరఖాస్తు లభ్యత: 18.02.2020 - 10.30 గం. నుండి 04.03.2020 - 1.00 గం. వరకు. టెండరు ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది: 04.03.2020 - 3.00గం. బిడ్లు తెరుచుట: 05.03.2020 - 16.00 గం. వివరాలకు దర్శించండి వెబ్‌సైట్: www.e-procurement.gov.in
DIPR Ro.No.677-PP/CL/Advt/1/2019-20, Dt: 17.02.2020 సం/- ఫుల్‌టైమ్ ఆఫీసర్-NAC

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507
RECRUITMENT FOR THE POSITION OF POST-DOCTORAL RESEARCH FELLOW (PDRF)
IISER Tirupati invites online applications for Post-Doctoral Research Fellow funded project on "NF-kB signaling in the immune system and cancer" by the Wellcome Trust/DBT India Alliance from Indian nationals having excellent academic record and relevant work experience. For detailed advertisement, please visit www.iisertirupati.ac.in and click on the link"Opportunities".
The last date for sending your Application / CV is March 08, 2020.
Advt. No. 05/2020/IISER-T/Rect./14-02-2020 Sd/- Registrar

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution under Ministry of HRD., Govt. of India)
Karakambadi Road, Tirupati - 517 507
IISERT/PUR/0753/19 18/02/2020
EXPRESSION OF INTEREST FOR PROVIDING OF DESIGN, DEVELOPMENT AND MAINTENANCE OF IISER TIRUPATI WEBSITE
A pre-indent conference is proposed to be held on 28th February, 2020 at IISER, Tirupati with the prospective manufactures, their authorized channel partners or agents/suppliers to discuss with the Committee on the aspects of Design, Features, Services and any other essential parameters for providing of Design, Development and Maintenance of IISER Tirupati website.
For further details please visit our website http://www.iisertirupati.ac.in
Director

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Head Office:10-152/1, Sri Sai Towers, Bandar Road Kanuru, Vijayawada-520007.
Lr.No.PDS.3/ 32/ PU (PPP)/ 2019 Dated: 17.02.2020
LAST CALL FOR SHORT TERM TENDER NOTICE FOR APPOINTMENT OF PACKING AGENCY FOR PACKING OF RICE
APSCSCL desires to appoint packing agency for packing of rice in PP bags of 5kg, 10kg, 15kg and 20kg to be utilized for Public Distribution System. In this regard, APSCSCL appoints two types of agencies: 1) Agency for packing of rice under job work with APSCSCL machine in APSCSCL godown. 2) Agency for packing of rice with their own packing machine in the APSCSCL godown. 3) Agency for Storage and packing of rice in their own godown with their own packing machine.
Applications are invited to participate in the tender process for appointment of packing Agency. For details, please visit www.apscsc.gov.in and www.apeprocurement.gov.in (or) contact on 7702003515, 08645-246370/ 71/ 72/ 73/74. Last date for receiving applications along with EMD would be 24th February 2020, 2.00 PM. The EMD shall be transferred through Direct Debit Facility utilizing Debit or Credit Card/ Net Banking / Deposit through system generated challan in e-procurement website.
The date of online reverse auction will be conducted on https://konugolu.ap.gov.in platform as per the time schedule mentioned in the tender document. Sd/-
VC & MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా & మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, రెవెన్యూ సర్కిల్, హైదరాబాద్-500004
టెండరు ప్రకటన
పనిపేరు: 5 సంవత్సరాల కాలానికి మీటర్ల నుండి ఆటోమెటిక్ డాటా సేకరణ, డాటా మెయింటెనెన్స్ మరియు మీటర్ల O&M కోసం HMWSSB అధికార పరిధిలో 25mm డయా మరియు ఆపై సైజులు కలిగిన నాన్-డొమెస్టిక్ మరియు అధిక వినిమయ వినియోగదారుల కోసం LoRaWAN ఉపయోగిస్తూ ఆటోమెటిక్ మీటర్ రీడింగ్‌తో స్మార్ట్ మీటర్స్-అల్ట్రాసోనిక్ రకం మీటర్ల తయారీ, సరఫరా, డెలివరీ, స్థాపన, యాక్టివేషన్ మరియు పని చేయించుట (సదరు మీటర్లు FCRI (ఫ్లూయిడ్ కంట్రోల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) మరియు IP 68 ప్రొటెక్షన్ శ్రేణి నుండి వ్యాలిడ్ లైఫ్‌సైకిల్ టెస్ట్ సర్టిఫికెట్‌తో BIS/OIML-R49/CE/MID (మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ డైరెక్టివ్)-2014/32/EU సర్టిఫికేషన్ మార్క్‌తో లేటెస్ట్ అమెండ్‌మెంట్స్‌తో ISO 4064:2005 నిర్ధారణ కలిగి ఉండవలెను) EP. No.129 to EP No.137 కోసం ప్రకటన యొక్క సవివరమైన షెడ్యూలు www.hyderabadwater.gov.inలో లభ్యమగును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), రెవెన్యూ సర్కిల్, హైదరాబాద్-500004

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
సమగ్ర శిక్షా
స్టేట్ ప్రాజెక్ట్ కార్యాలయం, KBC బాలుర ఉన్నత పాఠశాల క్యాంపస్, రైతు బజార్ ఎదురుగా, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్
ఆసక్తి వ్యక్తీకరణ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం.SSA-16021/4/2019-MIS SEC-SSA, తేది: 17-02-2020
2020-21 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ/ MPP/ ZPP/ మున్సిపల్/ KGBVలు/ మోడల్ స్కూళ్లు/ రెసిడెన్షియల్/ ఎయిడెడ్ స్కూళ్లలో I నుండి X తరగతులు చదువుతున్న (సుమారు 40 లక్షలు) విద్యార్థులందరికి "జగనన్న విద్యా కానుక" పథకం క్రింద (1) మూడు జతల యూనిఫామ్స్ క్లాత్, (2) ఒక సెట్ నోట్‌బుక్స్, (3) ఒక జత షూ మరియు రెండు జతల సాక్స్, (4) ఒక బెల్ట్, (5) ఒక స్కూల్ బ్యాగ్ సేకరణ మరియు సరఫరా కోసం సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ఆసక్తి వ్యక్తీకరణ కోరుతోంది. తదుపరి వివరాల కోసం తేది 22.02.2020 నుండి https://tender.apeprocurement.gov.in దర్శించగలరు. EoI ఫారమ్‌ను వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పైన తెలిపిన సదరు సైట్‌లో ఇవ్వబడిన షెడ్యూళ్ళ ప్రకారం అర్హతగల సంస్థలు నిర్దిష్ట విధానంలో అప్‌లోడ్ చేయవలెను. సంప్రదించవలసిన నం.0866-2428599
సం/- V. చినవీరభద్రుడు, I.A.S, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్.
DIPR Ro No.396PP/CL/ADVT/1/1/2019-2020, Dt: 17/02/2020

# రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర

**బీజేపీపై టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం..**

**ఆ పార్టీ పాలనలో ప్రజలు భయపడుతూ బతుకుతున్నారు**

**సామాజిక న్యాయం అందించేది కాంగ్రెస్ పార్టీనే..**

**కాంగ్రెస్ అధికారంలో లేకపోవడం వల్లే ఈ పరిస్థితి: భట్టి**

**ఇందిరాపార్కు వద్ద ధర్నా.. పాల్గొన్న పార్టీ ముఖ్య నేతలు**



సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్యానంతరం గత 60 ఏళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో దేశంలో నివసించే అన్ని వర్గాల ప్రజలు భయం లేకుండా జీవించారని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత 6 ఏళ్ల బీజేపీ పాలనలో దేశ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తే నేడు బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలు చేయడంలో భాగంగా ఆ రిజర్వేషన్లను ఎత్తేసేందుకు కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. సోమవారం ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, కేంద్ర వైఖరికి నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కోసం సామాజిక న్యాయాన్ని అందించింది కాంగ్రెస్సే అన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు హక్కు కాదని సుప్రీం చెప్పడం పట్ల దేశంలోని దళిత, గిరిజన మైనార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయని, ఇందుకు బీజేపీ ప్రభుత్వం అనుసరించిన వైఖరే కారణమన్నారు. ఆ వర్గాలకు భరోసా కల్పించేందుకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

**టీఆర్‌ఎస్‌లో అలాంటి పరిస్థితి ఉందా?**

కాంగ్రెస్ మూల సిద్ధాంతమే సామాజిక న్యాయమని, తాము ఓట్ల కోసం ధర్నా చేయడం లేదని, ఇప్పట్లో ఎన్నికలు లేవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. రిజర్వేషన్లు ఉండాలని కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటోందని, ఒక దళితుడైన దామోదరం సంజీవయ్యను సీఎంను చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అదే టీఆర్‌ఎస్‌లో అలాంటి పరిస్థితి ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. దళిత సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ తన కేబినెట్‌లో ఒక్క మాదిగ నాయకుడికి కూడా స్థానం ఇవ్వలేదని, గిరిజన, మైనార్టీ రిజర్వేషన్ల గురించి పార్లమెంటులో ఒక్క రోజు కూడా మాట్లాడలేదని విమర్శించారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఏకీభవించబోదని, ఈ విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీలేని పోరాటం చేస్తామని, చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పోరాడుతుందని చెప్పారు.

## బలహీన వర్గాలను అణచివేసే యత్నం: భట్టి

బీజేపీ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ఎత్తివేతకు జరుగుతున్న కుట్ర చాలా ప్రమాదకరమైందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల ప్రజానీకాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలో లేకపోవడం వల్లనే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీల వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకే రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. కేసీఆర్ గిరిజన, మైనార్టీల వ్యతిరేకి అని, అందుకే హామీ ఇచ్చిన రిజర్వేషన్లను అమలు చేయడం లేదన్నారు. రిజర్వేషన్లు ఎత్తేయాలనే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలను అమలు కానీయబోమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్సీ కుంతియా వ్యాఖ్యానించారు. ఈ కుట్రను ఎదుర్కొనేందుకు రాహుల్, సోనియాల నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని చెప్పారు. ధర్నాలో మాజీ మంత్రులు కె.జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, గీతారెడ్డి ,షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పార్టీ నేతలు వీహెచ్, పొన్నం ప్రభాకర్, మధుయాష్కీగౌడ్, సంపత్‌కుమార్, బలరాం నాయక్, రాములు నాయక్, మల్లు రవి, జెట్టి కుసుమకుమార్, దాసోజు శ్రవణ్ కుమార్, కోదండరెడ్డిలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌డేలో కలకలం

- కిరోసిన్ పోసుకున్న యువకుడు
- తండ్రిని బెదిరించి భూమి తీసుకున్నారని ఆరోపణ
- అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు విన్నపం


షేక్ గౌస్ నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ టూటౌన్: తన తండ్రిని బెదిరించి తమకు ఉన్న ఒక ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపిస్తూ ఓ యువకుడు నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన షేక్ గౌస్ తన సోదరి ఆఫ్రిన్‌తో కలసి కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డేకు వచ్చాడు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు కలెక్టర్‌కు, ఇతర అధికారులకు అర్జీలు ఇస్తుండగానే ఉదయం 11.45 గంటల సమయంలో లోనికి వచ్చిన షేక్ గౌస్ తన వెంట బాటిల్‌లో తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుంటుండగా అక్కడే ఉన్న వారు అతడి చేతిలోని బాటిల్‌ను లాక్కున్నారు. ఈ ఘటన కార్యాలయంలో కలకలం సృష్టించడంతో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అతడిని పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. తుమ్మడం గ్రామానికే చెందిన నజీర్ అనే వ్యక్తి తన తండ్రి షేక్ హుస్సేన్ హైదర్‌ను బెదిరించి తమ కుటుంబానికి చెందిన ఒక ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించున్నాడని తెలిపాడు. 2018 సంవత్సరంలో ఇది జరగ్గా, అప్పటినుంచి ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయాడు. గ్రీవెన్స్‌డేలో కూడా నాలుగు నెలల నుంచి పలుసార్లు అర్జీలు ఇచ్చినా తీసుకుంటున్నారు తప్ప తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తానని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ చెప్పడంతో ఆ యువకుడు వెనుదిరిగాడు.

## కలెక్టరేట్ ఎక్కి రైతుల ఆందోళన

- తమ భూమి తమకు ఇప్పించాలని డిమాండ్
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ


కలెక్టరేట్ ఎక్కి ఆందోళన చేస్తున్న రైతులు

సాక్షి, నాగర్‌కర్నూల్: 25 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన తమ భూమిని తమకు ఇప్పించాలని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం చేయడం లేదని 11 మంది రైతులు సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి దూకుతామని ఆందోళనకు దిగారు. కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని భవనంపై నుంచి దూకుతామని రైతులు చెప్పడంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అయితే పోలీసుల జోక్యం, కలెక్టర్ హామీతో వారు ఆందోళన విరమించారు. వివరాలిలా ఉన్నాయి.. శ్రీశైలం నిర్వాసితులైన 11 మంది రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామం గోపులాపురం శివారులో గల 177 సర్వే నంబర్‌లో రెండున్నర ఎకరాల భూమిని 1994లో మశన్న అనే వ్యక్తి నుంచి ఉమ్మడిగా కొనుగోలు చేశారు. ఆ పొలంలో పశువుల షెడ్లను ఏర్పాటు చేసుకుని గడ్డిని పెంచుతున్నారు. అయితే మశన్న కుటుంబానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి వచ్చి తమ గడ్డి వాములను తొలగించి.. భూమిని ఆక్రమించుకున్నాడని ఆ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు, ప్రజావాణి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీంతో వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఆ రైతులను కిందికి దింపి.. కలెక్టర్ శ్రీధర్ వద్దకు తీసుకెళ్లారు. తహసీల్దార్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా?

- గుర్తింపు లేని కాలేజీలపై ఏం చర్యలు తీసుకున్నారు?
- కౌంటర్ పిటిషన్ చూస్తుంటే ఆ కాలేజీలతో కుమ్మక్కైనట్లు ఉంది
- ఇంటర్ బోర్డుపై హైకోర్టు సీరియస్
- శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థలపై పిల్
- విచారించిన హైకోర్టు ధర్మాసనం
- తదుపరి విచారణ 27కి వాయిదా



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో గుర్తింపు లేని కాలేజీలు ఉన్నాయని, వాటిల్లో వేల మంది విద్యార్థులు చదువుతున్నారంటూ ఇంటర్ బోర్డు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. కౌంటర్ పిటిషన్ దాఖలు చేసిన తీరు చూస్తుంటే గుర్తింపు లేకుండా కాలేజీలను నిర్వహిస్తున్న సంస్థల పక్షాన ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నట్లుగా అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఆ కాలేజీలతో చేతులు కలిపినట్లు, కుమ్మక్కైనట్లుగా ఉందని ఘాటు వ్యాఖ్యలు చేసింది. గుర్తింపు లేని కాలేజీలపై చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల జీవితాలతో ఆటాడుకున్నట్లేనని ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు లేని కాలేజీలు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ఇంటర్ బోర్డుతోపాటు ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నారాయణ, శ్రీచైతన్య విద్యా సంస్థలు అనుమతుల్లేకుండా కాలేజీలను నిర్వహిస్తున్నాయని, సెలవుల్లోనూ కాలేజీలను నడుపుతున్నాయని, వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఉప్పల్‌కు చెందిన రాజేష్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం విచారించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం కనీసం 20 వేల మంది విద్యార్థులు గుర్తింపు లేని కాలేజీల్లో చదువుతున్నారని, వాళ్ల జీవితాలతో ఆడుకునే అవకాశం ఇంటర్ బోర్డు కల్పించినట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. విద్యాసంస్థలు చట్టాలను ఉల్లంఘిస్తే రూ.10 లక్షలు చొప్పున విద్యార్థులకు పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు ఒక కేసులో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తుచేసింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కాలేజీలకు గుర్తింపు దరఖాస్తులపై నిర్ణయం తీసుకుంటామని ఇంటర్ బోర్డు చెప్పడంపై ధర్మాసనం స్పందిస్తూ.. హత్య చేసిన వ్యక్తి ఇక ముందు హత్యలు చేయబోనని లిఖితపూర్వకంగా హామీ ఇస్తే హంతకుడ్ని వదిలేస్తామన్నట్లుగా ఉందని ఘాటు వ్యాఖ్య చేసింది.

**జరిమానాలు విధించి వదిలేస్తారా?**

ప్రభుత్వం తరపున ప్రత్యేక న్యాయవాది ఎ.సంజీవ్‌కుమార్ వాదిస్తూ, అఫిలియేషన్ లేకుండా కాలేజీలు నిర్వహిస్తున్న వివిధ విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నారాయణ 79, శ్రీచైతన్య 71 కాలేజీలకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే 46, 49 చొప్పున కాలేజీలకు అనుమతి ఇచ్చామని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. కాగా, మార్చిలో వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో చట్ట ప్రకారం అనుమతులు పొందాలని ఆయా కాలేజీలకు నోటీసులిచ్చినట్లు తెలిపారు. అలాగే అనుమతులు లేని వాటికి భారీగా జరిమానాలు విధించామని తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, తాను అమెరికాలో చదివితే ఢిల్లీ యూనివర్సిటీ ప్రవేశం కోసం చేసుకున్న దరఖాస్తును ఆ వర్సిటీ తోసిపుచ్చిందని గుర్తుచేశారు. పలు విద్యాసంస్థలు చట్టాన్ని ఉల్లంఘించి గుర్తింపు లేకుండానే కాలేజీలను నిర్వహిస్తుంటే జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటే ఎలాగని ధర్మాసనం ప్రశ్నించింది. గుర్తింపులేని కాలేజీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో ఇంటర్ బోర్డు అఫిడవిట్లను దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది.

## జరిమానాలు వసూలు చేశాం..

హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఇంటర్ బోర్డు కార్యదర్శి కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులోని వివరాలు.. 'అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీలు లేకుండా ఉన్న భవనాల్లో నారాయణ 28, శ్రీచైతన్య 18 చొప్పున కాలేజీలు నిర్వహిస్తున్నాయి. ఇంటర్ బోర్డు అనుమతి లేకుండానే వాటిలో కాలేజీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో నారాయణ 4, శ్రీచైతన్య 2 కాలేజీలు ఉన్నాయి. ఒక్కో కాలేజీకి లక్ష రూపాయలు చొప్పున పెనాల్టీ వసూలు చేశాం. ఆ తర్వాతే వాటిని వేరే చోటకు తరలించేందుకు అనుమతి ఇచ్చాం. సెలవుల్లో కూడా ఆ కాలేజీలు తరగతులు నిర్వహించడంతో రోజుకు రూ.50 వేలు చొప్పున జరిమానా విధించాం. రూ.17 లక్షలు నారాయణ, రూ.10 లక్షలు శ్రీచైతన్యలకు జరిమానాగా వసూలు చేశాం. 15 అడుగుల ఎత్తుకుపైగా ఉన్న భవనాల్లో ఆ కాలేజీలను నిర్వహిస్తున్నారు. ఆయా భవనాలకు ఎన్‌వోసీ ఇవ్వరాదని ఇంటర్ బోర్డు అగ్నిమాపక శాఖను కోరింది. అయితే విద్యా సంవత్సరం ముగుస్తున్నందున పలు షరతులతో ఈ ఏడాదికి మాత్రమే అనుమతి ఇచ్చాం. నారాయణ, శ్రీచైతన్యలకు 52 హాస్టల్స్ ఉన్నాయి. హాస్టల్స్‌పై హైకోర్టులో మరో కేసు విచారణలో ఉంది. హైకోర్టు ఆదేశాలిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ రెండు సంస్థలు ఎంసెట్, నీట్, జేఈఈ, ఐఐటీ వంటి అకాడమీలు నిర్వహిస్తోంది. అయితే ఈ అంశంపై ఇంటర్ బోర్డులో ఏ విధమైన రూల్స్ లేవు. ఈ అంశాలను బోర్డు రూల్స్‌లో చేర్చుతాం. ఇప్పటికే నారాయణ, శ్రీచైతన్య కాలేజీలపై ఇంటర్ బోర్డు తనిఖీలు ప్రారంభించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నారాయణ 79, శ్రీచైతన్య 71 కాలేజీల్లో తనిఖీలు చేశాం. మిగిలిన కాలేజీల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తాం'అని కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు.


## పౌరసత్వ సవరణ చట్టాన్ని సీఎం చదివారా?

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**

సాక్షి, హైదరాబాద్: తాను 85 వేల పుస్తకాలు చదివానని చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ అసలు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) చదివారా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నిప్పులు చెరిగారు. మిత్రపక్షం ఎంఐఎంను సంతృప్తి పరిచేందుకే సీఏఏను కేసీఆర్ వ్యతిరేకిస్తున్నారన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఏఏను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్న కేబినెట్ నిర్ణయాన్ని ఖండించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని రాష్ట్రాలు అమలు చేయక తప్పదని రాజ్యాంగం స్పష్టం చేస్తుందన్నారు. సీఏఏ అమలును నిరాకరించేందుకు రాష్ట్రాలకు ఎలాంటి అవకాశం లేదని ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్ సైతం చెప్పారని గుర్తుచేశారు.

**ఏ ముస్లింలకు ఇవ్వాలో చెప్పు?**

సీఏఏ ద్వారా ముస్లింలకూ పౌరసత్వం ఇవ్వాలని చెబుతున్న కేసీఆర్.. ఏ ముస్లింలకు ఇవ్వాలో స్పష్టం చేయాలని లక్ష్మణ్ అన్నారు. పాకిస్తాన్ ముస్లింలా.. బంగ్లాదేశ్ ముస్లింలా.. అఫ్గానిస్తాన్ ముస్లింలా? చెప్పాలన్నారు. కేసీఆర్ వెళ్లి పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ దేశాధినేతలతో మాట్లాడి భారత్‌లో విలీనమయ్యేందుకు వారిని ఒప్పించాలని, అప్పుడు వారికి పౌరసత్వం ఇద్దామన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లలో మతహింసను ఎదుర్కోలేక భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందుతున్న శరణార్థులకు పౌరసత్వం కల్పించే వెసులుబాటును సీఏఏ ఇస్తుందన్నారు. ఈ చట్టంతో దేశంలోని ముస్లింలు సహా భారతీయులెవరికీ సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పాక్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లోని ముస్లింలకు పౌరసత్వం ఇవ్వాలనేది కేసీఆర్ ఉద్దేశమైతే అసెంబ్లీలో తీర్మానం పెట్టి దానిని పాస్ చేయించి, కేంద్రానికి పంపించాలని ఎద్దేవా చేశారు.





# నారీ.. సైన్యాధికారి

- కమాండ్ పోస్టింగ్స్‌లో మహిళా అధికారులను నియమించాలి
- ఆర్మీలో మహిళలకు పర్మనెంట్ కమిషన్ ఏర్పాటు చేయాలి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** కమాండ్ రోల్స్‌లో మహిళా సైనికాధికారుల నియమించే విషయంలో కొనసాగుతోన్న వివక్షకు చెల్లుచీటీ ఇస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం చరిత్రాత్మక తీర్పునిచ్చింది. శారీరక పరిమితులు, సామాజిక కట్టుబాట్ల పేరుతో సైనిక పటాలాల కమాండింగ్ బాధ్యతల్లో మహిళా అధికారులను నియమించకపోవడం తగదని స్పష్టం చేసింది. భారత సైన్యంలో పనిచేస్తోన్న మహిళా అధికారులకు పురుషులతో సమానంగా ఉన్నత బాధ్యతలు నెరవేర్చే అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ భావనను వ్యతిరేకించడమేనని సుప్రీంకోర్టు ప్రతిష్టాత్మక తీర్పునిచ్చింది. అందులో భాగంగానే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లోని మహిళా సైనికాధికారులకు మూడు నెలల్లోగా శాశ్వత కమిషన్(పర్మనెంట్ కమిషన్–పీసీ) ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. గతంలో ఎందరో మహిళా అధికారులు దేశానికి అత్యున్నత పురస్కారాలను తెచ్చిపెట్టిన విషయాన్ని సుప్రీంకోర్టు గుర్తుచేస్తూ సాయుధ దళాలలో లింగపరమైన వివక్షకు ముగింపు పలికేందుకు ప్రభుత్వాలు తమ ఆలోచనావిధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని హితవు పలికింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పుతో.. కమాండ్ పోస్టింగ్స్‌తో పాటు పురుష అధికారులతో సమానంగా పదోన్నతులు, ర్యాంక్స్, పెన్షన్ను, ఇతర ప్రయోజనాలు దక్కనున్నాయి.

**2010 నాటి ఢిల్లీ హైకోర్టు తీర్పుకు సమర్థన**

రక్షణ రంగంలో ఎన్నేళ్ళ సర్వీసు ఉన్నదనే విషయంతో సంబంధం లేకుండా పురుష సైనికుల మాదిరిగానే మహిళా సైనికులకు వృత్తిపరమైన ఎంపిక కోసం శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. మహిళా సైనికుల విషయంలో వివక్ష తగదంటూ 2010లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. పదేళ్లుగా ఈ ఆదేశం అమలుపై కేంద్రం శ్రద్ధ చూపలేదని తప్పు పట్టింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్రం వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ.. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ అజయ్ రస్తోగీల ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది.

**ఆ పరిమితులు అడ్డు కాదు**

సైన్యంలో ఉన్నత పదవులను నిర్వర్తించడంలో మహిళలకు వారి సహజ శారీరక పరిమితులూ, సామాజిక కట్టుబాట్లు అడ్డుగా ఉన్నాయన్న కేంద్రం వివరణను కోర్టు తోసిపుచ్చింది. 'మాతృత్వం, పిల్లల పోషణ లాంటి సవాళ్ళు' కూడా ఉన్నాయన్న కేంద్రం వివరణను కోర్టు తప్పు పట్టింది. మహిళల శారీరక పరిమితులు వారి విధి నిర్వహణకు ఏ విధంగానూ అడ్డురావని కోర్టు స్పష్టం చేసింది.

మహిళా అధికారులకు పర్మనెంట్ కమిషన్ ఏర్పాటును, కమాండ్ పోస్టింగ్స్‌ను నిరాకరించడం ఆందోళనకరమని, ఇది సమానత్వ భావనకు వ్యతిరేకమని ధర్మాసనం తేల్చిచెప్పింది.

**కేవలం 4 శాతమే**

ఆర్మీలో ఉన్న మొత్తం కమిషన్డ్ అధికారుల్లో మహిళా అధికారుల సంఖ్య కేవలం 1,653 అని, అది 4% కన్నా తక్కువేనని గుర్తు చేసింది. 'లింగపరమైన వివక్షతో వారి సామర్థ్యాన్ని తక్కువచేయడం మహిళలుగా వారిని మాత్రమే కాదు.. మొత్తం భారతీయ సైన్యాన్ని అవమానించడమే' అని పేర్కొంది. 'ఎస్ఎస్‌సీలో ఉన్న మహిళాఅధికారులందరికీ శాశ్వత కమిషన్‌ను అనువర్తింపచేయాలి. 14 ఏళ్ల పైబడిన సర్వీస్ ఉన్నమహిళా అధికారులు పీసీలో చేరేందుకు ఇష్టపడనట్లయితే.. పెన్షన్ అర్హతకు అవసరమైన 20 ఏళ్ల సర్వీస్ పూర్తయేంతవరకు విధుల్లో కొనసాగించాలి' అని ధర్మాసనం ఆదేశాలిచ్చింది. కమాండ్ పోస్టింగ్స్‌ను ఇవ్వడంలో అడ్డంకులు కల్పించరాదని స్పష్టం చేసింది. యుద్ధ విధుల్లో మహిళా అధికారుల సేవలను వినియోగించుకోవడం విధానపర నిర్ణయమని ధర్మాసనం పేర్కొంది.

## కేంద్రం మహిళలను అవమానిస్తోంది: రాహుల్



**న్యూఢిల్లీ:** సైన్యంలోని మహిళలను బీజేపీ ప్రభుత్వం అవమానిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మహిళా సైనికాధికారులు శాశ్వత పోస్ట్‌లకూ, కమాండ్ పోస్ట్‌లకూ అర్హులు కారనీ, ఎందుకంటే వారు పురుషులకన్నా తక్కువని సుప్రీంకోర్టుతో కేంద్రం వాదిస్తోందనీ ఆయన వ్యాఖ్యానించారు.

**ఎందులోనూ తక్కువ కాదు: ప్రియాంక గాంధీ**

సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ స్వాగతించారు. మహిళలు పురుషులతో సమానమేనని, వారు ఎందులోనూ తక్కువ కాదని వ్యాఖ్యానించారు. మహిళాధికారాన్ని వ్యతిరేకిస్తోన్న మోదీ ప్రభుత్వానికిది సరైన సమాధానమన్నారు.

# మార్చి 3న ఉరితీయండి

- నిర్భయ దోషులకు తాజా డెత్ వారంట్
- నలుగురు దోషులకూ మార్చి 3 ఉదయం ఉరిశిక్ష అమలు చేయండి
- ఇంకా ఆలస్యం తగదని స్పష్టం చేసిన ఢిల్లీ కోర్టు

**న్యూఢిల్లీ:** నిర్భయపై సామూహిక అత్యాచారం, హత్యకేసులో దోషులకు ఎట్టకేలకు ఉరిశిక్ష అమలుకు తేదీ ఖరారయ్యింది. నలుగురు దోషులకు ఢిల్లీ కోర్టు తాజాగా డెత్ వారంట్ జారీచేసింది. రోజుకో మలుపు తిరుగుతూ యావత్ దేశం దృష్టినీ ఆకర్షిస్తోన్న నిర్భయ కేసులో దోషులకు మార్చి 3న ఉదయం 6 గంటలకు ఉరిశిక్ష అమలుచేయాలని ఢిల్లీ కోర్టు తీర్పునిచ్చింది. ఇంకా దోషులకు శిక్ష అమలును ఆలస్యం చేయడం బాధితుల హక్కులకు భంగకరమని కోర్టు వ్యాఖ్యానించింది.

ముకేశ్ సింగ్(32), పవన్ గుప్తా(25), వినయ్ కుమార్ శర్మ(26), అక్షయ్‌కుమార్(31)లకు మార్చి 3వ తేదీన ఉదయం 6 గంటలకు ఉరి శిక్ష అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. నలుగురు దోషులకు ఉరిశిక్ష విధించాలని కోర్టు ఆదేశించడం ఇది మూడోసారి. జనవరి 7, 2020 తేదీన కోర్టు ఇచ్చిన ఆదేశాలు మార్చి 3న అమలులోకి వస్తాయని ఢిల్లీ కోర్టు సెషన్స్ జడ్జి ధర్మేందర్ రాణా వెల్లడించారు. దోషులకు ఉరిశిక్షను ఖరారు చేస్తూ జనవరి 7, 2020న కోర్టు ఆదేశాలు జారీచేసింది. అయితే జనవరి 17, జనవరి 31న రెండు సార్లు దోషులకు విధించిన మరణశిక్ష వాయిదాపడింది. శిక్ష అమలును ఇంకా వాయిదా వేయడం వల్ల బాధితుల హక్కులకూ, సత్వర న్యాయానికీ నష్టమని కోర్టు అభిప్రాయపడింది.



కోర్టు వద్ద నిర్భయ తల్లిదండ్రులు

'నిర్భయ' కేసులో నలుగురు దోషులకు కొత్తగా డెత్ వారంట్ జారీ చేసేందుకు ట్రయల్ కోర్టును ఆశ్రయించొచ్చంటూ సుప్రీంకోర్టు అధికారులకు స్వేచ్ఛనివ్వడంతో, నిర్భయ దోషుల తల్లిదండ్రులూ, ఢిల్లీ ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తులను పటియాలా హౌజ్ కోర్టు విచారించింది.

**ఉరిశిక్ష అమలుపై నిర్భయ తల్లి ఆశాభావం**

తన కుమార్తె నిర్భయపై సామూహిక అత్యాచారంచేసి, హత్య చేసిన నలుగురు దోషులకూ ఒకేసారి శిక్షపడుతుందని నిర్భయ తల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలు అమలు జరుగుతాయని ఆమె భావిస్తున్నానన్నారు.

**క్షమాభిక్ష కోరతాం: పవన్, అక్షయ్**

పవన్‌గుప్తా సుప్రీంకోర్టులో క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేయాలనీ, రాష్ట్రపతి ఎదుట క్షమాభిక్ష పిటిషన్ వేయాలని భావిస్తున్నట్టు న్యాయవాది రవిఖాజీ కోర్టుకి వెల్లడించారు. అలాగే, అక్షయ్ కూడా త్వరలోనే రాష్ట్రపతికి పూర్తిస్థాయిలో క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేస్తాడని న్యాయవాది ఏపీ సింగ్ కోర్టుకి విన్నవించారు.



నిర్భయ దోషులు వీరే..

**33 నెలలు...**

దోషుల అప్పీల్‌ను 2017, మే 5న సుప్రీం కోర్టు కొట్టివేసింది. 33 నెలల తరువాత కూడా నలుగురు దోషుల్లో ఒకరైన పవన్ గుప్తా ఎటువంటి క్యూరేటివ్ పిటిషన్‌ను గానీ, క్షమాభిక్ష పిటిషన్‌ని కానీ దాఖలు చేయలేదని కోర్టు వ్యాఖ్యానించింది. న్యాయపరమైన అవకాశాలన్నింటినీ వినియోగించుకోని ఏకైక వ్యక్తి పవన్ గుప్తాయేనని కోర్టు వెల్లడించింది.

**వినయ్ శర్మ దీక్ష విరమణ**

తీహార్ జైల్లో వినయ్ శర్మ నిరాహార దీక్ష చేస్తున్న విషయం కోర్టుకి తెలిసింది. ఆ తరువాత అతడు దీక్షను విరమించుకున్నట్టు కోర్టు వెల్లడించింది. వినయ్ మానసిక ఆరోగ్యం సరిగాలేనందున ఉరితీయడం కుదరదనీ అతడి తరపు న్యాయవాది వాదించారు. అయితే కోర్టు ఈ వాదనని తోసిపుచ్చింది.

## బ్రిటిష్ ఎంపీని తిప్పిపంపిన అధికారులు

**న్యూఢిల్లీ/లండన్:** ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన బ్రిటిష్ ఎంపీ దెబోరా అబ్రహామ్స్ సోమవారం ఢిల్లీకి రాగా, అధికారులు ఆమెను తిరిగి దుబాయ్‌కు పంపించారు. ప్రస్తుతం ఆమె లండన్‌లో ఆల్ పార్టీ పార్లమెంటరీ గ్రూప్ ఫర్ కశ్మీర్‌కు చీఫ్‌గా ఉన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు, వీసా ఉన్నప్పటికీ అధికారులు తనను తిప్పి పంపారని ఆమె ట్విట్టర్‌లో చెప్పారు. ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారి తనను దుబాయ్‌కు పంపారన్నారు. ఈ వ్యవహారంపై భారత ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని బ్రిటిష్ హై కమిషన్ తెలిపింది.

# పర్యావరణ రక్షణకు కట్టుబడి ఉన్నాం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**



**న్యూఢిల్లీ/గాంధీనగర్:** పర్యావరణానికి హాని కలగని రీతిలో సుస్థిర, సంతులిత అభివృద్ధి సాధించడం భారత్ అవలంబిస్తున్న విధానమని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలో పెరుగుదల 2 డిగ్రీల సెల్సియల్ లోపే ఉండాలన్న పారిస్ పర్యావరణ ఒప్పందాన్ని అమలు చేస్తున్న అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటని గుర్తు చేశారు. వన్య వలస జాతుల పరిరక్షణపై గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరుగుతున్న 13వ ''కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ–13) ఆఫ్ ద కన్వెన్షన్ ఆన్ ది కన్సర్వేషన్ ఆఫ్ మైగ్రేటరీ స్పీషీస్ ఆఫ్ వైల్డ్ ఎనిమల్స్(సీఎంఎస్)''ని ఉద్దేశించి ప్రధాని మోదీ సోమవారం వీడియో మాధ్యమం ద్వారా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ, సమతుల్య జీవన విధానం, గ్రీన్ డెవలప్‌మెంట్.. తదితర విలువలతో కూడిన కార్యాచరణతో వాతావరణ మార్పుపై భారత్ పోరాడుతోందని మోదీ తెలిపారు. 'సంతులిత అభివృద్ధిని మా ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుంది. పర్యావరణానికి హాని చేయకుండానే అభివృద్ధి సాధ్యమని మేం నిరూపిస్తున్నాం' అన్నారు. 'వలస జాతులు ఈ భూగ్రహాన్ని అనుసంధానిస్తాయి. మనం ఉమ్మడిగా వాటికి ఆహ్వానం పలుకుదాం' అని సీఓపీ–13కి స్లోగన్ థీమ్‌గా పెట్టారు. కన్వెన్షన్ అధ్యక్ష బాధ్యతలను వచ్చే మూడేళ్లు భారత్ నిర్వహించనుందని ప్రధాని వెల్లడించారు. వలస పక్షుల పరిరక్షణ కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పర్యావరణ మంత్రి జవదేకర్ అన్నారు.

**జనాభా తగ్గుతోంది**

అంతరించే ప్రమాదంలో ఉన్న వన్య వలస జాతుల్లో అత్యధిక శాతం జాతుల జనాభా గణనీయంగా తగ్గుతోందని '13వ సీఎంఎస్ సీఓపీ' ఆందోళన వ్యక్తం చేసింది. ఇది ప్రాథమిక అంచనాయేనని, పూర్తిగా నిర్ధారణ చేసేందుకు సహకారంఅవసరమని సీఎంఎస్ కార్యనిర్వాహక కార్యదర్శి అమీ ఫ్రేంకెల్ పేర్కొన్నారు.

# 'నిరసన' ప్రాథమిక హక్కే.. కానీ!

**షహీన్‌బాగ్ నిరసనలపై సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** ప్రజాస్వామ్యంలో ఒక చట్టానికి వ్యతిరేకంగా నిరసన తెలపడం ప్రాథమిక హక్కే కానీ, ఆ కారణంగా రహదారుల దిగ్బంధనం జరగడం ఆందోళనకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రజలకు ఇబ్బంది కలగని ప్రాంతంలోకి తమ నిరసనల కేంద్రాన్ని మార్చుకోవాలని పౌరసత్వ సవరణ చట్ట(సీఏఏ) వ్యతిరేక ఆందోళనకారులకు సూచించింది. సీఏఏకి వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో నిరసనల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది ఎదురవుతోందంటూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా పైవిధంగా స్పందించింది. భావ ప్రకటన ప్రజాస్వామ్యంలో అవసరమే కానీ, దానికీ హద్దులుండాలంది. మరో ప్రదేశానికి నిరసన ప్రాంతాన్ని మార్చేలా ఒప్పించాలని న్యాయవాది సంజయ్ హెగ్డేని ఆదేశించింది.

**సందీప్ పాండే అరెస్ట్**

**లక్నో:** సామాజిక కార్యకర సందీప్ పాండేను సోమవారం లక్నో పోలీసులు అరెస్ట్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పాదయాత్ర చేయాలని తలపెట్టిన పాండే.. కరపత్రాలను పంచుతుండగా అదుపులోకి తీసుకున్నారు.

**సతీసహగమనం హత్యే**

'ప్రార్థనాస్థలాల్లో దానం చేయడం మతపరమైన ఆచారమే కావచ్చు. అటువంటి ప్రదేశాల్లో విరాళంగా ఇచ్చిన ఆ డబ్బుని టెర్రరిజానికి ఉపయోగిస్తే మాత్రం చట్టం అంగీకరించదు' అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆత్మత్యాగం, సతీసహగమనం వంటివి హత్యల కిందికే వస్తాయని, వాటిని విశ్వాసాల పేరుతో కొనసాగినవ్వలేమని తేల్చి చెప్పింది. ప్రార్థనాలయాల్లో మత స్వేచ్ఛ, లింగ వివక్షపై చీఫ్ జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల ధర్మాసనం విచారణ ప్రారంభించింది.

## లూథియానాలో 25 కిలోల ఆభరణాలు చోరీ



**లూథియానా:** పంజాబ్‌లోని లూథియానాలోని ఐఐఎఫ్ఎల్ (ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ లిమిటెడ్) బ్రాంచ్‌లో భారీ దొంగతనం జరిగింది. సోమవారం ఉదయం 10.15 గంటలకు ముసుగులు ధరించి బ్రాంచ్‌లోకి ప్రవేశించిన నలుగురు దుండగులు తుపాకులతో అక్కడి వారిని బెదిరించి 25 కిలోలకు పైగా బంగారాన్ని దోపిడీ చేశారు. ఆ తర్వాత కారులో పారిపోయారు. ఘటన సమయంలో సెక్యూరిటీ గార్డులు ఎవరూ లేరని ఏసీపీ సందీప్ వెల్లడించారు.

# బానిస మనస్తత్వానికి సూచిక

**ట్రంప్ పర్యటనకు కేంద్రం చేస్తున్న ఏర్పాట్లపై శివసేన విమర్శ**

**ముంబై:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాక కోసం చేస్తున్న ఏర్పాట్లపై శివసేన మండిపడింది. ఆత్రుతగా ఎదురుచూస్తూ ఏర్పాట్లు చేయడం.. భారతీయుల బానిస మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించింది. ట్రంప్ రాక.. 'బాద్‌షా' (మహారాజు) పర్యటన లాగా ఉందని శివసేన అధికారిక పత్రిక సామ్నాలో దుయ్యబట్టింది. అహ్మదాబాద్‌లో ట్రంప్ పర్యటించనున్న మార్గంలో మురికి వాడలు కన్పించకుండా గోడ కట్టడంపైనా తీవ్ర విమర్శలు చేసింది. ఇలా చేయడం ద్వారా అంతర్జాతీయంగా రూపాయి విలువ పెరగదని, మురికి వాడల్లో ఉండే వారి జీవితాలేమీ మెరుగుపడవని పేర్కొంది. 'స్వాతంత్ర్యానికి పూర్వం..



ట్రంప్ కాన్వాయ్‌లో భాగంకానున్న అమెరికా వాహనం

బ్రిటిష్ రాజు లేదా రాజు తమ బానిసత్వపు దేశాల్లో పర్యటించి నప్పుడు ఇలాగే ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడు అచ్చు అలాగే ప్రజల పన్నుల సొమ్ముతో ట్రంప్ పర్యటన కోసం మెరుగులు దిద్దుతున్నారు. ఇది భారతీయుల బానిస మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోంది'అని పేర్కొంది.

## మిలిటరీలో సంస్కరణలు

**న్యూఢిల్లీ:** భారత రక్షణ బలగాల్లో భారీ సంస్కరణలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలో థియేటర్ కమాండ్లను ఏర్పాటు చేయనున్నట్లు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్ సోమవారం చెప్పారు. ఇందులో మొదటి థియేటర్ (జాయింట్) కమాండ్ వచ్చే ఏడాదికల్లా సిద్ధమవుతుందన్నారు. కశ్మీర్ రక్షణ వ్యవహారాలను ప్రత్యేక థియేటర్ కమాండ్ చూసుకుంటుందని, నేవీ తూర్పు, పశ్చిమ కమాండ్‌ల విలీనం 2021కల్లా పూర్తవుతుందని చెప్పారు. సముద్ర జలాల ప్రాంతాల కోసం ప్రత్యేక కమాండర్ ఉంటారని చెప్పారు. ఎయిర్ డిఫెన్స్ కమాండ్‌ను వచ్చే ఏడాదిలోనే పూర్తిచేయనున్నారు. కాగా, అగ్రరాజ్యాలకు మాత్రమే ఈ తరహా కమాండ్‌లు ఉన్నాయి.

# ఉగ్ర సంస్థలకు పాక్ స్వర్గధామం కాబోదు

**పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్**

**ఇస్లామాబాద్:** ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ఇప్పుడు స్వర్గధామం కాదని దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ స్పష్టంచేశారు. అఫ్గానిస్తాన్ శరణార్థులకు ఆశ్రయం కల్పించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ అఫ్గానిస్తాన్‌లో శాంతినెలకొనాలని పాకిస్తాన్ కోరుకుంటోందని, పొరుగు దేశంలో అస్థిరత ఉండాలని ఎలా కోరుకుంటామని పేర్కొన్నారు. అంతర్జాతీయ మనీలాండరింగ్ నిరోధక సంస్థ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ పారిస్‌లో కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఇమ్రాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉగ్రవాదులకు ఆర్థిక సాయాన్ని అడ్డుకునేందుకు పాక్ చర్యలు



తీసుకోవట్లేదన్న ఆరోపణలతో బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంపై ఈ సమావేశం జరగనుంది.

**భారత్ విధానాలతో సంక్షోభం**

భారత్‌లో ప్రస్తుతమున్న పరిస్థితులపై అంతర్జాతీయ సమాజం తగిన చర్యలు తీసుకోకపోతే పాకిస్తాన్ శరణార్థుల రూపంలో మరో సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. 'హద్దుమీరిన జాతీయవాద సిద్ధాంతం వినాశనానికి దారితీస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. భారత్ తలచుకుంటే పాకిస్తాన్‌ను 11 రోజుల్లో నాశనం చేయగలదు అని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.

## ప్రభుత్వానికి 127.. కొలీజియంకు 119..

**న్యూఢిల్లీ:** కొత్త జడ్జిల నియామకాలకు సంబంధించిన ప్రతిపాదనల ఆమోదానికి ప్రభుత్వం 127 రోజుల సమయం తీసుకుంటే కొలీజియం 119 రోజులు తీసుకుంటోందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. దేశంలో ఖాళీగా ఉన్న 396 జడ్జి స్థానాలకు హైకోర్టులు 199 స్థానాలకు పేర్లను ప్రతిపాదించలేదని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ధర్మాసనానికి నివేదించారు. అయితే కొలీజియం కూడా దాదాపు 35శాతం ప్రతిపాదనలను తిరస్కరిస్తోందని తెలిపారు.

# కోవిడ్‌పై మరింత అప్రమత్తం

- వుహాన్‌కు వేలాదిగా వైద్యులు, సిబ్బందిని తరలించిన చైనా
- చైనాలో 1,770కి చేరిన కోవిడ్ మృతులు.. కేసులు 70,548

**బీజింగ్/తైపీ/టోక్యో/న్యూఢిల్లీ:** కోవిడ్ మృతులతోపాటు బాధితుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతుండటంతో చైనా మరిన్ని కఠిన చర్యలు ప్రకటించింది. పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్న హుబే ప్రావిన్స్‌లో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో జనం గుమికూడరాదని ఆదేశాలు జారీ చేసింది. వైరస్ భయంతో మార్చి 5వ తేదీన జరగాల్సిన దేశ అత్యున్నత నిర్ణాయక మండలి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ)



వైరస్ లేదని తేలడంతో ఢిల్లీలోని ఐటీబీపీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్న భారతీయులు

సమావేశాన్ని వాయిదా వేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికార మీడియా జిన్హువా పేర్కొంది. అదనంగా 30 వేల వైద్య సిబ్బందిని వుహాన్‌నగరానికి పంపుతున్నట్లు ప్రకటించింది. దేశం మొత్తమ్మీద ఉన్న ఇంటెన్సివ్ కేర్ వైద్యుల్లో 10 శాతం మంది.. 11వేల మందిని వుహాన్ పంపామని తెలిపింది. కోవిడ్‌తో సోమవారం ఒక్కరోజే 105 మృతి చెందటంతోపాటు, 2,048 మంది బాధితులను కొత్తగా గుర్తించటంతో మొత్తం మృతుల సంఖ్య 1,770కు, బాధితుల సంఖ్య 70, 548కు చేరుకుందని చైనా ప్రభుత్వం తెలిపింది. కోవిడ్ భయంతో జపాన్ రాజధాని టోక్యో తీరంలో నిలిపేసిన ఓడలో మరో 99 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణైంది. దీంతో ఓడలోని 3,711 మందిలో 454 మందికి వ్యాధి నిర్ధారణ కాగా ఇందులో నలుగురు భారతీయులున్నట్లు సమాచారం. కోవిడ్ భయంతో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించడంపై ఆంక్షలు విధించిన జపాన్ ప్రభుత్వం.. తాజాగా తమ చక్రవర్తి జన్మదిన వేడుకలను ప్రజలు బహిరంగంగా జరుపుకోవద్దని కోరింది. 23వ తేదీన పుట్టిన రోజు నాడు చక్రవర్తి నరుహిటో ప్రజలకు కనిపించరని పేర్కొంది. మార్చి 1వ తేదీన జరగాల్సిన టోక్యో మారథాన్‌ను కూడా రద్దు చేశారు.

**హుబే నుంచి భారతీయులను తీసుకువస్తాం**

చైనా వైద్య సిబ్బందికి అవసరమైన మాస్కులు, గ్లవ్‌లు, సూట్స్, తదితర సామగ్రితో కూడిన ప్రత్యేక విమానాన్ని ఈవారంలో వుహాన్‌కు పంపనున్నట్లు భారత్ తెలిపింది. ఈ విమానం తిరుగు ప్రయాణంలో హుబే నుంచి వెనక్కి రావాలనుకునే భారతీయులతోపాటు ఇరుగుపొరుగు దేశాల వారిని తీసుకువస్తుందని పేర్కొంది.

**చెన్నైలో చైనా పిల్లి కలకలం**

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** చైనా నుంచి నౌకలో వచ్చిన ఓ పిల్లి కలకలం రేపింది. చైనా నుంచి వచ్చిన ఓ కంటైనర్‌లోని బోనులో 'స్టో వేవే'జాతి పిల్లి ఉంది. అలాగే, కంటైనర్ల నడుమ సింహాలు సంచరిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో వచ్చిన వాట్సాప్ వీడియోపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ప్రశాంత్ కిశోర్‌కు జడ్ కేటగిరీ భద్రత !



**కోల్‌కతా:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జడ్ కేటగిరీ భద్రత కల్పించనుందని ఆ రాష్ట్ర సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికలకు తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ.. ప్రశాంత్ కిశోర్‌ను రాజకీయ వ్యూహకర్తగా నియమించుకున్న సంగతి తెలిసిందే. దీనిపై సీపీఎం నేత సుజన్ చక్రవర్తి మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్ముతో ఆయనకు ఎందుకు భద్రత కల్పిస్తారని ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

## డీఎంకే నేత వివాదాస్పద వ్యాఖ్యలు

**చెన్నై:** టీవీ మీడియా సంస్థలు, జర్నలిస్ట్‌లను ముంబైలోని వ్యభిచార ప్రాంతాల వారితో పోల్చి డీఎంకే ఎంపీ ఆర్ఎస్ భారతి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మీడియా సంస్థలకు, జర్నలిస్ట్‌లకు డబ్బే ప్రధానమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆపై డీఎంకే అధినేత నుంచి ఆదేశాలు రావడంతో, తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం వైరల్‌గా మారిన ఓ వీడియోలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో మోదీ, కేజ్రీవాల్ సహా పలువురు రాజకీయ వ్యూహాల్లో భాగంగా ఒప్పందాలు చేసుకున్నారని, ఇప్పుడు డీఎంకే పార్టీ ఆయనతో ఒప్పందం కుదుర్చుకుంటే మీడియా ఎందుకని ప్రచారం చేస్తోందని అంటూ.. మీడియా సంస్థలను, జర్నలిస్టులను ముంబై రెడ్‌లైట్ ఏరియా వారితో పోల్చారు.



సాక్షి
మంగళవారం, ఫిబ్రవరి, 18

## మహిళాశక్తికి పట్టం!

మరో ఇరవై రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరగబోతుండగా సుప్రీంకోర్టు సోమవారం చరిత్రాత్మకమైన తీర్పు వెలువరించింది. మహిళల శారీరక పరిస్థితులను సాకుగా చూపి లేదా సామాజిక నియమాలను కారణాలుగా చూపి సైన్యంలో వారిపట్ల వివక్ష అమలు చేయడం తగదని స్పష్టం చేసింది. పురుషులతో సమానంగా వారికి కూడా అన్ని బాధ్యతలనూ అప్పగించాలన్న తొమ్మిదేళ్లనాటి ఢిల్లీ హైకోర్టు తీర్పును అమలు చేయడంలో అలసత్వం ఎందుకని ప్రశ్నించింది. ఈ తీర్పు ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వానికి మాత్రమే కాదు...అంతక్రితం దేశాన్ని పాలించినవారికి కూడా చెంపపెట్టు. మహిళలను కీర్తించవలసి వచ్చేసరికి మనకు ఆది పరాశక్తి గుర్తుకొస్తుంది. భద్రకాళి స్ఫురణకొస్తుంది. ఇంకా రణరంగంలో శౌర్యపరాక్రమాలను ప్రదర్శించిన మాంచాల, మల్లమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమ వంటి వీరనారులు గుర్తుకొస్తారు. తీరా సైన్యంలో తీసుకోవాల్సివచ్చేసరికి అన్నీ ఆవిరైపోతాయి. మహిళలకు తగిన సామర్థ్యం ఉండదని, శారీరకంగా వారు బలహీనులని అనుకుంటారు. అంతేకాదు... వారి ఆదేశాలు పాటించడానికి వారి పరిధిలో పనిచేసే పురుష సైనికులు ఇబ్బందిపడతారని అంటారు. మహిళలకు కీలక బాధ్యతలు అప్పజెప్పడానికి సైన్యం వెనకడుగు వేస్తుంటే, ఆ ధోరణిని మార్చి, సరిచేయాల్సిన ప్రభుత్వాలు కూడా అందుకు వత్తాసు పలుకుతున్నాయి. సైన్యంలోకి తమను అనుమతించాలని స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి మహిళలు డిమాండు చేస్తూనే వున్నారు. కానీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. 1950లో వచ్చిన సైనిక చట్టం సైన్యంలో పరిమితంగా మహిళల సేవలు వినియోగించుకోవచ్చునని చెప్పినా అది సాకారం కావడానికి మరో 42 ఏళ్లుపట్టింది. 1992లో తొలిసారి సైన్యంలో మహిళలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. కానీ అదంతా కాంట్రాక్టు నియామకాలకే పరిమితమైంది. 2006నాటికి స్వల్పకాల సేవల్లో మహిళలను నియమించటం మొదలైంది. ఆ తర్వాత మరో మూడేళ్లకు వైద్య సేవలు, మరికొన్ని ఇతర రంగాల్లో మహిళల శాశ్వత నియామకాలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ నియామకాలు కూడా ఆర్మీ ఎడ్యుకేషన్ కోర్, జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచ్ వంటి కొన్ని రంగాలకు మాత్రమే పరిమితమైంది. ఇలా శాశ్వత నియామకాల ద్వారా వచ్చినవారికి 60 ఏళ్ల వయసు వచ్చేవరకూ పనిచేసే అవకాశం లభిస్తుంది. మరోపక్క స్వల్ప కాల సేవల కోసం చేరే మహిళలకు అయిదేళ్ల సర్వీసు గడిచాక మరో అయిదేళ్లు మాత్రమే పొడిగింపునకు అవకాశం ఇస్తున్నారు. ఆ తర్వాత కూడా మెరుగ్గా పనిచేస్తున్నారని భావించే మహిళలకు మరో నాలుగేళ్లు అవకాశం ఇచ్చి రిటైర్ చేస్తున్నారు. అంటే, మహిళలను గరిష్టంగా 14 ఏళ్ల తర్వాత రిటైర్ కావాల్సిందే. అదే పురుషులకైతే 14 ఏళ్ల తర్వాత వారు కోరితే మినహాయింపు ఇస్తున్నారు. ఈ పద్ధతిలో చేరినవారికి శాశ్వత నియామకాలకు కూడా అవకాశం లభిస్తోంది. కానీ మహిళలకు అవేమీ లేవు సరికదా... రిటైరైన తర్వాత దక్కే లబ్ధి కూడా పురుషులతో పోలిస్తే తక్కువే.

రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ సమానమేనని, వారికి సమానావకాశాలు లభించి తీరాల్సిందేనని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చాక వైమానిక దళం దాన్ని శిరసావహించింది. కానీ నావికాదళం, సైన్యం తమ తప్పు సరిదిద్దుకోలేదు. సైన్యమైతే బాహాటంగా వ్యతిరేకించింది. అప్పట్లో శాశ్వత ప్రాతిపదికన తీసుకోవాల్సిన మహిళా అధికారులు 40మందికి మొండిచేయి చూపింది. దీనిపై వారు మళ్లీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాల్సివచ్చింది. మరోపక్క ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్రం సుప్రీంకోర్టుకెక్కింది. తాజా తీర్పు ఢిల్లీ హైకోర్టు తీర్పునే ధ్రువీకరించింది. సమానత్వానికి పూచీపడుతున్న రాజ్యాంగంలోని 14వ అధికరణకు భిన్నంగా వ్యవహరించడం తగదని తాజా తీర్పు ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సైన్యంలో వున్నవారు ఎవరైనా తగిన శక్తిసామర్థ్యాలు కలిగివున్నారో లేదో, లక్ష్యాలను పరిపూర్తి చేయగలుగుతున్నారో లేదో చూడాలి. ఈ అంశాల్లో మహిళల పనితీరు సంతృప్తికరంగా లేదనుకుంటే ఆ సమాచారాన్ని న్యాయస్థానం ముందుంచాలి. కానీ సైన్యం, ప్రభుత్వం చేసింది అది కాదు. సమాజం నరనరానా జీర్ణించుకున్న పితృస్వామ్య భావజాలాన్ని, పురుషాధిపత్య ధోరణులనూ ప్రోత్సహించేవిధమైన వాదనలు చేయడం!


కార్గిల్ యుద్ధ సమయంలో పాకిస్తాన్ సైన్యం దాడులకు దిగినప్పుడు మహిళా సైనికులు ఎక్కడా వెరవలేదు. తక్షణ స్పందనలో పురుష సైనికులకు వారెక్కడా తీసిపోలేదు. సుశిక్షిత సైనికులు తమకు ఆదేశాలిచ్చే అధికారిలో తగిన శక్తిసామర్థ్యాలున్నాయా లేదా, చిత్తశుద్ధి ఉందా లేదా అని చూస్తారు తప్ప ఆడా మగా అని చూడరు. పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళా అధికారులే ఇందుకు నిదర్శనం. ఆ శాఖలో ఎందరో ఐపీఎస్ అధికారిణులు, ఇతర మహిళా అధికారులు విధి నిర్వహణలో అద్భుతమైన శక్తిసామర్థ్యాలు ప్రదర్శిస్తున్నారు. సంక్షోభాలు, ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు సిబ్బందిని మెరుగ్గా నడిపిస్తున్నారు. ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. సైన్యంలో అది సాధ్యం కాదని చెప్పడం పురుషాధిపత్య ధోరణులను ప్రోత్సహించడమే అవుతుంది. తాజా తీర్పు పర్యవసానంగా మహిళలు కల్నల్ స్థాయికి, అక్కడినుంచి బ్రిగేడియర్, మేజర్ వగైరా స్థాయిలకు చేరుకుంటారు. అయితే గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినవారు యుద్ధరంగంలో అవకాశం ఇవ్వడమనేది విధానపరమైన నిర్ణయం కనుక తాము కోరడం లేదని చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం ఆ జోలికి పోలేదు. జర్మనీ, నార్వే, అమెరికా వంటి దేశాలు మహిళలను యుద్ధాల్లో కూడా భాగస్వాముల్ని చేస్తున్నాయి. ఏదేమైనా ఈ తీర్పు చరిత్రాత్మకమైనది. భవిష్యత్తులో మహిళల రణరంగ ప్రవేశానికి సైతం ఇది బాటలు పరుస్తుందనడటంలో సందేహం లేదు.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు
మాఘ మాసం, తిథి బ.దశమి సా.5.55 వరకు, తదుపరి ఏకాదశి
నక్షత్రం జ్యేష్ఠ ఉ.8.53 వరకు, తదుపరి మూల, వర్జ్యం సా.4.48 నుంచి 6.24 వరకు, దుర్ముహూర్తం ఉ.8.47 నుంచి 9.32 వరకు, తదుపరి రా.10.58 నుంచి 11.47 వరకు
అమృతఘడియలు..రా.2.21 నుంచి 3.56 వరకు

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# ట్రంప్ సాక్షిగా గోడకు అటూ ఇటూ!


ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ట్రంప్ రాక సందర్భంగా పేదరికం ఆయన కళ్లబడకుండా అహ్మదాబాద్ కార్పొరేషన్ 'గోడకట్టుడు' ముసుగు వేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆర్థికంగా మనం ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న ప్రస్తుత దశలో మనల్ని వర్ధమాన దేశంగా కాక, అభివృద్ధి చెందిన దేశంగా పరిగణించి ఆ మేరకు మన ఉత్పత్తులపై అమెరికా అదనపు సుంకాలు విధిస్తోంది. తన సరుకులపై సుంకాలు తగ్గించాలని పట్టుబడుతోంది. ఈ ఒత్తిళ్లు సహించరానివి. ప్రపంచంలో నాలుగింట మూడువంతుల జనాభా వర్ధమాన దేశాల్లోనే ఉన్నదని, కనుక వాటికి ప్రపంచ పరిణామాలనే ప్రభావితం చేయగల సత్తా ఉంటుందని సౌత్ కమిషన్ ఏనాడో నొక్కిచెప్పింది. మన పాలకులందరూ దాన్ని విస్మరించడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడింది.

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈనెల 24న అహ్మదాబాద్ నగరానికి వస్తున్న సందర్భంగా గుజరాత్ ప్రభుత్వం ట్రంప్ మెప్పుకోసం నగరంలోని రోడ్ల గతుకులు సరిచేసి అందంగా కనపడేలా మెరుగులు దిద్దుతోంది. ఆయన వచ్చే వీధుల వెంట కొబ్బరి చెట్లు నాటడంతోపాటు ఆ పొడవునా పెద్ద గోడ కడుతున్నారు. ఈ పనంతా ట్రంప్‌కు మన మురికివాడలు కనబడకుండా చేయడానికి. అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సర్దార్ పటేల్(మోతేరా) స్టేడియం దాకా ఊరకుక్కలుగానీ, పశువులుగానీ కంటికి కనబడకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి.**

**–'ది హిందూ' రిపోర్టు 14.02.2020**

రెండో మాట



మన ఇంటిని, మన దేశాన్ని పేదరికం లేకుండా చూడాలని, సర్వులకూ సుఖమయ జీవితాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, నలుగురికీ ఆదర్శంగా దాన్ని మలచాలని బుద్ధి, జ్ఞానం ఉన్నవారెవరైనా ఆశిస్తారు. అందుకోసం శ్రమిస్తారు! కానీ మన పాలకుల (అన్ని రంగులవారూ) ప్రవర్తన, మనస్తత్వం ఈ ఆదర్శానికి పరమ విరుద్ధంగా ఉంటోంది! పై వార్త విన్న తర్వాత ప్రజల మనస్సులు ఎక్కడ గాయపడతాయోనన్న భీతి, లజ్జ కూడా లేకుండా మురికివాడలు ట్రంప్ కళ్లకు కనబడకుండా ఉండేందుకు ''గోడ కట్టుడు'' ముసుగు వేయడానికి గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రయత్నించింది. ఈ సందర్భంగా కమిషనర్ విడుదల చేసిన ప్రకటన మరీ వింతగా, ఆశ్చర్యం గొలిపేదిగా ఉంది–''రోడ్డును ఆక్రమిస్తూ నిర్మాణాలు జరగకుండా చూసేందుకు గోడ నిర్మించాలని రెండు నెలలనాడే కార్పొరేషన్ నిర్ణయించింద''ని ఆయన ప్రకటించారు. అయితే ట్రంప్ రాకతోనే మన పేదరికం తొలగిపోతుందా అన్నది వేరే ప్రశ్న!

ట్రంప్‌కు కనబడకుండా ఉండేందుకు పేదవాళ్ల వాడల్ని, పొగచూరిన వారి గోడల్ని కనబడకుండా చేద్దామన్న 'ఔదార్యం'తో పాలకులు తలపెట్టిన ''గోడకట్టుడు'' పూర్తి కాకుండానే దాదాపు అదే రోజున ఇండియాను అభివృద్ధి చెందిన లేదా వర్ధమాన దేశాల ప్రతిపత్తి జాబితానుంచి అమెరికా ప్రభుత్వం తొలగించి, భారత్ దిగుమతి చేసుకుంటున్న అమెరికన్ వస్తువులు, తదితర సరంజామాపై దిగుమతి సుంకాలను తగ్గించాలన్న షరతు విధించుతూ ప్రకటించింది(13.02.20) అంటే మన దేశం పేద దేశం కాదు, ''అభివృద్ధి చెందిన సంపన్న దేశమే''నని అమెరికా వర్తక వాణిజ్య కార్యాలయం నిర్ధారణకు వచ్చింది. అమెరికా దిగుమతి చేసుకునే మన వస్తువులపై దాని ప్రకారం సుంకాలు గణనీయంగా తగ్గించివేయాల్సిందేనని పట్టుబడుతోంది! అమెరికా తన సమ ఉజ్జీగా దూసుకువెడుతున్న చైనాతో ఇలాంటి వాణిజ్య యుద్ధాన్నే చేస్తోంది. దాన్ని సమ ఉజ్జీల మధ్య పోటీగా భావించవచ్చు. కానీ అన్ని అంతర్జాతీయ మదింపు సంస్థలూ మన అభివృద్ధి రేటు గత పదేళ్ల వ్యవధిలోనే ఎలా దిగజారిపోతూ వస్తున్నదో చూపుతున్న వర్తమాన దశలో భారత్‌పై కూడా ఈ పిడుగును వదిలింది. ఇంకా వర్ధమాన దశలోనే ఉంటూ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న మన దేశంపై అమెరికా చేస్తున్న ఒత్తిడి సహించరానిది. పైగా ట్రంప్ భారత పర్యటన సందర్భంగా ''భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరే వ్యవహారం కాద''ని అధికారికంగా ప్రకటించ సాహసించడం మన స్వతంత్ర ప్రతిపత్తిని ప్రశ్నించడమేనని మరవరాదు. మన ప్రణాళికలుగానీ, వార్షిక బడ్జెట్లుగానీ, ఆర్థిక సర్వేక్షణలుగానీ ప్రజలకు దేశ వాస్తవిక పరిస్థితుల గురించి చెప్పకుండా దాచడం, మభ్యపరచడం కొత్తగాదు. వింత కూడా కాదు!

మన ఆర్థిక వ్యవస్థా చక్రానికి సోకిన వైరస్ ఇప్పటిది కాదు. పైగా కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ పాలన నాటికన్నా బీజేపీ ఏలుబడిలోని ఎన్‌డీఏ సంకీర్ణ పాలన దేశ ఆర్థిక పరిస్థితిని దిగజార్చే వైపుగా అడుగులువేస్తోంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వస్తుతహా ఎంత తెలివిగల మహిళో, బీజేపీ వరలోకి వెళ్లిన తరవాత తానే చెప్పుకున్నట్లు అంత 'మితవాద శక్తి'గా మారి ''నేను మితవాదినే కావచ్చుగానీ వాస్తవవాదిని'' అనవలసివచ్చింది. ప్రపంచ బ్యాంకు ప్రజా వ్యతిరేక సంస్కరణలకు 1990లలో ప్రధాని హోదాలో నరసింహారావు తలవూపారు. అంతకు చాలాముందుగానే చరిత్రాత్మకమైన ''సౌత్ కమిషన్'' వర్ధమాన దేశాల స్వతంత్ర ప్రగతి బాటకు రూపకల్పన చేసింది. ఆ కమిషన్‌కు అప్పటి టాంజానియా అధ్యక్షుడు, ఆఫ్రికా దేశాల ఆరాధ్య నేత జూలియస్ నైరేరి అధ్యక్షుడు కాగా, మన్మోహన్‌సింగ్ ప్రధాన కార్యదర్శి. భారతదేశంలాంటి వర్ధమాన దేశాలు స్వావలంబన ద్వారా సొంతకాళ్లపై నిలబడి ఎంతటి అభివృద్ధి సాధించవచ్చునో , అదెంత ఆచరణ సాధ్యమో సౌత్ కమిషన్ నివేదిక తెలిపింది. అందులోని కీలకమైన ప్రతిపాదన–''వలస విధానాన్ని వలస దేశాల ప్రజలు తిరస్కరించారు కాబట్టి ఆ విధానాన్ని వారు పాతిపెట్టగలిగారు. ఆ అనుభవంతోనే విదేశీ ఆర్థిక పెత్తనాన్ని వివిధ రూపాలలో అనుభవిస్తున్న దేశాలు కూడా అలాంటి దృఢచిత్తం తోనే, స్వావలంబన పైన ఆధారపడిన కార్యాచరణ ద్వారా మాత్రమే విదేశీ ఆర్థిక పెత్తనాన్ని వదిలించుకోవచ్చునని ఆ నివేదిక హెచ్చరించింది. కానీ అదే మన్మోహన్ ఆ తర్వాత ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ప్రపంచబ్యాంకు వరలో ఇమిడిపోవలసి వచ్చింది. బీజేపీ పాలకులు అంతకన్నా పది అడుగులు ముందుకి దూకి స్వతంత్ర భారత ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులెత్తిన ప్రభుత్వ రంగ వ్యవస్థల్ని ఒక్కొక్కటిగా వినాశనం వైపునకు నెడుతున్నారు. ఫలితంగా ఆర్థిక పరాధీన స్థితి మరింత పెరగడానికి మార్గం ఏర్పడింది.

దేశ నిరంతర ఆర్థిక అభివృద్ధి ''దిగుమతి చేసుకునే వస్తువు'' కాదని, ఉత్పత్తి అయిన సంపద అనేది సామాజికుల మధ్య న్యాయబద్ధంగా పంపిణీ కావడం ద్వారానే ఆర్థికాభ్యుదయం సాధ్యమని సౌత్ కమిషన్ నొక్కి చెప్పింది! ఈ అభ్యుదయకర పాఠం మన పాలకుల చేతిలో ఆవిరైపోయింది. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసినట్లు నేటి ప్రధాని మోదీ పబ్లిక్ రంగ వ్యవస్థల్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ, బ్యాంకుల విలీనీకరణ పేరిట బడా ప్రయివేటు బ్యాంకుల ద్వారా దేశంలో రూ. 360 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తానని ఆశగొల్పుతున్నారు! 'స్విస్ బ్యాంకు' ఖాతాలు తెరిచి వాటిలో దాగిన భారత బడా సంపన్నుల 25 లక్షల కోట్లకుపైగా సంపద బయటకు లాగి మరీ ప్రతి కుటుంబానికీ రూ. 15 లక్షలు పంచుతానన్న మోదీ బాస కాస్తా గాలి కబురుగానే మిగిలిపోయింది! చివరకు భారీ యంత్రాలనుంచి పిన్నులకు, పెన్నులకు, 'పిడుగుకూ, బియ్యానికీ' విదేశీ కంపెనీల మీద, వాటి సరుకుల మీద బతకాల్సిన పరాధీన స్థితికి దేశ పాలకులు దేశాన్ని నెడుతున్నారు. ప్రజల దృష్టిని గుళ్లూ గోపురాలవైపు, మతం పేరిట కుహనా సంస్కృతుల వైపు మళ్లించి మూఢత్వాన్ని చేటలతో చెరిగే ప్రక్రియను పెంచి పోషిస్తూ తమ పనిని చడీచప్పుడూ లేకుండా చకచకా చేసుకుపోతున్నారు. అదేమని ప్రశ్నించిన వారి నోళ్లకు తాళాలు వేస్తున్నారు. నిర్బంధించి భిన్నాభిప్రాయాలను అణిచేస్తున్నారు. అందుకే ''వర్ధమాన దేశాలు చేతులు ముడుచుకు కూర్చోరాదని, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలే ఈ దేశాల ప్రాపంచిక దృష్టికి వెలుగు దివ్వెలు కావాలనీ, నాల్గింట మూడు వంతుల జనాభా(350 కోట్లుపైగా) వర్ధమాన దేశాల్లోనే ఉన్నందున ప్రపంచ పరిణామాలనే ప్రభావితం చేయగల హక్కు, సత్తా ఈ దేశాలకు ఉంది'' అని కూడా సౌత్ కమిషన్ మూడు దశాబ్దాల నాడే చెప్పింది. కానీ మోదీ నినాదం 'ఇండియాలోనే తయారీ'(మేక్ ఇన్ ఇండియా) కాస్తా క్రమంగా ''ఇండియాలోనే తయారీ, కానీ దాని నిర్మాత అమెరికా'' అన్న చందంగా మారిపోయింది! మరో మాటలో చెప్పాలంటే–అమెరికా, దాని జేబు సంస్థ ప్రపంచబ్యాంకు చేసిన, చేస్తున్న నిర్వాకమల్లా– ''అరువులివ్వడం, కరువులు తేవడం, రుణం పెట్టడం, రణం పెంచడం'' అందుకే యువకవి అలిశెట్టి ఏనాడో చాటాడు: '' అన్నం మెతుకునీ/ఆగర్భ శ్రీమంతుణ్ణీ/ వేరుచేస్తే/ శ్రమ విలువేదో తేలిపోతుంద''ని! అది తేలకుండా ఉంచడానికే ఘరానా దేశాధిపతుల రాక పోకలప్పుడు పేదల గుడిసెలు కనబడకుండా ఎత్తైన గోడలు కట్టించడం!

– వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
abkprasad2006@yahoo.co.in

### సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




#### ద్వంద్వం



అమానుల్లా ఖాన్ ఎవరు? పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుతున్న షహీన్‌బాగ్‌లోని నిరసనకారులకు ఎవరు నిధులు సమకూరుస్తున్నారు? ఢిల్లీ రోడ్లను అక్రమంగా ఆక్రమించుకోవడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఎందుకు ఆపడానికి యత్నించడం లేదు. మత కోణాన్ని, భయాన్ని వ్యాప్తి చేయడానికి, పేద ముస్లిం మహిళలను వాడుకోవడానికి మీకు మీ సొంత ముస్లిం సభ్యులు ఉంటారు. మీరు దీన్ని కాదనగలరా? ఆప్ ద్వంద్వ వైఖరి అందరికీ బాగా తెలిసినదే.

– మోహన్‌దాస్ పాయ్, విద్యావేత్త

#### మహిళలు



అధ్యక్షురాలు, ప్రధాని, మంత్రులు, జడ్జీలు, ముఖ్యమంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా మహిళలు ఉండగా, సైన్యంలో మాత్రం పూర్తిస్థాయి మహిళా అధికారులు ఎందుకు వద్దు? వాళ్లకేమైనా దేశభక్తి తక్కువా? ప్రభుత్వ పురుషస్వామ్య భావాజాలాన్ని ఎండగడుతూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును నేను స్వాగతిస్తున్నా.

– అభిజిత్ ముఖర్జీ, కాంగ్రెస్ నేత

#### ఛాయిస్



బుర్ఖా ధరించాలనుకుంటే అలా ధరించే స్వేచ్ఛను ఆమెకే ఇవ్వడం మంచి మనుషుల లక్షణం. కురచ దుస్తులు ధరిం చిన వారిని అవమానించడానికీ, దీనికీ తేడా ఏమీ కనిపించడం లేదు. సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ కుమార్తె ఖతియా రెహమాన్‌ను తస్లీమా తప్పుబట్ట డం సరికాదు.

– చిన్మయి శ్రీపాద, గాయని

#### విడిచి



బాబూలాల్ మరాండీ తిరిగి రావడంతో బీజేపీని విడిచిపెట్టిన ఏ నాయకుడూ స్వతంత్రంగా కొనసాగలేడన్న నమ్మకానికి బలం చేకూర్చింది. మదన్ లాల్ ఖురానా, కళ్యాణ్ సింగ్, ఉమా భారతి, బీఎస్ యడ్యూరప్ప అందరూ ఇదే కోవలోకి వస్తారు. వీరందరిలో చివరి వాడు మరాండీ, అలాగే చివర్లోనే తిరిగి వచ్చాడు.

– ఆదిత్యా మీనన్, జర్నలిస్ట్

#### గుణపాఠం



మూడు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటలకు ఎలాంటి విలువా లేదు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు చానెళ్లలో ఏదో ఒకటి చెప్పి తర్వాత నోరు మెదపకుండా ఉండటం సరికాదు. ఇక నేను దీని గురించి ఇంకేమీ మాట్లాడను. కానీ, దయచేసి అందరూ ప్రజాస్వామ్యంలో దీన్ని ఒక గుణపాఠంగా తీసుకోండి.

– కన్నన్ గోపీనాథన్, మాజీ ఐఏఎస్


#### జర్నలిజం



స్మృతి ఇరానీ వంట చేసింది, జుట్టు కత్తిరించుకుంది.. ఏంటి? ఏం జరుగుతోంది? దేశమంతా సమస్యలతో రగిలిపోతుంటే ఇండియా టుడే ఇటువంటి అంశాలను ప్రచారం చేస్తోంది. ఎంత నిజాయితీ అయిన జర్నలిజమో!

– హసీబా అమిన్, కాంగ్రెస్ నేత

## ఆర్ఎస్ఎస్ మూలస్తంభం



ఆర్ఎస్ఎస్‌గా నేడు అందరికీ సుపరిచితమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ బహుముఖాలుగా విస్తరించడానికి కీలకమైన భూమిక పోషించినవారు గోల్వాల్కర్. మహారాష్ట్రలోని నాగపూర్ దగ్గర గల రాంటెక్‌లో 1906 ఫిబ్రవరి 19న సదాశివరావు, లక్ష్మీబాయ్ దంపతులకు మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ జన్మించారు. తొమ్మిదిమంది సంతానంలో బతికి బట్టకట్టినది ఈయన ఒక్కరే. ప్రభుత్వ ఉద్యోగి అయిన తండ్రి తరచూ బదిలీలు కావడంతో చిన్నతనంలో దేశంలోని వివిధ ప్రాంతాలను గోల్వాల్కర్ చూశారు. అప్పటి నుంచే ఆయనలో మతపరమైన, ఆధ్యాత్మికమైన ఆసక్తి పెరిగింది. క్రైస్తవాన్ని తీవ్రంగా వ్యతిరేకించి హిస్లాప్ కాలేజీని వదిలిపెట్టి వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో చేరి సైన్స్ లో 1927లో డిగ్రీ చేయడంతోపాటు, 1929లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేశారు. తరువాత మెరైన్ బయోలజీ చేయడానికి మద్రాస్ వెళ్లినప్పటికీ తండ్రి పదవీ విరమణ కారణంగా పూర్తి చేయకుండానే వెనక్కి వచ్చి బెనారస్ యూనివర్సిటీలోనే జువాలజీ బోధించడం ప్రారంభించారు. గోల్వాల్కర్ ధరించే సామాన్యమైన దుస్తులు, పొడవాటి గడ్డం కారణంగా ఆయనను గురూజీ అని పిలిచేవారు. తరువాత నాగపూర్ చేరుకున్న ఆయన అప్పటి ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ సంచాలక్ కె.బి. హెగ్డేవార్ సలహా మేరకు 1937లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. నాగపూర్ శాఖకు 1934లో కార్యదర్శిగా నియమితులైన గోల్వాల్కర్‌ను 1939లో ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు హెగ్డేవార్ ప్రకటించారు. ఆయన మరణానంతరం పగ్గాలు చేపట్టిన గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్‌ను దేశంలోనే బలమైన మతవాద రాజకీయ శక్తిగా నిర్మించారు. లక్ష మంది ఉండే సభ్యుల సంఖ్యను పది లక్షలకు చేర్చారు. రాజకీయ, సామాజిక, మత, విద్య, కార్మికరంగాలకు 50 ప్రధాన శాఖల ద్వారా విస్తరించారు. ఆర్ఎస్ఎస్‌ను విదేశాలకు కూడా విస్తరించారు. భారతీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ స్వయం సేవక్ సంఘ్ పేరిట ఏర్పడిన సంస్థల్లో పలువురు హిందువులు సభ్యులుగా చేరారు. ఆర్ఎస్ఎస్ విస్తరణలో కీలక పాత్ర పోషించిన గోల్వాల్కర్ 1973, జూన్ 5న కన్నుమూశారు.

*(రేపు గోల్వాల్కర్ జయంతి సందర్భంగా)*

## కమతంపై పోలీసు పెత్తనం

సందర్భం


సోలిపేట రామలింగారెడ్డి

**అది 20వ శతాబ్దం...**
**1941 జూన్ 17, సూర్యాపేట - జనగామ రోడ్డు.**

మాసిన షేర్వానీ, చిరిగిన అడ్డ పంచ నడుముకు చుట్టి ఓ బక్కపలచని ఫకీరు నడుచుకుంటూ వెళ్తున్నాడు. కండలు తిరిగిన గూండా ఒకడు కొడవలితో ఫకీరు మెడ మీద వేటు వేశాడు. ఇంకోడు కత్తితో పొడిచాడు. చనిపోయిన ఆ ఫకీరు షేక్ బందగి అయితే... చంపిన వారు విస్నూర్ దేశముఖ్ గూండాలు. షేక్ బందగికి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిని విస్నూరు దేశముఖ్ బంటు దౌర్జన్యంగా మలుపు కున్నాడు. బందగీ అడ్డం తిరుగుతాడు. తగాదా తుదకు కోర్టుకెక్కింది. కార్వాయి నడిచి నడిచి బందగి వైపే ఫైసలా అయింది. బక్క రైతుకు భూమి దక్కటాన్ని జీర్ణించుకోలేని దేశముఖ్ బందగీని హత్య చేయించాడు. పారిన ఫకీరు నెత్తురు తెలంగాణ సాయుధ పోరాటానికి , ఇక్కడి భూ పోరాటాలకు జీవధార అయింది.

**21వ శతాబ్దం..**

60 ఏళ్ల కల సాకారమైంది. తెలంగాణ జననేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ప్రజలు అడగకుండానే కమ్యూనిస్టులను మించిన ఎజెండాను రూపొందించి అమలు చేశారు. 70 ఏళ్లుగా లొసుగులతో సాగిన భూ రికార్డులను ప్రక్షాళన చేశారు. ఎవరి హద్దులు వాళ్లకు చూపించి బీద, బిక్కీ, బడుగు, బక్క రైతుల భూములకు ఎవరికి వారివి పక్కాగా పట్టా చేసి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.55 కోట్ల వ్యవసాయ భూమి ఉండగా వివాదరహితంగా ఉన్న 2.38 కోట్ల ఎకరాల భూమికి పక్కాగా పాసుబుక్కులు తయారు చేసి ఇచ్చారు. మిషన్ కాకతీయ పథకం కింద చెరువులను పునరుద్ధరణ చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కాళేశ్వరం, సీతారామ సాగర్ ఒక్కొక్క ప్రాజెక్టును పూర్తి చేసుకుంటూ కృష్ణా, గోదావరి జలాలను కాలువలకు మళ్లించి చెరువులను నింపారు. ఆర్థికంగా చితికిపోయిన అన్నదాతలకు చేయూతనిచ్చి సాగును గాడిలో పెట్టేందుకు 'రైతుబంధు' పథకాన్ని అమలు చేశారు. దీంతో చిగురించిన చెట్టు మీదికి పిట్టలు వచ్చి వాలినట్లుగా వలసపోయిన జనాలు తిరిగి సొంతూళ్లకు చేరుకున్నారు. కొత్త ఆశలతో సాగుకు సిద్ధమయ్యారు.

కమతం మీదికి సాగుకు వచ్చిన సన్న, చిన్నకారు రైతులకు అక్కడక్కడ మళ్లీ బందగీ అనుభవాలే ఎదురవుతున్నాయి. బడా పెట్టుబడిదారుల వైపు నిలబడిన పోలీసులు, లేని సమస్యలను ఉత్పన్నం చేసి నాలుగు రాళ్లు వెనకేసుకోవడానికి మొగ్గు చూపిస్తున్నారు. వందలాది ఎకరాలను కొనుగోలు చేసి భూముల చుట్టూ పెన్సింగ్ వేసి ఏక ఖండిక కమతాలుగా మార్చుకున్న పెట్టుబడిదారులు మధ్యలో ఉన్న వలస కూలీలకు చెందిన ఎకరం, అర ఎకరం భూములను అక్రమంగా కలిపేసుకున్నారు. సొంత భూములలో సాగు చేసుకునేందుకు తిరిగి వచ్చిన వలస కూలీలు లబోదిబోమంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి పట్టా దారి హక్కు పుస్తకాలు సంపాదించుకుని వస్తే పోలీసులు లాఠీలు పట్టుకొని గెట్టుకు అడ్డంగా, కబ్జా దారులకు అండగ నిలబడుతున్నారు. కబ్జా మీద ఎవరు ఉంటే వారిదే భూమి అనే చట్టవిరుద్ధ నిబంధనలను అమలు చేస్తున్నారు. పట్టాదారుల మీద ఆక్రమణ కేసులు బనాయిస్తున్నారు. హైదరాబాద్ సమీపంలో ఉన్న మహబూబ్ నగర్, మెదక్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలతో పాటుగా కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఈ సమస్యలు విపరీతంగా ఉత్పన్నమవుతున్నాయి.

బాధితుల అభ్యర్థన మేరకు నా నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదిస్తే 'రెవెన్యూ రికార్డులతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ప్రస్తుతానికి భూమి ఎవరి అధీనములో ఉందో వారే హక్కుదారులు. భూమి మీదికి వెళ్ళినవారు ఆక్రమణదారులు. అటువంటి వారిపై అక్రమ కేసులు పెడతాం' అన్నారు. డీజీపీ ఆదేశాలమేరకే నడుచుకుంటున్నామని మరో సమాధానం చెప్పాడు. ఆయన చెప్పిన సమాధానంతో అవాక్కయ్యాను. పట్టా రైతుకు అన్యాయం జరుగొద్దనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు తమ తీరు మార్చుకోకపోతే గతంలోలాగే మళ్లీ ప్రజల్లో అశాంతి రగిలే అవకాశం ఉంది.

–వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, అంచనాలు పద్దుల కమిటీ చైర్మన్, మొబైల్ 9440380141

## సేవే భక్తిమార్గం

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని మతాలలోనూ సంప్రదాయాలలోనూ ఉన్న సామాన్య అంశం ఏమంటే భగవద్భక్తుడికి లేదా సాధకుడికి తప్పని సరిగా ఉండవలసిన లక్షణం సేవాభావం. దైవాన్ని నమ్మని మానవతావాదులు కూడా సేవాభావానికి ప్రాధాన్యం ఇస్తారు. దానిని మౌలికమైన లక్షణంగా పేర్కొంటారు. సేవ అంటే ప్రతిఫలాపేక్ష లేకుండా ఎదుటి వారికి సహాయపడటం. కురూపులు, అంగవైకల్యం ఉన్నవారు, మానసికంగా సరిగా లేని వారు, రోగులు, దొంగలు, మోసగాళ్ళు ఎటువంటి వారికైనా అసహ్యించుకోకుండా సహాయం చెయ్యటమంటే మాటలు కాదు. అసలు భక్తికి నిర్వచనం సేవ అనే. అది దైవభక్తి కావచ్చు, దేశ భక్తి కావచ్చు. సేవాభావం లేనప్పుడు అది భక్తి కాదు.

ఇటువంటి సేవ చేస్తే మనలో శారీరకంగా, మానసికంగా ప్రక్షాళన జరగటమే కాదు. ఆత్మోన్నత్యానికి దోహదం చేస్తుంది. మనిషి ప్రక్షాళన కావటానికి ప్రతిఫలాపేక్ష లేకుండా సేవ చెయ్యటం ఒకటే మార్గం. ఇతరుల కోసం తాము ఏదైనా చేసినప్పుడు సహాయం పొందిన వారి ముఖంలో కనపడే తృప్తీ, సంతోషం సహాయం చేసిన ఎలాంటి వారికైనా ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. దానికి అప్పుడు మెదడులో ఉత్పన్నమయ్యే హార్మోనులే కారణం. తరచుగా ఆ హార్మోనులు ఉత్పన్నమవుతూ ఉంటే ఆ వ్యక్తికి ఆ అనుభవం వల్ల కలిగిన ఆనందం స్థిరంగా ఉంటే బాగుండు అనిపిస్తుంది.

జ్యోతిర్మయం

దురాలోచనలు, దుష్కృత్యాలు క్రమంగా తగ్గిపోతూ ఉంటాయి. ఆ మంచిపనులు చేసే వ్యక్తి ఇతరులకి సహాయం చేయటానికి అలవాటు పడిపోవటం జరుగుతుంది. ప్రవర్తనలోనూ, ఆలోచనా ధోరణిలోనూ మెరుగుదల కనపడుతుంది. ఇది మనకి తల్లులలో కనపడుతుంది. తాను తిన్న దాని కన్నా తన పిల్లలు తిన్నప్పుడు ఆ తల్లి కళ్ళలో కనపడే ఆనందం వర్ణనాతీతం.

పిల్లలు తింటే తల్లికి కడుపు, మనసు కూడా నిండుతాయి. తన పిల్లలకే కాదు ఎవరికి సహాయం చేసినా అంతటి ఆనందం కలుగుతుందని అర్థమైన నాడు ఆ వ్యక్తి వ్యక్తిత్వం ఉన్నత స్థాయికి ఎదగటంతో పాటు, అటువంటి వారి సంఖ్య పెరిగితే సమాజం ఎంత బాగుంటుందో కదా.

– డాక్టర్ అనంతలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 18-2-2020

# తెలీకుండా తీస్తే తాట తీస్తారు



తమ్ముడూ నిన్నే.
ఎవరూ చూడటం లేదనుకుంటున్నావేమో.
ఆమెకు తెలియకుండా ఫోన్‌లో
బంధించాలనుకుంటున్నావేమో.
చెత్త ఆలోచనలకు వాడాలనుకుంటున్నావేమో.
మానుకో. మారు.
నీ పనులకు శిక్షలు ఉన్నాయి.
నీ చేష్టలకు బేడీలు పడతాయి.
స్త్రీలు అప్రమత్తమయ్యారు.
వారు నిన్ను వదలరు. తాట తీస్తారు.

మెట్రోలో ప్రయాణిస్తున్నారు ముగ్గురు స్నేహితులు. ఆఫీస్ వేళ కావడం వల్ల రద్దీగా ఉంది ట్రైన్. ఈ ముగ్గురికీ సీట్ దొరకలేదు. కూర్చున్న లేడీస్‌కి దగ్గరగా నిలబడి ఉన్నారు. ఇంతలో మధ్యలో నిలబడ్డవాడు మెల్లగా ఫోన్‌లోని కెమెరా ఆన్ చేశాడు. ఈ అమ్మాయిలను ఫోకస్ చేశాడు. కూర్చుని ఉన్న అమ్మాయిల ఎదను చేయి పైకెత్తి కేప్చర్ చేసే ప్రయత్నం చేస్తున్నాడు. కూర్చున్న అమ్మాయిలు వీళ్లను గమనించట్లేదు. కాని ఆ ముగ్గురి పక్కన నిలబడ్డ ఒక అమ్మాయి పసిగట్టి.. అతని చేతిలోంచి ఫోన్ లాగేసి 'మిమ్మల్ని వీడు వీడియో తీస్తున్నాడు' అంటూ ఆ ఫోన్‌ను ఆ అమ్మాయిల చేతికిచ్చింది. వాళ్లు అలెర్ట్ అయ్యేలోపు ఈ ముగ్గురూ ఆ ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. గోలగోల అయ్యింది. అందరూ కలిసి పక్కస్టేషన్‌లో ఆ ముగ్గురిని పోలీసులకు అప్పజెప్పారు.

• • •

బస్టాప్‌లో ఆ కుర్రాడు. ఈ పని కోసమే వచ్చినట్టున్నాడు. బస్ కోసం వెయిట్ చేస్తున్న ఒకావిడను వెనక నుంచి వీడియో తీయడం మొదలుపెట్టాడు. దూరం నుంచి చూసేవారికి అతను మామూలుగా ఫోన్ పట్టుకున్నట్టు ఉంటుంది. కాని అందులో ఆమె వెనుకభాగం రికార్డ్ అవుతోంది. ఇంతలో ఆమె వెనక్కి తిరిగింది. అతడు కంగారు పడ్డాడు. అనుమానం కలిగించింది. వెంటనే వెళ్లి ఫోన్ లాక్కుంటే కెమెరా ఆన్‌లో ఉంది.

• • •

మెట్రో ట్రైన్ వెళుతూ ఉంది. ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. ఎదురుగా కాలేజీ అమ్మాయి నిలబడి ఉంది. అతను ఫోన్‌లో ఒక వీడియో ఆన్ చేసి ఎదురుగా నిలబడి ఉన్న అమ్మాయికి కనిపించేలా పెడ్తున్నాడు. ముందు ఆ అమ్మాయి పట్టించుకోలేదు. ఎంతసేపైనా ఆ వీడియోను ఆఫ్ చేయకపోయేసరికి అతనికి తెలియకుండా ఏమన్నా ఆన్ అయిందేమో అనుకొని అతనికి చెప్పబోతూ ఆ వీడియోను చూసి షాక్ అయింది. అది పోర్న్ వీడియో. కావాలనే.. తనకు కనిపించాలనే అతను అలా పెట్టాడు అని అర్థమైంది ఆ అమ్మాయికి.

• • •

ఇవన్నీ నిజాలే. జరిగినవే.. జరుగుతున్నవే. అయితే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వాళ్లకు ఇవీ నేరాలే అది వీటికి శిక్షలున్నాయని తెలియదు. మనల్ని ఎవరు పట్టుకుంటారు అన్న ధీమాతో ప్రవర్తిస్తుంటారు. కాని వీళ్ల ఒళ్లు దగ్గరపెట్టుకుని నడుచుకునేలా చేసే చట్టాలున్నాయి.

### ఈ నేరాలు ఏ చట్టం కిందకు వస్తాయి?

'మహిళ అనుమతి లేకుండా, ఆమెకు తెలియకుండా ఆమెను, ఆమె కదలికలను, శరీర భాగాలను చిత్రీకరిస్తే నిర్భయ చట్టంలోని 354 (డి) కింద నేరం. మొదటిసారి చేస్తే మూడేళ్ల జైలుశిక్ష.. పదేపదే చేస్తే అయిదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. ఐపీసీ 509 ప్రకారం ఇది మహిళ గౌరవమర్యాదలకు భంగం వాటిల్లే చర్య. కాబట్టి ఈ సెక్షన్ కింద కేసు నేరస్తుడికి మూడు నుంచి అయిదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి వాటికి పాల్పడినందుకు, పోర్న్‌వీడియోలు చూపించినందుకు ఐపీసీ 294 (అబ్‌సీన్ యాక్ట్) కింద మూడు నెలల నుంచి ఆరునెలల వరకు జైలు శిక్ష ఉంటుంది. వీన్నిటితోపాటు ఐటీ యాక్ట్ ఉండనే ఉంది. 67 ఆఫ్ ఐటీ యాక్ట్ ప్రకారం మహిళకు సంబంధించిన దృశ్యాలను కామాన్ని ప్రేరేపించేలా చిత్రీకరించి వాటిని ఇంటర్‌నెట్‌లో ప్రచురించిన, ప్రసారం చేసినా అయిదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా ఉంటుంది. అమ్మాయిలే కాదు.. అబ్బాయిల తల్లిదండ్రులూ ఇవి తెలుసుకోవాలి. తమ పిల్లల కదలికల మీద నిఘా వేయాలి' అని వివరిస్తున్నారు అడ్వకేట్, ఫ్యామిలీ కౌన్సెలర్ పార్వతి.



ఇ. పార్వతి
అడ్వకేట్, ఫ్యామిలీ కౌన్సెలర్

### కంప్లయింట్ ఎక్కడ ఇవ్వాలి?

అయితే ఈ శిక్షలన్నీ పడాలంటే ముందు ఆ నేరం నమోదు కావాలి. అంటే నేరస్తుడిని పట్టుకోవాలి. 'బహిరంగ ప్రదేశాల్లో ఇలా తమను ఎవరైనా వెంటాడుతున్నారు.. తమ మీద ఫోన్ ఫోకస్ అయి ఉంది అన్న అనుమానం రాగానే రియాక్ట్ కావాలి. వెంటనే అవతలి వ్యక్తి చేతుల్లోంచి ఫోన్ లాక్కోవాలి. గట్టిగా అరిచి చుట్టూ ఉన్నవాళ్ల దృష్టిని తన వైపు తిప్పి ఆ వ్యక్తి పారిపోకుండా చేయాలి. 100కి డయల్ చేస్తే షీటీమ్స్‌కి కనెక్ట్ అయ్యి దగ్గర్లో ఉన్న షీ టీమ్స్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి వచ్చే అవకాశం ఉంటుంది. లేదంటే ఇప్పుడు తెలంగాణ పోలీస్ వాళ్ల 'హాక్ –ఐ' యాప్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'దిశ' యాప్‌లూ ఉన్నాయి అందుబాటులో. హాక్–ఐలోని ఎస్ఓఎస్ నొక్కితే చాలు మీరు రక్షణ వలయంలోకి వెళ్లినట్టే. దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ప్రమాదంలో ఉన్నామనే అనుమానం కలిగితే చాలు ఆ యాప్ ఓపెన్ చేసి ఫోన్ కదిలిస్తే సమీప పోలీస్ సిబ్బందికి సంకేతాలు వెళ్లి నేరస్తుల వేట మొదలవుతుంది. ఇవన్నీటితోపాటు మీకు దగ్గర్లో ఉన్న ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా జరిగిన సంఘటన గురించి ఫిర్యాదు చేయవచ్చు. మిమ్మల్ని వీడియో తీసిన కాపీ అతని ఫోన్‌లో లేకపోయినా... దాని కాపీ ఇంకా ఎక్కడ దొరికినా.. కూపీలాగి నేరస్తుడిని కటకటాల్లో తోసే వీలుంటుంది' అని చెప్తారు తెలంగాణలోని విమెన్ ప్రొటెక్షన్ వింగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్.

ఇంత మందిలో నన్నెవరు చూడొచ్చారులే అనే జులాయిల ధిలాసాకు వణుకు పుట్టించే టెక్నిక్స్ ఎన్నో ఉన్నాయి. ట్రాక్ యాప్‌ల నుంచి సర్వైలెన్స్ ఐ వరకు పోలీస్ రిపోర్ట్ నుంచి కోర్ట్ కొరడా దాకా బోలెడు. అందుకే మహిళల పట్ల మర్యాద పాటించడం ఒక్కటే రక్షణ కవచం. అది నేర్చుకుంటే ఇవన్నీ దూరం. ఈ పాఠం అందరికీ!

**– సరస్వతి రమ**

### కొత్త యాప్‌లున్నాయి.. జాగ్రత్త




కొత్త కొత్త యాప్‌లు వస్తున్నాయి వాటి గురించి అవగాహన ఉండాలి. మనకు తెలియకుండానే మనల్ని వీడియో తీస్తుంటారు. అనుమానం వచ్చి పట్టుకుంటే ఆ ఫోన్‌లో ఏమీ కనిపించదు. అలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటారు. అందుకే ఫోన్ లాక్కోగానే గ్యాలరీలోకి వెళ్లి చూసే బదులు కెమెరా యాక్టివ్‌లో ఉందా అనేది చెక్ చేయాలి. కెమెరా యాక్టివ్‌లో ఉంటే కచ్చితంగా మిమ్మల్ని ట్రేస్ చేస్తున్నట్లే లెక్క. కొన్ని ఫోన్లలో టచ్ చేయంగానే కెమెరా ఆఫ్ అయిపోయేలా సెట్టింగ్స్ ఉంటాయి. అప్పుడు ఓపెన్‌లో ఉన్న ట్యాబ్స్ అన్నీ చెక్ చేయాలి. గ్యాలరీలో ఫీడ్ ఏమీ దొరక్కపోయినా తర్వాత ఎక్కడోక్కడ కాపీ చేస్తారు. అప్పుడు దాంతో ఇమేజ్ అనాలిసిస్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఫోన్ లాక్కోగానే కెమెరా పొజిషన్‌ను చెక్ చేయడం మాత్రం మరవద్దు. ఒకవేళ ఎక్కడా ఏమీ దొరక్కపోయినా సీసీ కెమెరా ఫుటేజ్‌తో నేరస్తులు ఏం చేశారో చూడొచ్చు. ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను అమర్చి ఇలాంటి వాళ్ల ఆగడాలను అరికట్టొచ్చు.

**– సందీప్ ముదాల్కర్** సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేటర్ అండ్ ట్రైనర్

## చెట్టు నీడ

### బొమ్మకాదది... అమ్మ

ఆయనకు అమ్మానాన్నా పెట్టిన పేరు గదాధరుడు. చిన్ననాటినుండి చదువు, సంపాదనల మీద ఆసక్తి చూపించక, అన్నింటి మీదా విరక్తుడై ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతిలోనే విహరిస్తూ సమయాన్ని గడిపేవాడు. ఒకసారి ఆలయ పూజారి అయిన అన్నయ్యకు ఎందుకో వీలుపడక అర్చకత్వం కోసం ఇతన్ని పంపారు ఇంటిలోని వాళ్లు. అప్పుడ తను ఆలయంలోని కాళీమాతను చూసి ఆమె బొమ్మకాదని... తను పిలిస్తే పలుకుతుందని నిశ్చయించుకుని ఆ కాళీమాతకు పూజలు చేస్తూ రేయింబవళ్ళు అమ్మవారి ధ్యాసలోనే గడిపి అమ్మ అనుగ్రహాన్ని, ఆమె దర్శనాన్ని పొందాడు. తర్వాత కొంతకాలానికి తోతాపురి అనే సాధువు ఉపదేశించిన అద్వైత జ్ఞానం అతని జీవితాన్ని మలుపు తిప్పింది.



క్రమంగా ఆయన తన జీవిత పరమార్థాన్ని అర్థం చేసుకున్నాడు. జ్ఞానోదయం పొందాడు. తన భార్య శారదాదేవినే శిష్యురాలిగా చేసుకుని తాను గురువు వద్ద నేర్చుకున్న విద్యలన్నీ ఆమెకు నేర్పాడు. అంతేకాదు, ఆమె గ్రహణ శక్తికి మెచ్చి ఆమెను సాక్షాత్తూ కాళికాదేవిలా భావించి పూజించేవాడు..

''మీరు భగవంతుని చూసారా''అని ప్రశ్నించిన వివేకానందుడు మొదలుకుని భగవంతుడిని తెలుసుకోవాలనే తపన గల మరెందరికో తన జ్ఞానానుభావాలను పంచాడు. భగవంతుని భగవంతునిలా కాక తన చెలికాడిగా భావించాడు. మామూలువారితో మాట్లాడినట్టే కాళికామాతతో మాట్లాడుతుండేవాడు. నిష్కల్మషమైన, ప్రగాఢమైన ఆయన భక్తి అమ్మవారిని మెప్పించి ఆయన పిలిస్తే పలికేది. నిత్యం భగవంతునిసేవలో రమిస్తూ, తనను తాను మరచిపోయి బాహ్య స్మృతి కోల్పోతుండేవాడు. తన అనుభవాలను ఉపదేశాలుగా కథలుగా శిష్యులకు బోధించేవారు. ఆయన పంచిన ఉపదేశాలే ఆయన శిష్యకోటికి నేటికీ భగవత్సాధనలో ముందుండి దారి చూపుతున్నాయి.

## విమెన్స్ టి20 వరల్డ్ కప్

# ఆల్ ద బెస్ట్ హర్మన్

**క్రికెట్ మగవాళ్ల ఆట అని అనేవాళ్లు ఇప్పుడు జంకుతున్నారు. స్టేడియంలో స్త్రీలు కొడుతున్న సిక్సర్‌లు అలా ఉన్నాయి. మహిళా క్రికెట్ దినదినప్రవర్ధమానమవుతోంది. సంప్రదాయ ఆటను దాటి టి20 స్థాయికి ఎదిగింది. పది దేశాల మహిళలు ప్రపంచ కప్ కోసం తలపడనున్నారు. వారు ఒకరితో ఒకరు పోటీ పడినా అందరూ కలిసి రుజువు చేయాలనుకుంటున్నది మాత్రం 'క్రికెట్ మా ఆట కూడా' అని చెప్పడమే.**





మహిళలను 'ఆకాశంలో సగం'... అంటుంటారు. కానీ ఆదరణ విషయంలో, ఆర్థిక అంశాల్లో పురుషుల క్రికెట్‌తో పోలిస్తే మహిళల క్రికెట్‌కు ఎంతో వివక్ష ఉంది. అయితే పురుష క్రికెటర్లకు దీటుగా తామూ మెరిపించగలమని, ధనాధన్ ఆటతో మైదానాన్ని దద్దరిల్లచేయగలని నిరూపించడానికి మహిళా క్రికెటర్లు అమితోత్సాహంతో వేచి చూస్తున్నారు. వారందరికీ ఆస్ట్రేలియా వేదిక కానుంది. మరో మూడు రోజుల్లో ఆస్ట్రేలియాలో మహిళల టి20 ప్రపంచకప్ మొదలుకానుంది. 17 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్ అంతర్జాతీయ మహిళల దినోత్సవం మార్చి 8న విఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. ఇప్పటికే టైటిల్ వేట కోసం 10 జట్లు ఆస్ట్రేలియాకు చేరుకున్నాయి. సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. భారత మహిళల జట్టు మూడు వారాల క్రితమే ఆస్ట్రేలియా చేరుకుంది.

**మూడుసార్లు సెమిస్‌లోకి**

11 ఏళ్ల క్రితం 2009లో తొలిసారి మహిళల టి20 ప్రపంచకప్ జరిగింది. తర్వాతి ఏడాది రెండోసారి ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించారు. 2012 నుంచి ప్రతి రెండేళ్లకోసారి ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ఆరు టి20 ప్రపంచకప్‌లలో భారత్ మూడుసార్లు సెమీఫైనల్స్‌లోకి (2009, 2010, 2018) దూసుకెళ్లింది. అయితే టైటిల్ సమరానికి ఒక్కసారీ అర్హత పొందలేకపోయింది. కానీ ఈసారి సెమీఫైనల్ అడ్డంకిని దాటడమే కాకుండా కప్పుతో తిరిగి రావాలని కృతనిశ్చయంతో ఉంది.

**ఏ జట్టు కెప్టెన్ ఎవరంటే...**

- **ఆస్ట్రేలియా:** మెగ్ లానింగ్
- **భారత్:** హర్మన్‌ప్రీత్ కౌర్
- **న్యూజిలాండ్:** సోఫీ డివైన్
- **శ్రీలంక:** చమరి ఆటపట్టు
- **బంగ్లాదేశ్:** సల్మా ఖాతూన్
- **ఇంగ్లండ్:** హీథెర్ నైట్
- **పాకిస్తాన్:** బిస్మా మారూఫ్
- **దక్షిణాఫ్రికా:** డేన్ వాన్ నికెర్క్
- **వెస్టిండీస్:** స్టెఫానీ టేలర్
- **థాయ్‌లాండ్:** సొర్నారిన్ టిపోచ్

### హర్మన్ పంజా

వరుసగా ఏడో ప్రపంచకప్‌లో ఆడుతోన్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అనుభవం ఈసారి జట్టుకు పెద్ద అనుకూలాంశం. టీనేజర్‌గా 2009లో తొలి వరల్డ్ కప్ ఆడిన ఈ పంజాబీ అమ్మాయి ఇప్పుడు జట్టులో సీనియర్ సభ్యురాలిగా మారిపోయింది. 30 ఏళ్ల హర్మన్‌ప్రీత్ వరుసగా రెండో ప్రపంచకప్‌లో భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది. ధనాధన్ ఆటకు పెట్టింది పేరైన హర్మన్ క్రీజులో నిలదొక్కుకొని బ్యాట్ ఝుళిపించిందంటే స్కోరు బోర్డుపై పరుగుల వరద పారాల్సిందే. 2018 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై హర్మన్‌ప్రీత్ కేవలం 51 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 103 పరుగులు చేసింది. టి20ల్లో భారత్ తరఫున సెంచరీ చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. ఓవరాల్‌గా కెరీర్‌లో 109 టి20 మ్యాచ్‌లు ఆడిన అనుభవమున్న హర్మన్ 2,156 పరుగులు సాధించింది. ఇందులో ఒక సెంచరీ, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఫీల్డర్‌గా 42 క్యాచ్‌లు పట్టిన హర్మన్ బంతితోనూ మెరిసి 29 వికెట్లు పడగొట్టింది. గత ప్రపంచకప్‌లో దొర్లిన పొరపాట్లను పునరావృతం చేయకుండా... పక్కా ప్రణాళికతో ఆడి... హర్మన్ నాయకత్వానికి ఇతర సభ్యుల ప్రతిభ తోడైతే భారత్ ఈసారి అద్భుతం చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

### నాన్న ప్రోత్సాహం...

1989లో పంజాబ్‌లోని మోగా జిల్లాలో మార్చి 8న జన్మించిన హర్మన్‌కు క్రికెట్ కష్టాలేవీ లేవనే చెప్పాలి. హర్మన్ తండ్రి హర్మీందర్ సింగ్ భుల్లర్ తనూ క్రికెటర్ కావడంతో కూతురు ఇష్టాన్ని ఎప్పుడూ కాదనలేదు. హర్మన్ కెరీర్‌ను తీర్చిదిద్దడంలో స్థానిక కోచ్ కమల్దీష్ సింగ్ కూడా కీలకపాత్ర పోషించారు. వివిధ వయో విభాగాల్లో నిలకడగా రాణించి 19 ఏళ్లకే భారత సీనియర్ జట్టులో చోటు పొందిన హర్మన్ ఆ తర్వాత ఒక్కో మెట్టు ఎక్కుతూ కెప్టెన్ హోదాలో ప్రస్తుతం జట్టును ముందుండి నడిపించే బాధ్యతను నిర్వర్తిస్తోంది. బంతిని చూడటం... బలంగా బాదడమే హర్మన్‌కు తెలిసిన విద్య. భారత మాజీ ఓపెనర్, విధ్వంసకర ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ వీరాభిమాని అయిన హర్మన్.. 2017 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై (115 బంతుల్లో 171 నాటౌట్; 20 ఫోర్లు, 7 సిక్స్‌లు) చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఒంటిచేత్తో ఫైనల్‌కు చేర్చింది.

### తలో చేయి వేస్తేనే...

జట్టు క్రీడ అయిన క్రికెట్‌లో ప్రతిసారీ ఒకరిద్దరి ప్రతిభ కారణంగా గెలవలేం. భారత మహిళల జట్టు తొలిసారి విశ్వవిజేతగా అవతరించాలంటే ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్‌కు ఆమె సహచరులు కూడా తమ నైపుణ్యంతో తోడ్పాటు అందించాల్సిందే. ముందుగా ఓపెనర్లు స్మృతి మంధాన, 16 ఏళ్ల టీనేజ్ సంచలనం షఫాలీ వర్మ శుభారంభం ఇచ్చి గట్టి పునాది వేస్తే... ఆ తర్వాత 19 ఏళ్ల జెమీమా రోడ్రిగ్స్, వేద కృష్ణమూర్తి, దీప్తి శర్మ తదితరులు ఇన్నింగ్స్‌ను మరింత ముందుకు తీసుకెళ్తారు. ఇక బౌలింగ్‌లో సీనియర్ పేసర్ శిఖా పాండే, హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, పూజ వస్త్రకర్, స్పిన్నర్లు రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, పూనమ్ యాదవ్ విజృంభిస్తే భారత్ జైత్రయాత్రను ఎవరూ ఆపలేరు.

**– కరణం నారాయణ,**
సాక్షి క్రీడా విభాగం

**7** ప్రస్తుతం జరగబోయేది ఏడో టి20 ప్రపంచకప్. ఆస్ట్రేలియా జట్టు అత్యధికంగా నాలుగుసార్లు (2010, 2012, 2014, 2018) చాంపియన్‌గా నిలిచింది. ఒక్కోసారి ఇంగ్లండ్ (2009), వెస్టిండీస్ (2018) విజేతగా నిలిచాయి.

**13** గత ఆరు టి20 ప్రపంచ కప్‌లలో కలిపి ఓవరాల్‌గా భారత్ మొత్తం 26మ్యాచ్‌లు ఆడింది. 13 మ్యాచ్‌ల్లో గెలిచి, 13 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

**ఈ ప్రపంచకప్‌లో మొత్తం 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. 'ఎ' గ్రూప్‌లో ఐదు జట్లు (ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్)... 'బి' గ్రూప్‌లో ఐదు జట్లు (ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, పాకిస్తాన్, థాయ్‌లాండ్) ఉన్నాయి. లీగ్ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన రెండేసి జట్లు సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. సెమీఫైనల్స్‌లో నెగ్గిన రెండు జట్లు మార్చి 8న ఫైనల్లో టైటిల్ కోసం తలపడతాయి.**

**ప్రపంచకప్ మ్యాచ్‌లు మొత్తం నాలుగు నగరాల్లోని (పెర్త్, సిడ్నీ, మెల్‌బోర్న్, కాన్‌బెర్రా) ఆరు మైదానాల్లో జరుగుతాయి. టోర్నీలో జరిగే మొత్తం 23 మ్యాచ్‌లను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.**

### ప్రైజ్‌మనీ

**విజేత జట్టుకు 10 లక్షల అమెరికన్ డాలర్లు (రూ. 7 కోట్ల 14 లక్షలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. రన్నరప్ జట్టుకు 5 లక్షల డాలర్లు (రూ. 3 కోట్ల 57 లక్షలు) అందజేస్తారు.**




• వెంకటేశ్

# నాన్‌స్టాప్ నారప్ప

'నారప్ప' టీమ్ బ్రేక్ లేకుండా ఫుల్ స్పీడ్‌తో షూటింగ్ చేస్తోంది. నాన్‌స్టాప్‌గా నెల రోజులు తమిళనాడులో షూటింగ్ చేయనున్నారని తెలిసింది. వెంకటేశ్ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నారప్ప'. తమిళ సూపర్‌హిట్ 'అసురన్'కి ఇది తెలుగు రీమేక్. కలైపులి యస్ థాను, సురేశ్‌బాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రియమణి, అమలాపాల్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం తమిళనాడులోని కోవిల్‌పట్టిలో జరుగుతోంది. నెలరోజుల పాటు తమిళనాడు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరపనున్నారు. ప్రస్తుతం ఓ పాట చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. వేసవిలో విడుదల కానున్న ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు.

# అలివేలు వెంకటరమణ


• గోపీచంద్

దర్శకుడు తేజ తెరకెక్కించిన 'జయం, నిజం' సినిమాల్లో విలన్ పాత్రలో నటించారు గోపీచంద్. విలన్‌గా మంచి ప్రశంసలు అందుకున్నారు కూడా. ఇప్పుడు తేజ దర్శకత్వంలో హీరోగా నటించనున్నారాయన. గోపీచంద్ – తేజ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రానికి 'అలివేలు వెంకటరమణ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఇందులో గోపీచంద్ పాత్ర పూర్తి పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. గోపీచంద్‌లోని కొత్త కోణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించనున్నారట తేజ. జూన్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో 'సీటీమార్' అనే సినిమా చేస్తున్నారు గోపీచంద్.

# నాది చాలా బోరింగ్ లైఫ్!


• మహేశ్‌బాబు

ప్రస్తుతం బయోపిక్స్ ట్రెండ్ నడుస్తోంది. మరి మీ బయోపిక్ తీస్తే ఎలా ఉంటుంది? మీ పాత్రలో ఎవరు నటిస్తే బావుంటుంది? అని ఓ ఇంటర్వ్యూలో మహేశ్‌బాబుని అడిగితే ఈ విధంగా స్పందించారు. ''నాది చాలా సింపుల్, బోరింగ్ లైఫ్. నా బయోపిక్ వర్కౌట్ అవుతుందని నేను అనుకోను'' అని సమాధానమిచ్చారు. ఒకవేళ రోడ్ ట్రిప్‌కి వెళ్తే మీతో పాటు ఇండస్ట్రీలో ఎవర్ని తీసుకెళ్తారు? అనే ప్రశ్నకు ''చరణ్ (రామ్‌చరణ్), తారక్ (ఎన్టీఆర్).. అలాగే బ్యాలెన్స్ చేయడానికి చిరంజీవిగారిని తీసుకెళ్తాను'' అన్నారు మహేశ్‌బాబు. ఇక సినిమాల విషయానికి వస్తే వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్ చేయనున్న సినిమా షూటింగ్ వేసవి తర్వాత ప్రారంభం కానుందట.

# పైలెట్.. హైలైట్


• కంగనా


కంగనా రనౌత్ ఎలాంటి అమ్మాయి? అంటే డేరింగ్ అండ్ డ్యాషింగ్. అలాంటి మనస్తత్వం ఉన్న అమ్మాయి కాబట్టే నటిగా కూడా ధైర్యంగా రిస్కులు తీసుకుంటుంది. 'మణికర్ణిక' సినిమాలో వీర వనిత ఝాన్సీ లక్ష్మీ బాయ్ పాత్ర చేసింది. ఆ సినిమాలో అలవోకగా కత్తి తిప్పుతూ యుద్ధం చేసింది. ఇప్పుడు 'తేజస్' సినిమాలో మరో డేరింగ్ అండ్ డ్యాషింగ్ క్యారెక్టర్ చేస్తోంది. ఇందులో యుద్ధ విమానం నడిపే పైలెట్ పాత్రలో కనిపించనుంది కంగనా. సోమవారం ఆమె పాత్ర లుక్‌ని విడుదల చేశారు. యుద్ధ విమానం ముందు పైలెట్ యూనిఫామ్‌లో, చేత్తో హెల్మెట్ పట్టుకుని ఉన్న కంగనా లుక్ హైలైట్. ''మన జాతి కోసం యూనిఫామ్ వేసుకుని, త్యాగాలు చేస్తున్న గుండె ధైర్యం ఉన్న స్త్రీల్లారా.. ఎయిర్‌ఫోర్స్ పైలెట్‌గా కంగనా లుక్ ఇదిగో'' అంటూ చిత్రబృందం ఆమె లుక్‌ని విడుదల చేసింది. సర్వేష్ మేవారా దర్శకత్వంలో రోనీ స్క్రూవాలా సంస్థ ఈ చిత్రం నిర్మించనుంది. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభం కానుంది. ఈలోపు పైలైట్ పాత్ర కోసం కంగనా శిక్షణ తీసుకోబోతోంది.

# కోలీ టు టాలీ


• ప్రియా భవానీ

మూడేళ్ల విరామం తర్వాత మళ్లీ సినిమా చేస్తున్నారు మంచు మనోజ్. 'అహం బ్రహ్మస్మి' అనే టైటిల్‌తో ప్యాన్ ఇండియా సినిమా చేయనున్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకుడు. యంయం ఆర్ట్స్ బ్యానర్‌పై మనోజ్, నిర్మలా దేవి నిర్మించనున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా ప్రియా భవానీ శంకర్ నటించనున్నారని తెలిసింది. కార్తీతో 'కడైకుట్టి సింగం', తెలుగు 'పెళ్లి చూపులు' తమిళ రీమేక్‌లో నటించారు ప్రియా భవానీ శంకర్. ప్రస్తుతం కమల్ హాసన్ 'ఇండియన్ 2'లో ఓ కీలక పాత్ర చేస్తున్నారామె. ఈ కోలీవుడ్ భామకు టాలీవుడ్‌లో 'అహం బ్రహ్మస్మి' తొలి సినిమా అవుతుంది. మార్చి 6న ఈ సినిమా ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

# శ్రీకాంత్‌కు పితృవియోగం


• పరమేశ్వరరావు

నటుడు శ్రీకాంత్ తండ్రి మేక పరమేశ్వరరావు ఇక లేరు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆయన నాలుగు నెలలుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు తుది శ్వాస విడిచారు. కృష్ణాజిల్లా మేకావారి పాలెంలో 1948 మార్చి 16న జన్మించిన పరమేశ్వరరావు కర్ణాటకలోని గంగావతి జిల్లా బసవ పాలెంకు వలస వెళ్లారు. ఆయనకు భార్య ఝాన్సీ లక్ష్మి, కుమార్తె నిర్మల, కుమారులు శ్రీకాంత్, అనిల్ ఉన్నారు. పరమేశ్వరరావు భౌతిక కాయానికి హీరో చిరంజీవి, నిర్మాత అల్లు అరవింద్, నటి రాశీ, హీరో గోపీచంద్, మాదాల రవి నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.


# బెంగాలీ బాబు శోభన్‌బాబు


• జిష్షుసేన్

దివంగత నటి, ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ 'తలైవి'లోని స్టార్ క్యాస్ట్ రోజురోజుకీ పెద్దదవుతోంది. జయలలితగా కంగనా రనౌత్, యంజీఆర్‌గా అరవింద స్వామి, శశికళ పాత్రలో ప్రియమణి నటిస్తున్నారు. కరుణానిధిగా ప్రకాశ్‌రాజ్ కనిపిస్తారట. తాజాగా శోభన్‌బాబు పాత్రలో బెంగాలీ నటుడు జిష్షుసేన్ గుప్తా నటిస్తారని తెలిసింది. ఏఎల్ విజయ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను విష్ణు ఇందూరి నిర్మిస్తున్నారు. శోభన్‌బాబు, జయలలిత కొంతకాలం ప్రేమలో ఉన్నారని అప్పట్లో టాక్. శోభన్‌బాబు పాత్ర ఈ సినిమాలో కీలకంగా ఉండబోతోందట. ఈ పాత్రను పోషించడానికి శోభన్‌బాబు పాత చిత్రాలను చూస్తున్నారట జిష్షు సేన్. యన్టీఆర్ బయోపిక్‌లో ఎల్వీ ప్రసాద్ పాత్రలో, 'అశ్వథ్థామ' లో విలన్ పాత్రలో నటించారు జిష్షు.

# ఆ మాట వినగానే నాన్న షాక్ అయ్యారు

"నచ్చావులే' సినిమా నుంచి నన్ను ఆదరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు 'సవారి' పాటల్ని పెద్ద హిట్ చేశారు. ముఖ్యంగా 'నీ కన్నులు..' పాట ఇప్పటికే 10 మిలియన్ వ్యూస్ సాధించింది. ఈ పాటతో టిక్ టాక్‌లో కొన్ని లక్షల వీడియోలు చేశారు. ఈ పాట పాడిన రాహుల్ సిప్లిగంజ్, రాసిన కాసర్ల శ్యామ్‌గార్లకు థ్యాంక్స్" అన్నారు సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర. ఆయన సంగీతం అందించిన తాజా చిత్రం 'వలయం' ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ చిత్రం నుండి ఇటీవల విడుదల చేసిన 'నిన్ను చూశాకే..' పాటకి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా శేఖర్ చంద్ర చెప్పిన విశేషాలు.


• శేఖర్ చంద్ర

- మా నాన్నగారు (హరి అనుమోలు) కెమెరామేన్. నేను మ్యూజిక్ డైరెక్టర్ అవుతాను అన్నప్పుడు ఆయన షాకయ్యారు. సినిమాటోగ్రఫీ అంటే ఫర్వాలేదు కానీ మ్యూజిక్ డైరెక్టర్‌గా అంటే చాలా రిస్క్ అన్నారు. కొన్ని సినిమాలు చేశాక వాటికి వచ్చిన స్పందన చూసి ఆయనకి నమ్మకం కుదిరింది.
- నేను సంగీత దర్శకుడు కావడానికి స్ఫూర్తి కీరవాణి, ఏ.ఆర్.రెహమాన్‌గార్లు. నేను చిత్రపరిశ్రమకి వచ్చి 14 ఏళ్లు అయింది. ఇప్పటి వరకూ దాదాపు 35 సినిమాలు చేశాను. నా కెరీర్ చాలా కూల్‌గా వెళ్తోంది. నా పాటలకు మంచి స్పందన వస్తోంది. వాటిని ఎక్కువగా టిక్ టాక్‌లు చేస్తూ వైరల్ చేస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగులో సాధించాల్సింది చాలా ఉంది. ఆ తర్వాత ఇతర భాషల గురించి ఆలోచిస్తా.
- నేను ఇప్పటి వరకూ చేసిన పెద్ద సినిమా కల్యాణ్ రామ్‌గారి '118' . అందులో ఒకే ఒక్క పాట ఉంటుంది.. అది పెద్ద చాలెంజ్. ఆ సినిమాలో ఉన్న ఆ ఒక్క పాటకి న్యాయం చేయగలనా? అని భయం వేసింది. అందులోనూ అది థ్రిల్లర్ సినిమా. అయితే 'చందమామే..' అనే పాట చాలా పెద్ద హిట్ అయ్యింది. నా కెరీర్లో ఇది గుర్తుండిపోయే పాట అని కల్యాణ్ రామ్‌గారు అభినందించడం మరచిపోలేను.
- పెద్ద హీరోల సినిమాలు చేయడం లేదనే భావన ఉంది. నేను చేసేవి చిన్న సినిమాలు అయినప్పటికీ.. కొత్త కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలు. దీంతో ఫ్రెష్ మ్యూజిక్ ఇవ్వగలుగుతున్నాను. పేరు తెచ్చిపెట్టడానికి పెద్ద సినిమానే అవసరం లేదు కదా? ప్రేమ కథా చిత్రాలు చేయడం వల్ల మంచి మెలోడీస్, థ్రిల్లర్స్ చేయడం వల్ల చక్కని నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం ఉంటుంది.

# యాక్షన్ సినిమా చేయాలనుంది


• దిశా పటానీ

''పాత్రలతో ప్రయోగాలు చేయడానికి ఇష్టపడతాను'' అంటున్నారు బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ. 'లోఫర్, ధోని బయోపిక్, భాగీ 2, మలంగ్' సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నారు దిశా. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ సరసన 'రాధే' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. యాక్టర్‌గా మీకు ఎలాంటి సినిమాలు చేయాలనుంది? అని దిశాని అడిగితే – ''అన్ని రకాల పాత్రలను చేయాలనుకుంటున్నాను. నేను చేసే ప్రతీ పాత్ర చాలా ఇంట్రస్టింగ్‌గా ఉండాలనుకుంటాను. ప్రస్తుతానికి ఓ యాక్షన్ సినిమా చేయాలనుంది. ఆ సినిమాలో ఫుల్ యాక్షన్ చేసి, యాక్షన్ సినిమాలకు కూడా పనికొస్తానని నిరూపించుకోవాలని ఉంది'' అన్నారు దిశా.

# అమ్మ దీవెన


• జీవిత, ఆమని

ఆమని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అమ్మ దీవెన'. శివ ఏటూరి దర్శకత్వంలో లక్ష్మీ సమర్పణలో ఎత్తరి మారయ్య, చిన మారయ్య, గురవయ్య నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను జీవితా రాజశేఖర్ విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆమని మాట్లాడుతూ– ''మగదిక్కు లేని కుటుంబంలో ఓ స్త్రీ ఐదుమంది పిల్లలని ఎలా చదివించింది? వారి భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దింది? అనే కథతో వస్తున్న మా సినిమాని సపోర్ట్ చేస్తున్న జీవితగారికి థ్యాంక్స్'' అన్నారు. ''ఆమనిగారి కెరీర్‌లో మైలురాయిలా నిలిచే సినిమా అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ''మంచి సినిమా నిర్మించాలని నిర్మాతలు రాజీపడలేదు'' అన్నారు శివ ఏటూరి.

# సినిమా తీయడం అంత సులువు కాదు

''నాకు సినిమా పట్ల అంత ఆసక్తి లేదు. కాకపోతే రాయడం నేర్చుకున్నాను. అమెరికాలో ఎమ్మెస్ చేశాను.. అక్కడే ఓ ఐటీ కంపెనీలో 10 ఏళ్లు పని చేశాను. ఆ తర్వాత 2004లో బెంగళూరుకు మారిపోయా'' అని సుజాయ్ కారంపూడి తెలిపారు. సాయి రోనక్, ప్రీతి అస్రాని, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో సుజాయ్, సుశీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రెషర్ కుక్కర్'. అప్పిరెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుజాయ్ మాట్లాడుతూ– ''మధుర' శ్రీధర్ షార్ట్ ఫిలిం కోసం ఒక స్టోరీ రాశాను. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా కథలు రాయమని సలహా ఇచ్చారు. మేం ఇండస్ట్రీకి కొత్త. ఎలా ముందుకు వెళ్లాలో తెలియదు. అందుకే తెలుగు సినిమాలు చూశాం. మా ప్రయత్నాల్ని, సమయాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నాం. సినిమా నిర్మాణం మాకు చాలా నేర్పించింది.. ఆటుపోట్లు తెలిశాయి. సినిమా అనేది అంత సులభమైన పనేం కాదు. ఈ చిత్రం షూటింగ్ సమయంలో మా కుటుంబాన్ని కనీసం వారాంతంలో కూడా కలవలేకపోయాం. స్క్రిప్ట్ డెవలప్ చేయడమో, సినిమా మేకింగ్‌లోనో బిజీగా ఉండేవాళ్లం'' అన్నారు.


• సుజాయ్, సుశీల్


సుశీల్ మాట్లాడుతూ– ''మేం సాఫ్ట్‌వేర్ నేపథ్యం నుంచి వచ్చాం. అక్కడ చర్చల్లో డెవలప్‌మెంట్, ఫీడ్‌బ్యాక్ వంటి విలువైన అంశాలు ఉండేవి. ఇవే సూత్రాల్ని మేం స్టోరీ చర్చించేటప్పుడు కూడా పాటించాం. సినిమా మేకింగ్ సమయంలో అవి బాగా దోహదపడ్డాయి. ఒక యువకుడి చుట్టూ తిరిగే కథే ఈ చిత్రం. తల్లిదండ్రుల ఆత్మీయత, భావోద్వేగాల్ని ఈ సినిమాలో చూపించాం. మేకర్స్‌గా మాకిది తొలి సినిమా. విలువైన విమర్శలను ఆహ్వానిస్తాం'' అన్నారు.






సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 18-2-2020

సేంద్రియ వ్యవసాయం ద్వారా తగినంత ఆహారాన్ని పండించగలమా అన్న సందేహం అవసరం లేదు. అయితే, సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలి. సేంద్రియ ఉత్పత్తుల సేకరణకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.
– ప్రొ. రాధామోహన్, పద్మశ్రీ పురస్కార విజేత, ఒడిశా



ధనిష్ట కార్తె : ఫిబ్రవరి 18 వరకు శతభిష కార్తె : ఫిబ్రవరి 19 నుంచి

అపురూపమైన దేశీయ గో జాతులు, గేదె జాతుల అభ్యున్నతికి నిర్మాణాత్మక కృషికి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చింతలదేవిలో ఏర్పాటైన జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రం చిరునామాగా మారుతోంది. ప్రస్తుతం 12 దేశీయ గో జాతులు, 5 దేశీ గేదె జాతుల పశువులను పరిరక్షిస్తున్నారు. అంతరించిపోతున్న పుంగనూరు వంటి గోజాతుల నుంచి మేలైన పశుజాతులను అతి తక్కువ సమయంలో పునరుత్పత్తి చేసి రైతులకు అందించడం ఈ బ్రీడింగ్ కేంద్రం ముఖ్య లక్ష్యం. ఈ కేంద్రంలో సుమారు 6 నెలల క్రితం పుట్టిన ఒంగోలు గిత్త దూడ చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులతోపాటు నీటిని అందించి ప్రోత్సహిస్తే మేలైన పశుజాతుల ద్వారా రైతుల అభివృద్ధికి దోహదపడినట్టవుతుంది.



థార్‌పార్కర్ ఆవు



థార్‌పార్కర్ ఆవు కడుపున పుట్టి, ఆరోగ్యంగా పెరుగుతున్న ఒంగోలు గిత్త దూడ తాజా చిత్రం



చింతలదేవిలోని కామధేను బ్రీడింగ్ కేంద్రం సంరక్షణలో ఉన్న దేశీ జాతుల ఆవులు



చింతలదేవిలోని కామధేను బ్రీడింగ్ కేంద్రం సంరక్షణలోని వివిధ జాతుల గేదెలు

# దేశీ ఆవుకు ఆలంబన కామధేను

- సత్ఫలితాలిస్తున్న చింతలదేవిలోని జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రం పరిశోధనలు
- మేలైన ఒంగోలు తదితర గోజాతులతోపాటు గేదె జాతుల అభ్యున్నతికి కృషి

దేశీ పశుజాతులు ఇటు వ్యవసాయానికి అటు పాల దిగుబడికి పట్టుగొమ్మల్లాంటివి. రైతులకు, ముఖ్యంగా చిన్న–సన్నకారు రైతాంగానికి, పశు పోషణ నిరంతర ఆదాయానికి పెట్టింది పేరు. మెట్ట రైతుకు అరకలే ఆధారం. వ్యవసాయంపై ఆదాయం కన్నా పాడి మీదనే ఎక్కువ ఆదాయం పొందే రైతు కుటుంబాలు ఉన్నాయి. అయితే, దేశీ గోజాతుల్లో పాలధార తక్కువగా ఉండటం వల్ల సంకరజాతి పశువుల వైపు మొగ్గాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో అత్యాధునిక పశుగణాభివృద్ధి పద్ధతుల ద్వారా మంచి పాలధార కలిగిన దేశీ గోజాతులను త్వరితగతిన అభివృద్ధి చేసుకోవడం ఒక్కటే మార్గం.

ఇందుకోసమే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురం మండలం చింతలదేవిలో 2015 ఏప్రిల్ 4న ఏర్పాటైంది. దేశీ పశుసంపదను నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఏర్పాటైన కామధేను ప్రాజెక్టుకు ఆనాటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు శంకుస్థాపన చేశారు. ఇటువంటి ప్రతిష్టాత్మక బ్రీడింగ్ కేంద్రం చింతలదేవితోపాటు మధ్యప్రదేశ్‌లోని ఔరంబాదాద్ జిల్లా హిటాచిలో మరొకటి ఉంది.

కామధేను ప్రాజెక్టుకు మొదటి దశలో రూ. 25 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పశు వైద్యశాల, పశుమేత ఉత్పత్తికేంద్రం, బయోగ్యాస్ ప్లాంటు, పాల ఉత్పత్తి కేంద్రం, పశువులకు షెడ్లు, రోడ్లు, నీటి సౌకర్యం కోసం బోర్లు, నీటి కుంటలు తదతర పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనుల్లో కొన్ని తుది దశకు చేరుకోగా మరికొన్ని పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు విస్తరణ కోసం మరో రూ.100 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు.

### ఒక మేలు జాతి పశువు నుంచి 60 దూడలు

మేలు జాతి పశు సంపదను వృద్ధి చేసుకునే ప్రక్రియలో రైతుల దగ్గర ఇప్పటికే ఉన్న సాధారణ ఆవులు, గేదెల గర్భాలనే ఉపయోగించుకునే పద్ధతిని అనుసరిస్తుండటం విశేషం. మేలు జాతి దేశీ ఆవులు, గేదెల నుంచి సేకరించిన అండాలను, మేలుజాతి దేశీ ఆబోతుల నుంచి సేకరించిన వీర్యాన్ని అత్యాధునిక సదుపాయాలున్న ప్రయోగశాలలో ఫలదీకరణ చెందించి మేలు జాతి పిండాలను ఉత్పత్తి చేస్తారు. ఆ పిండాలను స్థానికంగా రైతుల వద్ద నున్న పశువుల గర్భంలో ప్రవేశపెట్టి మేలు జాతి దూడలను ఉత్పత్తి చేస్తారు.

సాధారణంగా ఒక మేలురకం దేశీ ఆవు జీవిత కాలంలో 10–11 దూడలకు జన్మనిస్తుంది. అయితే, ఆవు ఒకసారి విడుదల చేసే అండంతో 18 వరకు పిండాలను ఉత్పత్తి చేయవచ్చు. ఏడాదిలో నాలుగు, ఐదుసార్లు ఈ ప్రక్రియ చేపట్టి.. ఒక మేలు జాతి ఆవు ద్వారా ఏడాదికి 50 నుంచి 60 మేలు రకం దూడలను పుట్టించవచ్చని, కామధేను బ్రీడింగ్ కేంద్రంలో ఈ ఏర్పాట్లన్నీ చేస్తున్నామని జాయింట్ డైరెక్టర్ డా. రామన్ 'సాక్షి'కి వివరించారు. ఇలా దేశీ గోజాతులను, గేదె జాతుల సంతతిని తక్కువ కాలంలోనే చాలా ఎక్కువ సంఖ్యలో వృద్ధి చేయవచ్చు. పుంగనూరు వంటి అంతరించిపోతున్న గోజాతుల పరిరక్షణకు ఈ పద్ధతి చాలా బాగా ఉపకరిస్తుంది. అదేవిధంగా పాలధార అధికంగా ఉన్న ఒంగోలు తదితర గోజాతుల సంతతిని తక్కువ కాలంలోనే ఇబ్బడిముబ్బడిగా పెంపొందించడానికి కామధేను ప్రాజెక్టు ద్వారా వీలవుతుంది.

ఇలా పుట్టించిన మేలైన దూడలను అడపాదడపా వేలం ద్వారా రైతులకు అందిస్తారు. మేలైన గోజాతుల పిండాలను రైతులకు విక్రయిస్తారు. తమ దగ్గర ఉన్న సాధారణ ఆవుల గర్భాలలోకి ఈ మేలుజాతి పిండాలను చేర్చి.. మేలైన దూడలను రైతులే ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ భావన.

తద్వారా దేశీ గో జాతుల ద్వారా అధిక పాల దిగుబడి సాధించడం, దుక్కి దున్నే ఎద్దులను అందుబాటులోకి తేవడం లక్ష్యం. ఈ విధానంపై మన రైతులకు అవగాహన కల్పించి మేలుజాతి పశువుల పోషణను ప్రోత్సహించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే కామధేను బ్రీడింగ్ కేంద్రం పరమ లక్ష్యమని డా. రామన్ చెప్పారు.

### 12 దేశీ గోజాతులు.. 5 గేదె జాతులు..

కామధేను బ్రీడింగ్ కేంద్రంలో ప్రస్తుతం 12 దేశీ గోజాతులు, 5 గేదె జాతులపై పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రతి 18 ఆవులు/గేదెలతోపాటు ఒక దున్నను పెంచుతున్నారు. ఈ 19 పశువులను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఒంగోలు, పుంగనూరు, కంగాయమ్, కాంక్రెజ్, మల్నాడ్ గిడ్డ, షాహివాల్, గిర్, రతి, థార్‌పార్కర్, రెడ్‌సింధి, దియోని, కృష్ణవేణి వంటి దేశీ గోజాతులతోపాటు.. ముర్రా, మోహతానా, పండిపురి, బాఫర్‌బాది, బన్ని గేదె జాతులను కామధేను బ్రీడింగ్ కేంద్రంలో ప్రస్తుతానికి సంరక్షిస్తున్నారు. 2017లో మొత్తం 119 ఆవులు, గేదెలతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో వీటి సంఖ్య ప్రస్తుతం 464కు పెరిగింది. ప్రతి ఏటా కొన్ని మేలైన దూడలను వేలం వేస్తుంటారు. ఈ ఏడాది కూడా త్వరలో వేలం తేదీలను ప్రకటిస్తామని డా. రామన్ వివరించారు. 2,450 ఎకరాలు విస్తీర్ణం గల చింతలదేవి పశుగణాభివృద్ధి క్షేత్రంలో కామధేను బ్రీడింగ్ కేంద్రానికి 500 ఎకరాలు కేటాయించారు. ఇందులో పశువులకు అవసరమైన పచ్చిగడ్డి పెంచుతున్నారు. ప్రస్తుతం పిండోత్పత్తి కేంద్రం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. బయోగ్యాస్ ప్లాంటు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. త్వరలో పాల ఉత్పత్తి కేంద్రం కూడా పూర్తి కానుంది.

### వెంటాడుతున్న నీటి కొరత

రాళ్లపాడు రిజర్వాయరు నుంచి పైప్‌లైను ద్వారా లిఫ్ట్ ద్వారా కామధేను బ్రీడింగ్ కేంద్రానికి నీరు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. లిఫ్ట్, పైప్‌లైను పనులు 75 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే, నీటితరలింపును కొందరు ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో ఈ బ్రీడింగ్ కేంద్రానికి నీటి సమస్య తలెత్తింది. ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా ఉన్న కామధేను బ్రీడింగ్ కేంద్రంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని కోరుతున్నారు.

– మేడగం భాస్కర్‌రెడ్డి,
సాక్షి, ఉదయగిరి, నెల్లూరు జిల్లా

### థార్‌పార్కర్ ఆవు కడుపున ఒంగోలు దూడ!

కామధేను బ్రీడింగ్ కేంద్రంలో థార్‌పార్కర్ ఆవు కడుపున పుట్టిన ఒంగోలు గిత్త దూడ సందర్శకుల దృష్టిని ఆకర్షిస్తోంది. మేలైన ఒంగోలు జాతి ఆవు అండం, మేలైన ఒంగోలు గిత్త వీర్యంతో తయారైన పిండాన్ని.. అధిక పాలధార కలిగిన థార్‌పార్కర్ ఆవు(ఎదకు వచ్చిన ఏడో రోజున) గర్భంలోకి ఐవిఎఫ్ పద్ధతిలో పెట్టారు. అలా పుట్టిన గిత్త దూడకు నూటికి నూరు శాతం ఒంగోలు జాతి లక్షణాలే వచ్చాయి. థార్‌పార్కర్ ఆవు కడుపులో పెరిగినప్పటికీ ఈ ఆవు లక్షణాలు అసలు రావని, పూర్తి స్వచ్ఛతతో కూడిన ఒంగోలు గిత్త దూడే పుట్టిందని డా. రామన్ తెలిపారు. గత ఏడాది ఆగస్టు 25న పుట్టిన ఈ దూడ ఇప్పటికే దాదాపు తల్లి ఎత్తుకు ఎదిగిందన్నారు. ఈ విధంగా రైతులు తమ వద్ద ఉన్న ఏ ఆవు కడుపులోనైనా తమకు అవసరమైన మేలైన పాలధార కలిగిన గోజాతి పిండాన్ని పెట్టించుకొని.. మేలైన ఆవులను లేదా గిత్తల సంతతిని వృద్ధి చేసుకోవడానికి కామధేను బ్రీడింగ్ కేంద్రం రైతులకు ఉపయోగపడతుందని డా. రామన్ అంటున్నారు. ఈ కేంద్రానికి అల్ట్రాసౌండ్ త్రీడీ కలర్ డాప్లర్ పరికరాలు ఇటీవల సమకూరటం విశేషం.

### దేశీ పశుజాతుల అభివృద్ధిలో ఐదారేళ్లలో అద్భుత ప్రగతి సాధ్యం

ఒంగోలు మేలు జాతి పశువులు మన దగ్గర ఎక్కువగా లేవని మనం చింతించనవసరం లేదు. కామధేను బ్రీడింగ్ కేంద్రానికి తగినన్ని నిధులతో పాటు పుష్కలంగా నీటిని అందించి ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఐదారేళ్లలోనే మేలైన పాలధార కలిగిన ఒంగోలు ఆవులు, మేలైన సామర్థ్యం కలిగిన ఒంగోలు గిత్తలను పెద్ద సంఖ్యలో మనమే ఉత్పత్తి చేసుకోవచ్చు. పుంగనూరు వంటి గోజాతి సంతతిని సులువుగా పెంపొందించుకోవచ్చు. దేశీ గోజాతులు, గేదె జాతుల అభివృద్ధి జరుగుతుంది. తద్వారా రైతులకు, ప్రభుత్వానికి కూడా ఎంతో ఆదాయం వస్తుంది.



– డా. రామన్ (94923 37017),
జాయింట్ డైరెక్టర్,
జాతీయ కామధేను బ్రీడింగ్ కేంద్రం,
చింతలదేవి, కొండాపురం మండలం,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

### 23న కొర్నెపాడులో తేనెటీగల పెంపకంపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు రైతు శిక్షణా కేంద్రంలో ఈ నెల 23(ఆదివారం)న వ్యవసాయంలో తేనెటీగల ప్రాముఖ్యత – తేనెటీగల పెంపకం – ప్రభుత్వ రాయితీలపై ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా కృష్ణారెడ్డి, తేనెటీగల పెంపకంలో నిపుణులు కోటేశ్వరరావు రైతులకు ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు అవగాహన కల్పిస్తారని ఫౌండేషన్ చైర్మన్ డా. యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోగోరే వారు 97053 83666, 0863–2286255 నంబర్లలో సంప్రదించవచ్చు.

# ఇంటిపంటల వికింగ్ బెడ్స్!

- వికింగ్ బెడ్‌లో వారానికి ఒకసారి నీరు పోస్తే చాలు
- బెడ్ లోపల పైపుల్లో నిల్వ ఉండే నీటిని మట్టి ద్వారా మొక్కలు తీసుకుంటాయి
- పెరట్లో, ఆరుబయట, గచ్చు మీద, మేడ మీద ఎక్కడైనా పెట్టుకోవచ్చు
- వేసవిలోను, కరువు ప్రాంతాల్లోనూ తాజా సేంద్రియ కూరగాయల సాగుకు అవకాశం



వికింగ్ బెడ్‌లో ఏపుగా పెరుగుతున్న ఆకుకూరలు

ఇంటి పంట

కరువు ప్రాంతాల్లో సైతం పెరట్లో, మెడపైన తక్కువ నీరు, తక్కువ శ్రమ, తక్కువ ఖర్చుతో సేంద్రియ ఇంటి పంటల సాగుకు అత్యుత్తమమైన సాధనం 'వికింగ్ బెడ్'. వికింగ్ బెడ్స్‌ను మెడపైనా, పెరటిలో, ఖాళీ ప్రదేశంలో, గచ్చుపైన ఎక్కడైనా సాగు చేసే చిన్నపాటి వ్యవసాయం. పట్టణాలు, నగరాల్లో, పల్లెల్లో కూడా అన్ని కాలాల్లోనూ కావాల్సిన రకాల కూరగాయలు పండించుకోవచ్చు.

ఐటీ ఉద్యోగం వదిలేసిన యువ ఇంజనీర్ అక్కిపెద్ది కళ్యాణ్ అనంతపురం జిల్లా టేకులోడు గ్రామం వద్ద పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు ఇంట్రిగేటర్ ఎకో (ప్రాటో) విలేజ్‌ను ఐదేళ్లుగా నిర్మిస్తున్నారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తున్నారు.

తక్కువ నీటితో, తక్కువ శ్రమతో సులువుగా సేంద్రియ కూరగాయలను పెంచుకునేందుకు 'వికింగ్ బెడ్స్'ను ఏర్పాటు చేశారు. సందర్శనకు వచ్చే విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. సాధారణ మడుల్లో లేదా కుండీల్లో నాటుకున్న కూరగాయ మొక్కలకు రోజూ నీరు పోయాల్సిందే. అయితే, వికింగ్ బెడ్‌లో ఇంటిపంటలకు రోజూ నీరు పోయాల్సిన పనిలేదు. ఇందులో అమర్చే పివిసీ పైపులో వారానికి ఒకసారి నిండుగా నీరు పోస్తే చాలు. పైపులో నీటిని బెడ్‌లో మట్టి పీల్చుకొని మొక్కల వేర్లకు నిరంతరం తేమను అందిస్తూ ఉంటాయి.

### వికింగ్ బెడ్ ఎలా తయారు చేసుకోవాలంటే..

వికింగ్ బెడ్ 4 అడుగుల వెడల్పు, పొడవు ఎంతైనా పెట్టుకోవచ్చు. 2 అడుగుల లోతు కల్గిన కంటెయినర్ (ప్లాస్టిక్ టబ్) తీసుకోవాలి. ముందుగా కంటెయినర్ పొడవుకు సరిపడే రెండు 6 అడుగుల పివిసీ పైపులు తీసుకుకోవాలి. వాటికి చుట్టు చిన్నచిన్న రంధ్రాలు చేసి రెండు పక్కలా మూలలో సరిపెడవిధంగా చేసి పైపులకు వేసిన రంథ్రాల్లో మట్టి వెళ్లకుండా గ్రీన్‌షెడ్ నెట్‌తో కట్టేసి చివరి పక్క మూత పెట్టాలి. అలా సిద్ధం చేసుకున్న పైపులకు ఎల్‌బో జాయింట్ అమర్చి, రెండు వైపులా ఎల్ ఆకారంలో 2 అడుగుల పైపులు పైకి నిలిపి వాటికి మారో పొడవాటి పైపు అమర్చి నీరు పోసేందుకు అనువుగా సిద్ధం చేసుకోవాలి. కంటెయినర్ గోడకు ఒక రంధ్రం అదనపు నీరు బయటకు పోవడానికి చిన్న పైపు ఏర్పాటు చేసుకోవాలి. అలా పూర్తయిన తర్వాత కంటెయినర్‌లో పైపులు పూర్తిగా మునిగి ఉంటూ 16 అంగుళాల ఎత్తు వరకు చిన్నపాటి కంకర రాళ్లు పేర్చాలి. ఆ తర్వాత దానిపై గ్రీన్ షెడ్‌నెట్ కప్పేసి.. మట్టితో బెడ్‌ను నింపేయాలి.

మూడు తట్టల మట్టి, ఒక తట్ట మాగిన కోడి పెంట ఎరువు కలిపిన మట్టి మిశ్రమం వాడితే మంచిది. ఈ మట్టి మిశ్రమంలో రాళ్లు, చెక్క ముక్కలు పెంకులు లేకుండా ఏరి పారేయాలి. మట్టి పైన ఎండు గడ్డి పరిచేయాలి. దీనినే మల్చింగ్ లేదా ఆచ్ఛాదన అంటారు. దీని వల్ల నీరు ఆవిరికాకుండా ఉంటుంది. విత్తనాలు, మొక్కలు నాటుకోవడానికి ముందు ఒకసారి నీటితో వికింగ్ బెడ్‌లోని మట్టిని బాగా తడిపితే సరిపోతుంది. ఈ విధంగా వికింగ్ బెడ్‌ను సిద్ధం చేసిన తర్వాత మన ఇంట్లో వాడుకోవడానికి అవసరమైన రకాల ఆకుకూరల విత్తనాలు చల్లవచ్చు. కూరగాయ మొక్కలను నాటుకోవచ్చు. అంతే వికింగ్ బెడ్ సిద్ధమైనట్లే!

అప్పుడప్పుడు పీవీసీ పైపులో నిండుగా నీటిని నింపితే కంటెయినర్ అడుగున రంధ్రాలతో కూడిన పీవీసీ పైపుల నుంచి మట్టి ద్వారా మొక్కల వేళ్లకు తేమ అందుతూ ఉంటుంది. అందువల్ల నీరు వృథా కాదు. అధిక నీటి వినియోగం అనే సమస్య ఉండదు. కరువు లేదా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోనూ ఈ విధంగా కూరగాయలు పెంచుకోవచ్చు. వారానికి ఒకసారి పీవీసీ పైపులో నీటిని నింపితే సరిపోతుంది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల వారికి, ఇంటి పంటలకు ఎక్కువ సమయం కేటాయించలేని వారికి వికింగ్ బ్రెడ్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయనడంలో సందేహం లేదు. వేసవి సమీపిస్తున్న ఈ తరుణంలో వికింగ్ బెడ్స్ ఇంటిపంటల సాగుదారులకు ఉపయోగపడతాయి.

– మల్కార్ రాజేశ్,
సాక్షి, హిందూపుర్, అనంతపురం జిల్లా

### రూ. 3 వేలతో వికింగ్ బెడ్ సిద్ధం

సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను ఎవరికి వారు సులువుగా పండించుకోవడానికి వికింగ్ బెడ్స్ ఉపయోగపడుతాయి. ఒక్కో బెడ్‌కు రూ. 3 వేల వరకు ఖర్చవుతుంది. వీటిని ఎవరికి వారు తయారు చేసుకొని సేంద్రియ ఇంటిపంటలు చేసుకోవచ్చు. భూమి ఉప్పుదేలి మొక్క బతకని పరిస్థితులున్న గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో ప్రజలు వికింగ్ బెడ్స్ ఏర్పాటు చేసుకొని కూరగాయలు, ఆకుకూరలు పండించుకుంటూ చక్కని ఫలితాలు సాధిస్తున్నారు. మనమూ పల్లెల్లో, గ్రామాల్లోనూ వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. మా ప్రాటో విలేజ్‌లో శిక్షణ ఇస్తున్నాం.

– అక్కిపెద్ది కళ్యాణ్, ఇంట్రిగేటర్ ఎకో విలేజ్ వ్యవస్థాపకులు, టేకులోడు, అనంతపురం జిల్లా
kalyanakkipeddi@gmail.com



- 3 అడుగుల లోతున్న కంటెయినర్ (ప్లాస్టిక్ టబ్) సిద్ధం చేసుకోవాలి



- కంటెయినర్ రెండు పక్కలా ఇలా రంధ్రాలు వేసిన ప్లాస్టిక్ పైపులు అమర్చుకోవాలి.



- పైపులు అమర్చే ముందు వాటికి గ్రీన్‌షెడ్ నెట్ చుట్టాలి



- పైపులు ఉంచిన తర్వాత కంటెయినర్‌లో 16 అంగుళాల వరకు కంకర రాళ్లు నింపేయాలి



- రాళ్లపై ఇలా గ్రీన్ షెడ్‌నెట్‌తో కప్పేయాలి



- గ్రీన్ షెడ్ నెట్ నిండుగా మట్టితో నింపాలి



- మట్టిపై నీరు ఆవిరి కాకుండా చూడటానికి ఎండు గడ్డిని ఆచ్ఛాదనగా పరవాలి



- ఇంట్లోకి అవసరమైన ఆకుకూరలు విత్తుకోవచ్చు.. కూరగాయ మొక్కలు నాటుకోవచ్చు



- వికింగ్ బెడ్ సిద్ధమైన తర్వాత ఒక్కసారి నీటిని చల్లితే చాలు. తర్వాత నుంచి అడుగున పైపులో నీటిని మట్టి పీల్చుకుంటుంది.



- పైపులో నీటిని నింపాలి

ఫేస్‌బుక్‌లో sakshi saagubadi గ్రూప్‌ను చూడండి.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

మీ అభిప్రాయాలు, సూచనలను sagubadi@sakshi.com కు పంపవచ్చు.




epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మంగళవారం 18-2-2020

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

# రివిజన్ టైమ్

ఇంటర్మీడియెట్.. విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ! ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఇంటర్‌లో సాధించే మార్కులు.. వారి భవిష్యత్ గమనాన్ని నిర్దేశిస్తాయి. రానున్న రోజుల్లో ఐఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో అడుగుపెట్టేందుకు ఇంటర్ మార్కులు దోహదం చేస్తాయి. బైపీసీ విద్యార్థులు జాతీయ స్థాయిలో నీట్‌లో నెగ్గి.. వైద్య విద్యలో అడుగుపెట్టాలన్నా.. రాష్ట్ర స్థాయిలో అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో మంచి కోర్సులో చేరాలన్నా.. ఇంటర్మీడియెట్ మార్కులు ఎంతో కీలకం! రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ.. ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షల్లో టాప్ స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు...




ఇంటర్మీడియెట్ విద్యార్థులు ప్రస్తుత సమయంలో పునశ్చరణ, ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జేఈఈ మెయిన్, నీట్ వంటి ఇతర పరీక్షలకు పోటీ పడుతున్నప్పటికీ.. ప్రస్తుతం వాటి ప్రిపరేషన్‌కు విరామం ఇవ్వాలి. ఇప్పుడు పూర్తిగా ఇంటర్మీడియెట్ పరీక్షలపైనే దృష్టిపెట్టాలన్నది సబ్జెక్ట్ నిపుణుల సూచన. ఇందుకోసం విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి ముఖ్యమైన చాప్టర్లు, గత ప్రశ్నపత్రాల ఆధారంగా వెయిటేజీ పరంగా ప్రధానమైన టాపిక్స్‌పై ఫోకస్ పెట్టాలి. ప్రస్తుత సమయంలో కొత్త అంశాల జోలికి వెళ్లకుండా.. తమకు బాగా వచ్చిన వాటిపైనే మరింత పట్టు సాధించేలా కృషి చేయాలి. తద్వారా పరీక్షల్లో అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే సామర్థ్యం లభిస్తుంది.



## ఎంపీసీ.. మ్యాథ్స్‌లో గరిష్ట స్కోర్

### మ్యాథమెటిక్స్

✦ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు స్కోరింగ్, సబ్జెక్ట్ నాలెడ్జ్ పరంగా కీలకమైన సబ్జెక్ట్.. మ్యాథమెటిక్స్. మ్యాథమెటిక్స్‌లో–ద్విపద సిద్ధాంతం; సంకీర్ణ సంఖ్యలు, డిమోవర్ సిద్ధాంతం; సాంఖ్యకశాస్త్రం; సంభావ్యత చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి. ద్విపద సిద్ధాంతం పూర్తిగా ప్రాక్టీస్ ఆధారిత చాప్టర్. చాలామంది విద్యార్థులు దీన్ని క్లిష్టమైనదిగా భావిస్తారు. కానీ.. వెయిటేజీ పరంగా చూస్తే ఇది ఎంతో ముఖ్యమైనది. కాబట్టి ఈ పాఠ్యాంశాన్ని ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. సంభావ్యతకు సంబంధించిన రెండు చాప్టర్లు(సంభావ్యత సిద్ధాంతం, గుణకార సిద్ధాంతం; ప్రస్తారాలు, సంయోగాలు) స్కోరింగ్ పరంగా కీలకమైనవి. సంభావ్యత సంకలన సిద్ధాంతం, గుణకార సిద్ధాంతం, ఇచ్చిన పట్టిక నుంచి 'కె'విలువ కనుగొనటం, మధ్యమం, విస్తృతిలను కనుగొనటం వంటివి ముఖ్యం. ఇవి సులభంగా ఉంటాయి. మంచి మార్కుల సాధనకు దోహదం చేస్తాయి. 'ప్రస్తారాలు, సంయోగాలు'ను క్లిష్టమైన చాప్టర్‌గా చెప్పొచ్చు. కాబట్టి పరీక్షలకు ఉపయోగపడేలా కొన్ని కీలక ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకుంటే సరిపోతుంది. ఇచ్చిన పదానికి కోటి(ర్యాంక్) కనుగొనటం, సంఖ్యల మొత్తం తదితరాలకు సంబంధించిన ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

✦ వాస్తవానికి మ్యాథమెటిక్స్‌ను ముఖ్యంగా మ్యాథ్స్ 2బిని విద్యార్థులు క్లిష్టంగా భావిస్తారు. కానీ.. గత రెండు, మూడేళ్ల ఇంటర్ ప్రశ్నపత్రాలను పరిశీలించి.. ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకుంటే.. ఈ పేపర్‌లోనూ ఎక్కువ మార్కులు సాధించొచ్చు. ఇందులో వృత్తాలు; నిశ్చితి; అనిశ్చితి; సమాకలనాలు; అవకలన సమీకరణాలు ముఖ్యమైనవి. అవకలన సమీకరణాల్లో లీనియర్, మోనోజీనిక్ ఫామ్, వానిల్లా సెపరాడో మెథడ్‌లను కీలకమైనవిగా గుర్తించాలి. నిరూపక రేఖా జ్యామితులు, వృత్తాలు, శంఖవాలు సిద్ధాంతపరమైనవి. నిశ్చిత సమాకలనం, అవకలన సమీకరణాల్లో ఫార్ములాను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. మ్యాథ్స్ 2బి పరంగా విద్యార్థులకు కలిసొచ్చే అంశం.. ఇందులో ప్రశ్నలు నేరుగా ఉంటాయి. ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇస్తూ చదవాలి. ఒకే విధంగా ఉండే ఫార్ములాలు, ప్రాసెస్‌ల విషయంలో ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేయాలి. కఠినమైన, అధిక ప్రాధాన్యత ఉన్న సమస్యలను నిరంతరం ప్రాక్టీస్ చేయడం ద్వారా పరీక్షలో ఎలాంటి ప్రశ్న, ఏవిధంగా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. మొదటి సంవత్సరం విద్యార్థులు వెక్టార్ ఆల్జీబ్రా; మాత్రికలు, సరళరేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్స్ అండ్ డెరివేషన్స్‌పై ఎక్కువ సమయం కేటాయించాలి.

– ఎం.ఎస్.రావు, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

### ఫిజిక్స్

ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్‌లో ఉండే మూవింగ్ ఛార్జెస్ అండ్ మ్యాగ్నటిజం; కరెంట్ ఎలక్ట్రిసిటీ; ఆప్టికల్ ఇన్‌స్ట్రుమెంట్స్; పరమాణువు, వేవ్స్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్ వంటి అంశాల్లో పట్టు సాధించేందుకు కృషి చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు రొటేటరీ మోషన్; యూనివర్సల్ గ్రావిటేషన్ లా; ఎస్కేప్ వెలాసిటీ; సింపుల్ హార్మోనిక్ మోషన్; సర్ఫేస్ టెన్షన్, థర్మోడైనమిక్స్ వంటి అంశాలకు అధిక సమయం కేటాయించాలి. ఈ సబ్జెక్ట్‌లోని చాప్టర్లకు లభిస్తున్న వెయిటేజీ కోణంలో వేవ్స్; ఆప్టిక్స్; స్టాటిక్ ఎలక్ట్రిసిటీ; కరెంట్ ఎలక్ట్రిసిటీ; మూవింగ్ ఛార్జెస్ ఇన్ మ్యాగ్నటిజం; ఎలక్ట్రోమాగ్నెటిక్ ఇండక్షన్; డ్యూయల్ నేచర్ ఆఫ్ మేటర్; సెమీ కండక్టర్ డివైజెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఫిజిక్స్‌లో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి. ఇందుకోసం బేసిక్స్, ఫార్ములాలు, కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. సెమీకండక్టర్ డివైజెస్,న్యూక్లియర్ ఫిజిక్స్, ఎలక్ట్రోమ్యాగ్నెటిక్స్ నుంచి దీర్ఘ సమాధాన ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఫిజిక్స్‌కు సంబంధించి విద్యార్థులు ఎలక్ట్రోస్టాటిక్ వేవ్ మోషన్, ఆప్టిక్స్‌ను కఠినమైనవిగా భావిస్తారు. విద్యార్థులు డాప్లర్ ప్రభావం, ఫ్లేమ్స్ ఎడమ, కుడి నియమాలు, అర్ధవాహక పరికరాలు, వేవ్ మోషన్; సెమీ కండక్టర్ ఎలిమెంట్స్; మూవింగ్ ఛార్జెస్–మ్యాగ్నటిజం; విద్యుదయస్కాంత ప్రేరణల గురించి క్షుణ్నంగా చదవడం తప్పనిసరి.

– సి.హెచ్.రామకృష్ణ, ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

### కెమిస్ట్రీ

కెమిస్ట్రీలోని టాపిక్స్ అధిక శాతం కాన్సెప్ట్‌ల ఆధారంగా ఉంటాయి. దీంతో విద్యార్థులు ఈ సబ్జెక్ట్‌ను కొంత క్లిష్టంగా భావిస్తారు. ప్రాక్టీస్‌తో ఈ సమస్యను అధిగమించొచ్చు. ముఖ్యంగా సాలిడ్ స్టేట్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కాంప్లెక్స్ కాంపౌండ్స్ చాప్టర్లను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటిలో నుంచి ఎక్కువగా రీజనింగ్ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత సమయంలో అకాడమీ పుస్తకాలను చదువుతూ... ముఖ్యమైన పాయింట్లను అండర్‌లైన్ చేసుకోవాలి. ముఖ్యాంశాలను నోట్స్ రూపంలో రాసుకొని రివిజన్ చేయాలి. పి–బ్లాక్ ఎలిమెంట్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ; విద్యుత్ రసాయన శాస్త్రం, కెమికల్ కైనటిక్స్‌లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆర్గానిక్,ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీల్లో ప్రతిదాన్నుంచి ఒక దీర్ఘ సమాధాన ప్రశ్న చొప్పున అడుగుతారు. అదే విధంగా పి–బ్లాక్ మూలకాలు, డి,ఎఫ్–బ్లాక్ మూలకాలు, లోహ శాస్త్రం వంటి అంశాలకు ఎక్కువ సమయం కేటాయించాలి. ఆర్గానిక్ కెమిస్ట్రీలోని అన్ని ముఖ్యాంశాలను చదవాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. కర్బన రసాయన శాస్త్రం; ఆవర్తన పట్టిక; పరమాణు నిర్మాణం; రసాయన బంధం అంశాలపై అధికంగా దృష్టిపెట్టాలి. బైపీసీ విద్యార్థులు కెమిస్ట్రీలో.. ఆవర్తన పట్టిక; కర్బన రసాయన శాస్త్రం; రసాయన బంధం; పరమాణు నిర్మాణం అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వీటిలోని సమస్యలను సాధన చేస్తూనే సినాప్సిస్ రూపొందించుకుంటే.. రివిజన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది. ద్వితీయ సంవత్సరంలో పి–బ్లాక్ ఎలిమెంట్స్; ఆర్గానిక్ కెమిస్ట్రీ; విద్యుత్ రసాయన శాస్త్రం; కెమికల్ కైనటిక్స్‌లోని దీర్ఘ సమాధాన ప్రశ్నలు, నాలుగు మార్కుల ప్రశ్నల ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

– విజయ్ కిశోర్, కెమిస్ట్రీ సబ్జెక్ట్ నిపుణులు

## బైపీసీ.. బోటనీ, జువాలజీ కీలకం

బైపీసీ విద్యార్థులు బోటనీ, జువాలజీ సబ్జెక్ట్‌లను విశ్లేషణాత్మక దృక్పథంతో ప్రిపేరవ్వాలి. ముఖ్యంగా అనువర్తిత ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి.

### బోటనీ

బోటనీలో ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్స్ వేయడం ప్రాక్టీస్ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు.. మొక్కల నిర్మాణాత్మక సంవిధానం–స్వరూప శాస్త్రం; జీవ ప్రపంచంలో వైవిధ్యం; కణ నిర్మాణం, విధులు; మొక్కల అంతర్ నిర్మాణ సంవిధానం, మొక్కల్లో ప్రత్యుత్పత్తి యూనిట్లపై ఎక్కువ దృష్టిపెట్టాలి. దీనికి సంబంధించి డయాగ్రమ్స్ వేయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. డైవర్సిటీ ఇన్ ది లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్స్ ఇన్ ప్లాంట్స్(మార్ఫాలజీ), రీ ప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ప్లాంట్ సిస్టమాటిక్స్, సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ఇంటర్నల్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ప్లాంట్స్, ప్లాంట్ ఎకాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, మైక్రోబయాలజీ(బ్యాక్టీరియా,వైరస్), జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీ, బయోటెక్నాలజీ, ప్లాంట్స్, మైక్రోబ్స్ అండ్ హ్యూమన్ వెల్ఫేర్ టాపిక్స్‌పైనా అవగాహన పెంచుకోవాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొక్కల శరీర ధర్మశాస్త్రం; బయోటెక్నాలజీ; మైక్రోబ్స్, అణు జీవశాస్త్రం యూనిట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– బి.రాజేంద్ర, బోటనీ సబ్జెక్ట్ నిపుణులు

### జువాలజీ

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జువాలజీలో మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ, ప్రత్యుత్పత్తి సంబంధిత ఆరోగ్యం; అంతస్రావక వ్యవస్థ, నాడీ నియంత్రణ –సమన్వయం; శరీర ద్రవాలు, ప్రసరణ, విసర్జక పదార్థాలు; జన్యు శాస్త్రాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు.. జంతుదేహ నిర్మాణం; గమనం, ప్రత్యుత్పత్తి; జీవావరణం; పర్యావరణం; బొద్దింక జీవ వ్యవస్థ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలి. ఈ సబ్జెక్ట్‌లో కూడా గ్రాఫికల్ ప్రజంటేషన్ మార్కుల సాధనలో కీలకంగా మారుతుంది. కాబట్టి డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయాలి. జువాలజీ రెండు సంవత్సరాలకు సంబంధించి డైవర్సిటీ ఆఫ్ లివింగ్ వరల్డ్, స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ యానిమల్స్, యానిమల్ డైవర్సిటీ, లోకోమోషన్ అండ్ రీప్రొడక్షన్ ఇన్ ప్రొటోజోవా, బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్, స్టడీ ఆఫ్ పెరిప్లెనేటా అమెరికానా, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ అనాటమీ అండ్ ఫిజియాలజీ, హ్యూమన్ రీప్రొడక్షన్, జెనిటిక్స్, ఆర్గానిక్ ఎవల్యూషన్, అప్లయిడ్ బయాలజీలపై ప్రత్యేక దృష్టితో చదవాలి.

–శ్రీనివాసులు,
జువాలజీ సబ్జెక్ట్ నిపుణులు

## ఇంటర్మీడియెట్ - 2020 పరీక్షల టైమ్ టేబుల్

### ప్రథమ సంవత్సరం

| తేదీ | పరీక్ష పేపర్ |
|---|---|
| 04-03-2020 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1 |
| 06-03-2020 | ఇంగ్లిష్ పేపర్-1 |
| 09-03-2020 | మ్యాథమెటిక్స్ పేపర్ 1-ఎ; బోటనీ పేపర్-1, సివిక్స్ పేపర్-1 |
| 12-03-2020 | మ్యాథమెటిక్స్ పేపర్ 1-బి; జువాలజీ పేపర్-1; హిస్టరీ పేపర్-1 |
| 14-03-2020 | ఫిజిక్స్ పేపర్-1; ఎకనామిక్స్ పేపర్-1 |
| 17-03-2020 | కెమిస్ట్రీ పేపర్-1; కామర్స్ పేపర్-1; సోషియాలజీ పేపర్-1; ఫైన్ ఆర్ట్స్, మూజిక్ పేపర్-1 |
| 19-03-2020 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1; లాజిక్ పేపర్-1; బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్-1 (బైపీసీ విద్యార్థులకు) |
| 21-03-2020 | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1; జాగ్రఫీ పేపర్-1 |

గమనిక: తెలంగాణలో మ్యాథమెటిక్స్ పేపర్-1ఎ, బోటనీ పేపర్-1, సివిక్స్ పేపర్-1, సైకాలజీ పేపర్-1లను మార్చి పదో తేదీన నిర్వహించనున్నారు.

### ద్వితీయ సంవత్సరం

| తేదీ | పరీక్ష పేపర్ |
|---|---|
| 05-03-2020 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2 |
| 07-03-2020 | ఇంగ్లిష్ పేపర్-2 |
| 11-03-2020 | మ్యాథమెటిక్స్ పేపర్ 2-ఎ; బోటనీ పేపర్-2, సివిక్స్ పేపర్-2 |
| 13-03-2020 | మ్యాథమెటిక్స్ పేపర్ 2-బి; జువాలజీ పేపర్-2; హిస్టరీ పేపర్-2 |
| 16-03-2020 | ఫిజిక్స్ పేపర్-2; ఎకనామిక్స్ పేపర్-2 |
| 18-03-2020 | కెమిస్ట్రీ పేపర్-2; కామర్స్ పేపర్-2; సోషియాలజీ పేపర్-2; ఫైన్ ఆర్ట్స్, మూజిక్ పేపర్-2 |
| 20-03-2020 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2; లాజిక్ పేపర్-2; బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్-2 (బైపీసీ విద్యార్థులకు) |
| 23-03-2020 | మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2; జాగ్రఫీ పేపర్-2 |



## కామన్ టిప్స్ ఫర్ ఆల్ సబ్జెక్ట్స్

✦ ప్రస్తుతం ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు 15రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. కాబట్టి విద్యార్థులు ఇప్పుడు పూర్తిగా ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కుల సాధనే లక్ష్యంగా నిర్దేశించుకోవాలి.

✦ ఈ సమయంలో పూర్తిగా ఇంటర్ ప్రిపరేషన్‌కే కేటాయించాలి.

✦ కచ్చితత్వం, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి. గత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

✦ ప్రతి చాప్టర్ అధ్యయనంతోపాటు వాటిలో ప్రాబ్లమ్స్ ఆధారిత ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

✦ ఇప్పటికే తాము చదివిన మెటీరియల్‌తో పాటు తెలుగు అకాడమీ పుస్తకాల్లోని కాన్సెప్ట్‌లను మరోసారి రివిజన్ చేయడం లాభిస్తుంది.

✦ రివిజన్ సమయంలో వ్యాసరూప ప్రశ్నలు, ఉదాహరణలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

✦ ముందుగా సులభంగా ఉండే చాప్టర్లను పూర్తిచేసి.. ఆ తర్వాత క్లిష్టమైన చాప్టర్లకు ఎక్కువ సమయం కేటాయించాలి.

✦ ప్రతి రోజు అన్ని సబ్జెక్ట్‌లను చదివే విధంగా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

✦ కొత్త టాపిక్‌ను చదివే ముందు.. అంతకు ముందు రోజు చదివిన చాప్టర్లను అవలోకనం చేసుకోవడానికి పది నిమిషాలు కేటాయించాలి.

✦ రోజుకు కనీసం ఎనిమిది నుంచి పది గంటలు చదివే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి.

✦ వీక్లీ టెస్ట్‌లు, ప్రీ–ఫైనల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. దీనిద్వారా తమ సామర్థ్య స్థాయి తెలుసుకోవచ్చు.

✦ ఇలా.. ప్రతి సబ్జెక్ట్‌లోని ముఖ్యమైన చాప్టర్లను గుర్తించడం మొదలు.. టైమ్ ప్లానింగ్ వరకు పకడ్బందీగా ప్రిపరేషన్ సాగిస్తే టాప్ స్కోర్ సొంతం చేసుకోవచ్చు.

# ఫుట్‌వేర్ శిక్షణ.. కెరీర్‌కు రక్షణ




జీవితంలో లక్ష్యం ముఖ్యం. కెరీర్ విషయంలో అది మరింత స్పష్టంగా ఉండాలి. ఎంతటి ఉన్నత విద్య చదువుతున్నాం అనేది ముఖ్యం కాదు. మనం చదివిన చదువుకు ఎంత వరకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.. కెరీర్ ఎలా ఉంటుంది.. భవిష్యత్తుకు ఢోకా లేకుండా ఉంటుందా.. లేదా అనే విషయాలే ప్రధానం. అలాంటివే ఫుట్‌వేర్ కోర్సులు. పాదరక్షలు ఆకర్షణీయ డిజైన్‌లతో చిన్నపిల్లలను నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి. వీటిని అవసరాలకు తగ్గట్లు సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించడానికి నైపుణ్యం అవసరం. అలాంటి స్కిల్స్ పెంపొందించుకోవాలనుకునే వారికోసం ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-ఆలిండియా సెలక్షన్ టెస్ట్(ఎఫ్‌డీడీఐ-ఏఐఎస్‌టీ)-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌డీడీఐ-ఏఐఎస్‌టీ పరీక్ష విధానం, అందిస్తున్న కోర్సులు, ఉద్యోగావకాశాలపై సమగ్ర కథనం...

పాదరక్షల తయారీలో మానవ వనరులను తీర్చిదిద్ది ఎక్కువ మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో.. కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 1986లో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)ఏర్పాటైంది. నోయిడాలోని ప్రధాన కేంద్రంతోపాటు హైదరాబాద్, ఫుర్సత్ గంజ్, అంకలేశ్వర్(గుజరాత్), గుణ, చెన్నై, పాట్నా, కోల్‌కతా, రోహ్‌తక్, చింద్వారా, జోద్‌పూర్, చండీగఢ్ సహా దేశవ్యాప్తంగా దాదాపు 12 కేంద్రాలున్నాయి. వీటిలో రిటైల్ మేనేజ్‌మెంట్, ఫుట్‌వేర్ డిజైన్, టెక్నాలజీ, ఫ్యాషన్ మర్చెండైజింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, విజువల్ మర్చెండైజింగ్, మార్కెటింగ్, క్రియేటివ్ డిజైనింగ్, లెదర్ గూడ్స్ డిజైనింగ్ వంటి యూజీ,పీజీ, సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నారు.

### కోర్సుల్లో ఏం నేర్పుతారు?

ఫుట్‌వేర్ కోర్సుల్లో భాగంగా వివిధ ముడి పదార్థాలు, ఉత్పత్తులను ఉపయోగించి పాదరక్షలు ఎలా తయారు చేయాలో నేర్పిస్తారు. యంత్రాల సాయంతో వాటిని డిజైన్ చేసేలా శిక్షణ ఇస్తారు. వినియోగదారుల అవసరాలు, ఆలోచనలపై అవగాహన కల్పిస్తారు. వీటితోపాటు రిటైల్ మేనేజ్‌మెంట్, కన్జ్యూమర్ బిహేవియర్, రిటైల్ కమ్యూనికేషన్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, రిటైల్ ఆపరేషన్, మార్కెటింగ్, బ్రాండ్ మేనేజ్‌మెంట్, సేల్స్ మేనేజ్‌మెంట్, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ వంటివి నేర్పుతారు.

### కోర్సులు.. అర్హతలు

✦ **బ్యాచిలర్ ఆఫ్ డిజైన్:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్, రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్, ఫ్యాషన్ డిజైన్ విభాగాలున్నాయి. వీటి కాలవ్యవధి నాలుగేళ్లు. ఇంటర్ విద్యార్హతతో వీటిలో చేరొచ్చు.

✦ **మాస్టర్ ఆఫ్ డిజైన్:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్. ఫుట్‌వేర్/లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్/ఫ్యాషన్/ఇంజనీరింగ్/ఫైన్‌ఆర్ట్స్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు చదివిన వారు అర్హులు.

✦ **ఎంబీఏ (రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్):** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు చేరొచ్చు.

✦ **మాస్టర్ ఆఫ్ డిజైన్ (క్యాడ్/క్యామ్):** ఫుట్‌వేర్/లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్/ఫ్యాషన్/ఇంజనీరింగ్/ఫైన్‌ఆర్ట్స్/ఆర్కిటెక్చర్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

### జాబ్ ప్రొఫైల్స్

పాదరక్షల పరిశ్రమలో అవకాశాలకు కొదవలేదని చెప్పొచ్చు. టెక్నికల్, డిజైనింగ్, మేనేజ్‌మెంట్ సహా వివిధ విభాగాల్లో నిత్యం నియామకాలు జరుగుతుంటాయి. ఇందులో ముఖ్యంగా ఫుట్‌వేర్ డిజైనర్, ప్రొడక్ట్ డెవలపర్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, క్వాలిటీ కంట్రోలర్, ఫుట్‌వేర్ టెక్నాలజిస్ట్, మెర్చెండైజర్, మార్కెటింగ్, ప్లానింగ్ ఎగ్జిక్యూటివ్, ట్రెండ్ అనలిస్ట్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డిజైన్ మ్యానుఫాక్చరింగ్ ఆపరేషన్స్, స్టోర్ మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, ఏరియా మేనేజర్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సొంతంగా డిజైనింగ్ స్టూడియోలు ప్రారంభించొచ్చు.

**ఎఫ్‌డీడీఐ-ఏఐఎస్‌టీ 2020 నోటిఫికేషన్ విడుదల**

**దరఖాస్తులకు చివరి తేది ఏప్రిల్ 15, 2020**

### నైపుణ్యాలు

ఇది క్రియేటివిటీతో ముడిపడిన కొలువు. ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకునే వారు స్కెచ్ ప్యాటర్న్, స్కేల్ డ్రాయింగ్ లేదా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజైన్లు రూపొందించాల్సి ఉంటుంది. అలాగే నైపుణ్యాలను ఎప్పటికప్పుడు తెలిపేలా పవర్‌పాయింట్ ప్రజంటేషన్స్ కానీ లేదా హ్యాండ్ పెయింట్ ప్రజంటేషన్స్ ఇస్తుండాలి. సేఫ్టీ, కంఫర్ట్, క్వాలిటీ.. ఇలా అన్నీ విషయాల్లో మెరుగైన ప్రొడక్ట్‌ను డిజైన్ చేయాలి. ప్రొడక్షన్ స్టేజ్‌లోనే తయారీకి సంబంధించి డిజైనర్ల జోక్యం ఎక్కువగా ఉంటుంది. ఒకసారి డిజైన్ ఫైనల్ చేశాక మార్పులు చేయడానికి ఆస్కారం ఉండదు. కాబట్టి అన్నీ పక్కాగా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ రంగంలో రాణించేందుకు ప్రధానంగా » క్రియేటివిటీ » కలర్స్, టెక్చర్, ప్యాట్రన్ పట్ల అవగాహన » డ్రాయింగ్, క్యాడ్ స్కిల్స్ » కమ్యూనికేషన్ స్కిల్స్ » ఆసక్తి » వినియోగదారుల అభిరుచులు గుర్తించగలగడం వంటి నైపుణ్యాలు ఉండాలి.

### ఉద్యోగ వేదికలు

సంబంధిత ఫుట్‌వేర్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు.. » అడిడాస్ » ల్యాండ్ మార్క్ » మ్యాక్స్ » రీబక్ » లిబర్టీ » రిలయన్స్ రిటైల్ » వెస్ట్ సైడ్ » ఉడ్‌ల్యాండ్ » బాటా » ఫ్యూచర్ గ్రూప్ » గ్లోబస్ » ఖాదిమ్స్ » లైఫ్ స్టైల్ » ప్యూమా » యాక్షన్ వంటి వాటిల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

### ఎఫ్‌డీడీఐ -ఏఐఎస్‌టీ పరీక్ష విధానం

ఎఫ్‌డీడీఐ–ఏఐఎస్‌టీ పరీక్ష యూజీ, పీజీకి కలిపి నాలుగు సెక్షన్‌లు (సెక్షన్–ఏ, బీ, సీ, డీ) లుగా ఉంటుంది. మొత్తం 200 మార్కులకు జరిగే ఈ పరీక్ష సమయం రెండున్నర గంటలు.

**యూజీ**


| సెక్షన్ | సబ్జెక్ట్ | మార్కులు |
|---|---|---|
| సెక్షన్–ఏ | క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 50 |
| సెక్షన్–బి | వెర్బల్ ఎబిలిటీ | 50 |
| సెక్షన్–సి | జనరల్ అవేర్‌నెస్ | 50 |
| సెక్షన్–డి | బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్(బ్యాట్ | 50 |
| మొత్తం మార్కులు | | 200 |

**పీజీ**

| సెక్షన్ | సబ్జెక్ట్ | మార్కులు |
|---|---|---|
| సెక్షన్–ఏ | క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ | 50 |
| సెక్షన్–బీ | ఇంగ్లిష్ | 50 |
| సెక్షన్–సీ | జీకే అండ్ కరెంట్ అఫైర్ | 50 |
| సెక్షన్–డీ | మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్ | 50 |
| మొత్తం మార్కులు | | 200 |

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తులకు చివరితేది:** ఏప్రిల్ 15, 2020
- **అడ్మిట్ కార్డ్‌ల అందుబాటు:** ఏప్రిల్ 30, 2020
- **పరీక్ష తేదీ:** మే 24, 2020
- **వెబ్‌సైట్:** www.fddiindia.com






# కెయిన్స్ కప్ క్వీన్ హంపి...



తెలుగు తేజం, ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కెరీర్‌లో మరో గొప్ప విజయం చేరింది. గతేడాది డిసెంబర్ చివరి వారంలో ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించిన ఈ భారత నంబర్‌వన్ మహిళా చెస్ స్టార్... తాజాగా అమెరికాలో జరిగిన కెయిన్స్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లోనూ విజేతగా నిలిచింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు క్లాసికల్ ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో 32 ఏళ్ల హంపి ఆరు పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. తాజా ప్రదర్శనతో హంపి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకోనుంది.

**చివరి రౌండ్‌లో హారికతో గేమ్ 'డ్రా' • ఆరు పాయింట్లతో అగ్రస్థానం • రూ. 32 లక్షల ప్రైజ్‌మనీ సొంతం**

**సెయింట్ లూయిస్ (అమెరికా):** రెండు నెలల క్రితం ఎవరూ ఊహించని విధంగా ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌గా అవతరించి కొత్త చరిత్ర సృష్టించిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి... మళ్లీ అద్వితీయ ప్రదర్శనతో అదరగొట్టింది. ఇద్దరు మాజీ ప్రపంచ చాంపియన్స్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా), మరియా ముజిచుక్ (ఉక్రెయిన్), ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జూ వెన్‌జున్ (చైనా), ప్రపంచ బ్లిట్జ్ మాజీ చాంపియన్ కాటరీనా లాగ్నో (రష్యా), మూడుసార్లు యూరోపియన్ చాంపియన్ వాలెంటినా గునీనా (రష్యా)లాంటి అగ్రశ్రేణి క్రీడాకారిణులు బరిలోకి దిగిన కెయిన్స్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో హంపి చాంపియన్‌గా నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ టోర్నీలో హంపి ఆరు పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని అలంకరించింది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో పోటీ పడిన హంపి నల్లపావులతో ఆడుతూ కేవలం 29 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి నాలుగు గేముల్లో గెలిచి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. 5.5 పాయింట్లతో జూ వెన్‌జున్ రన్నరప్‌గా నిలువగా... 5 పాయింట్లతో మరియా ముజిచుక్ మూడో స్థానాన్ని సంపాదించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి హారిక 4.5 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. లక్షా 80 వేల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహించిన ఈ టోర్నీలో పాల్గొన్న పది మందికీ ప్రైజ్‌మనీ ఇచ్చారు. విజేతగా నిలిచిన హంపికి 45 వేల డాలర్లు (రూ. 32 లక్షల 10 వేలు)... రన్నరప్ జూ వెన్‌జున్‌కు 35 వేల డాలర్లు (రూ. 24 లక్షల 97 వేలు)... మూడో స్థానంలో నిలిచిన మరియా ముజిచుక్‌కు 25 వేల డాలర్లు (రూ. 17 లక్షల 83 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. తాజా ఫలితంతో హంపి 2585 ఎలో రేటింగ్ పాయింట్లతో ప్రపంచ లైవ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం నుంచి రెండో స్థానానికి చేరుకుంది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్ 2658 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోఉంది.




> *పలువురు మేటి క్రీడాకారిణులు పాల్గొన్న ఈ టోర్నీలో విజేతగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ టోర్నీ కోసం ప్రత్యేకంగా రెండు వారాలపాటు ప్రాక్టీస్ చేశాను. వివిధ రకాల ఓపెనింగ్స్ సాధన చేశాను. రెండు నెలల క్రితం నేను సాధించిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ గాలివాటంగా వచ్చినదేమీ కాదని తాజా ప్రదర్శనతో నిరూపించాను. కొన్ని రోజులు విశ్రాంతి తర్వాత స్వదేశంలో నా ఉద్యోగ సంస్థ పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు ఇంటర్ యూనిట్ టోర్నమెంట్‌లో పాల్గొంటాను. ఆ తర్వాత మే నెలలో ఇటలీలో జరిగే గ్రాండ్‌ప్రి టోర్నీలో బరిలోకి దిగుతాను. ఈ ఏడాది చివర్లో జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించడమే నా తదుపరి లక్ష్యం.*
>
> –'సాక్షి'తో కోనేరు హంపి

## మిథాలీ, జులన్ లేకపోవడం లోటే: హర్మన్

**యువ క్రికెటర్లతో సత్తా చాటుతాం**



**సిడ్నీ:** భారత టి20 ప్రపంచకప్ జట్టులో బ్యాటింగ్, బౌలింగ్ దిగ్గజాలు మిథాలీ రాజ్, జులన్ గోస్వామిలు లేకపోవడం లోటేనని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. అయితే ప్రతిభావంతులైన యువ క్రీడాకారిణులు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారని 30 ఏళ్ల కెప్టెన్ పేర్కొంది. మిథాలీ, జులన్ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పగా ప్రస్తుత భారత మహిళల జట్టు పూర్తిగా యువ క్రికెటర్లతో ఉంది. ప్రస్తుత జట్టులో అమ్మాయిల సగటు వయసు 22.8 ఏళ్లే! ఇందులో ఒక్క హర్మన్‌ప్రీతే అందరికంటే సీనియర్. ఆస్ట్రేలియాలో ఈ నెల 21న మొదలయ్యే పొట్టి మెగా ఈవెంట్ కోసం సన్నద్ధమయ్యేందుకు హర్మన్ సేన గత నెలలోనే కంగారూ గడ్డపై అడుగుపెట్టింది. సన్నాహకంగా ఇంగ్లండ్, ఆసీస్‌లతో కలిసి ముక్కోణపు టి20 సిరీస్ ఆడింది. ప్రపంచకప్‌కు ముందు మీడియాతో కెప్టెన్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ జట్టు సత్తా, సామర్థ్యంపై తన అభిప్రాయాలను వెల్లడించింది.

**చక్కని కూర్పుతో....**

'ఇప్పటికే మేం ఇద్దరు అనుభవజ్ఞుల సేవల్ని కోల్పోయాం. ఆ లోటు పూడ్చలేనిది. ఇప్పుడు యువ ప్రతిభావంతులపైనే ఆధారపడ్డాం. వీరికి సత్తా చాటే సామర్థ్యం ఉంది. మా సహచరులెవరిలోనూ మేం అంతగా అనుభవం లేని యువ క్రికెటర్లం అనే భావనే లేదు. ఆశించిన స్థాయిలో వారంతా రాణిస్తున్నారు. జట్టు చక్కని కూర్పుతో ఉంది. జట్టుకు అవసరమైన రోజు శక్తికి మించి అదనపు భారం మోసేందుకు, బాధ్యతలు స్వీకరించేందుకు మా అమ్మాయిలు సిద్ధంగా ఉన్నారు. రోజురోజుకీ మా జట్టు బాగా పటిష్టమవుతోంది' అని హర్మన్ వ్యాఖ్యానించింది.

**అప్పటి నిరాశ ఇప్పుడెందుకు...**

'మూడేళ్ల క్రితం 2017 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఎదురైన చేదు అనుభవం ఎప్పుడో మరిచిపోయాం. ఇప్పుడు తాజాగా ఈ టోర్నీని ఆరంభిస్తాం. మా శక్తిమేర మేం రాణిస్తాం. ఒకవేళ టి20 కప్ గెలిస్తే అదే పెద్ద బహుమతి అవుతుంది. ఏదేమైనా ఒత్తిడి లేకుండా ఆడేందుకే ప్రయత్నిస్తాం. సహచరుల్లో కొందరికి ఇక్కడ మహిళల బిగ్‌బాష్ లీగ్ ఆడిన అనుభవం ఉంది. అది ఇప్పుడు అక్కరకొస్తుంది. మేం కప్ కొడితే మాత్రం ఎన్నో మారిపోతాయి. ఒకవేళ మహిళల ఐపీఎల్ అంటూ పెడితే మాకెంతో మేలు జరుగుతుంది' అని వరుసగా ఏడో టి20 ప్రపంచకప్‌లో ఆడనున్న హర్మన్ తెలిపింది.

## బౌల్ట్ వచ్చేశాడు

- న్యూజిలాండ్ టెస్టు జట్టులో స్థానం
- భారత్‌తో జరిగే తొలి టెస్టుకు జట్టును ప్రకటించిన కివీస్

**వెల్లింగ్టన్:** కుడి చేతి గాయంతో భారత్‌తో జరిగిన టి20, వన్డే సిరీస్‌లకు దూరమైన న్యూజిలాండ్ పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ టెస్టు జట్టులోకి వచ్చేశాడు. ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడంతో భారత్‌తో ఈ నెల 21 నుంచి ఆరంభమయ్యే తొలి టెస్టుకు బౌల్ట్ ఎంపికయ్యాడు. కేన్ విలియమ్సన్ సారథిగా 13 మందితో కూడిన జట్టును న్యూజిలాండ్ క్రికెట్ సోమవారం ప్రకటించింది. గత ఏడాది ఆస్ట్రేలియాతో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో గాయపడిన బౌల్ట్ తిరిగి జట్టులోకి రావడంతో కివీస్ బౌలింగ్ విభాగం మరింత పటిష్టంగా మారింది. భారత్‌తో జరిగిన వన్డే సిరీస్ ద్వారా వన్డేల్లో అరంగేట్రం చేసిన 6 అడుగుల 8 అంగుళాల కైల్ జేమీసన్, ఎడంచేతి వాటం స్పిన్నర్ ఎజాజ్ పటేల్‌లు కూడా జట్టులోకి ఎంపికయ్యారు. ఆసీస్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విశేషంగా రాణించిన నీల్ వ్యాగ్నర్‌తో పాటు టిమ్ సౌతీలు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు.



**న్యూజిలాండ్ టెస్టు జట్టు:** కేన్ విలియమ్సన్ (కెప్టెన్), రాస్ టేలర్, వాట్లింగ్, టామ్ బ్లన్‌డెల్, ట్రెంట్ బౌల్ట్, గ్రాండ్‌హోమ్, జేమీసన్, టామ్ లాథమ్, మిచెల్, హెన్రీ నికోల్స్, ఎజాజ్ పటేల్, టిమ్ సౌతీ, నీల్ వ్యాగ్నర్.

## చైనా రెజ్లర్లకు నో ఎంట్రీ


**నేటి నుంచి ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్**




**న్యూఢిల్లీ:** కోవిడ్–19 వైరస్ గుప్పిట విలవిలలాడుతున్న చైనా దేశం రెజ్లర్లకు వీసాలిచ్చేందుకు భారత ప్రభుత్వం నిరాకరించింది. దీంతో నేటి నుంచి ఇక్కడ జరిగే ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో 'డ్రాగన్' రెజ్లర్లు పాల్గొనడం లేదు. దీనిపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సహాయ కార్యదర్శి వినోద్ తోమర్ మాట్లాడుతూ 'ప్రాణాంతక వైరస్ వల్లే 40 మంది సభ్యుల చైనా రెజ్లింగ్ బృందానికి వీసాలు నిరాకరించినట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని మేం అర్థం చేసుకోగలం. ఇక్కడైనా ఎక్కడైనా ఆరోగ్యమే ప్రధానం' అని అన్నారు. దీనిపై అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్య ఎలాంటి చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించగా... 'ఇప్పుడు అలాంటి పరిస్థితే లేదు. సాధారణ సమయంలో అయితే తీసుకుంటుందేమో కానీ ఇప్పుడైతే ప్రపంచాన్నే వణికించే వైరస్ అక్కడ విలయతాండవం చేస్తుంది. కాబట్టి అంతర్జాతీయ రెజ్లింగ్ సమాఖ్యతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు' అని ఆయన బదులిచ్చారు. భారత క్రీడల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ 'మేం ఎవరిపైనా వివక్ష చూపం. అయితే ప్రస్తుత పరిస్థితుల్ని పట్టించుకోకుండా నిర్ణయాలు తీసుకోం' అని అన్నారు. ప్రాణాంతక వైరస్ చైనాలోని ఉత్పాదక, పర్యాటక, సాంకేతిక రంగాలనే కాదు క్రీడారంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే అక్కడ జరగాల్సిన మహిళల ఒలింపిక్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ ఈవెంట్, ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, ఫార్ములావన్ గ్రాండ్‌ప్రి, ఆసియా–ఓసియానియా ఒలింపిక్స్ బాక్సింగ్ క్వాలిఫయర్స్ టోర్నీల్లో కొన్ని రద్దు కాగా... మరికొన్నేమో వేరేచోటికి తరలివెళ్లాయి. చైనాలోని వుహాన్‌లో పుట్టుకొచ్చిన ఈ వైరస్ వల్ల ఇప్పటికే 1500 మందికి పైగా మృత్యువాత పడగా వేలమంది కోవిడ్–19 వైరస్ బారిన పడ్డారు.

## భారత్‌లో 2021 జూనియర్ హాకీ ప్రపంచకప్

**లుసానే:** జూనియర్ పురుషుల హాకీ ప్రపంచ కప్‌ను మరోసారి నిర్వహించే అవకాశం భారత్‌కు లభించింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 2021 జూనియర్ ప్రపంచ కప్ ఆతిథ్య హక్కులను భారత్‌కు కట్టబెడుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. దాంతో భారత్ రెండోసారి ప్రపంచ కప్‌ను నిర్వహిస్తోన్న దేశంగా ఘనతకెక్కింది. 2016లో తొలిసారి లక్నో వేదికగా ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించిన భారత్ విజేతగా నిలిచింది. మొత్తం 16 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటుండగా... ఇప్పటికే జర్మనీ, ఇంగ్లండ్, నెదర్లాండ్స్, స్పెయిన్, బెల్జియం, ఫ్రాన్స్‌లు అర్హత సాధించాయి. హోస్ట్ హోదాలో భారత్ కూడా ఈ టోర్నీలో ఆడటం ఖాయమైంది. అయితే ఈ మెగా ఈవెంట్ భారత్‌లో ఎక్కడ, ఎప్పుడు ఆరంభమవుతుందనే వివరాలను ఎఫ్ఐహెచ్ ప్రకటించాల్సి ఉంది.




## మార్చి తొలి వారంలో బీసీసీఐ సెలక్టర్ల ఎంపిక

**న్యూఢిల్లీ:** బీసీసీఐ సెలక్షన్ కమిటీలో ఏర్పడిన రెండు ఖాళీలను ప్రస్తుతం జరుగుతోన్న భారత్–న్యూజిలాండ్ సిరీస్ ముగిసేలోపు భర్తీ చేస్తామని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) సభ్యుడు మదన్‌లాల్ తెలిపారు. సెలక్టర్ల పదవి కోసం మొత్తం 44 మంది దరఖాస్తు చేసుకున్నారు. సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్, ప్యానెల్ సభ్యుడు గగన్ ఖోడాల పదవీ కాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసే బాధ్యతను బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ సీఏసీకి అప్పగించారు.

## సైనా, శ్రీకాంత్‌లకు సవాల్

**నేటి నుంచి బార్సిలోనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ**

**బార్సిలోనా (స్పెయిన్):** ఈ ఏడాది జరిగే టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌ల కోసం పోరాడుతున్న భారత షట్లర్లు సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్‌లు మరో టోర్నీకి సిద్ధమయ్యారు. నేటి నుంచి ఆరంభమయ్యే ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) బార్సిలోనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత ఏడాది తీవ్రంగా నిరాశ పరిచిన వీరిద్దరూ... 2020 సీజన్‌ను కూడా వరుస వైఫల్యాలతో ఆరంభించారు. సైనా నెహ్వాల్ ఈ ఏడాది ఆడిన మూడు టోర్నీల్లో ఒక్కసారి మాత్రమే తొలి రౌండ్ అడ్డంకిని దాటగా... శ్రీకాంత్ ఆడిన మూడు టోర్నీల్లోనూ తొలి రౌండ్‌లోనే ఓడాడు. ప్రస్తుతం ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్స్‌లో సైనా 22వ స్థానంలో ఉండగా... శ్రీకాంత్ 26వ స్థానంలో ఉన్నాడు. అయితే క్వాలిఫయింగ్ గడువు ఏప్రిల్‌తో ముగియనుండటంతో... వీరిద్దరూ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలంటే గడువు తేదీ నాటికి టాప్–16లో చేరాల్సిన అవసరం ఉంది. దాంతో ఈ టోర్నీతో పాటు తర్వాత జరిగే మరో ఆరు టోర్నీలలో సైనా, శ్రీకాంత్‌లు మెరుగైన ప్రదర్శన చేసి తమ ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకోవాల్సి ఉంది. మహిళల విభాగంలో జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌లో వైన్నె లీ (జర్మనీ)తో ఐదో సీడ్ సైనా; పురుషుల తొలి రౌండ్ మ్యాచ్‌లో శుభాంకర్ డే (భారత్)తో శ్రీకాంత్ తలపడతారు. రెండో సీడ్‌గా బరిలో దిగాల్సిన ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయిప్రణీత్ చివరి నిమిషంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగాడు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మిషా జిల్బెర్మ్యాన్ (ఇజ్రాయిల్)తో సౌరభ్ వర్మ (భారత్); వైగోర్ కొయెల్హో (బ్రెజిల్)తో పారుపల్లి కశ్యప్ (భారత్); లియూ డారెన్ (మలేసియా)తో హెచ్ఎస్ ప్రణయ్ ఆడతారు.



**ప్రిక్వార్టర్స్‌లో సిక్కి రెడ్డి జంట**

మహిళల డబుల్స్ విభాగంలో నేలకుర్తి సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప (భారత్) జంట ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. తొలి రౌండ్‌లో ఈ జోడీతో తలపడాల్సిన చెన్ లు–జు యా (చైనా) ద్వయం ఈ టోర్నీ నుంచి వైదొలగడంతో భారత జోడీకి వాకోవర్ లభించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మథియాస్ క్రిస్టియన్సన్–అలెగ్జాండ్రా బోయె (డెన్మార్క్) జోడీతో సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా (భారత్) జంట; పురుషుల డబుల్స్‌లో బెన్ లేన్–సీన్ వెండీ (ఇంగ్లండ్) జోడీతో ప్రణవ్ చోప్రా–కృష్ణ ప్రసాద్ గారగ (భారత్) ద్వయం తలపడతాయి.

## ఈ సారథ్యం నాకొద్దు!



- దక్షిణాఫ్రికా టెస్టు, టి20 జట్ల కెప్టెన్సీకి డు ప్లెసిస్ రాజీనామా
- జట్టులో సభ్యునిగా కొనసాగుతానని ప్రకటన

**జొహన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా సీనియర్ బ్యాట్స్‌మన్ ఫాఫ్ డు ప్లెసిస్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. తమ జట్టుకు ఇప్పుడు కొత్త తరం నాయకత్వం అత్యవసరమని వ్యాఖ్యానిస్తూ టెస్టు, టి20 జట్ల సారథ్యానికి బైబై చెప్పాడు. ఇంతకుముందు ఇంగ్లండ్‌తో సిరీస్ సమయంలో వన్డే జట్టు నాయకత్వం నుంచి డు ప్లెసిస్ తప్పుకోవడంతో వికెట్ కీపర్ డికాక్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడు మిగిలిన రెండు ఫార్మాట్లకు కూడా అతను పగ్గాలు వదిలేశాడు. 'ఇది కఠినమైన నిర్ణయం. కానీ... కొత్త తరానికి స్వాగతం పలుకుతున్నా. ఎప్పటిలాగే జట్టుకు పూర్తి నిబద్ధతతో సేవలందిస్తాను. కెప్టెన్ డికాక్, కోచ్ మార్క్ బౌచర్‌లకు పూర్తిగా సహకరిస్తాను. సఫారీ జట్టు పునర్నిర్మాణానికి, జట్టు పటిష్టంగా ఎదిగేందుకు ఆటగాడిగా నా వంతు కృషి చేస్తాను' అని 35 ఏళ్ల డుప్లెసిస్ తెలిపాడు. 'మిస్టర్ 360' డిగ్రీ బ్యాట్స్‌మన్ డివిలియర్స్ వారసుడిగా 2017 ఆగస్టులో దక్షిణాఫ్రికా పగ్గాలు చేపట్టిన డు ప్లెసిస్‌కు 2019 వన్డే ప్రపంచకప్ పెద్ద గాయమే చేసింది. ఆ మెగా టోర్నీలో సఫారీ జట్టు పేలవ ప్రదర్శనతో గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. త్వరలోనే దక్షిణాఫ్రికా జట్టు ఆసీస్‌తో మూడు టి20లు, మరో మూడు వన్డేల సిరీస్‌ల్లో తలపడనుంది. శుక్రవారం ఇరు జట్ల మధ్య తొలి టి20 జరుగనుంది.



సాక్షి బిజినెస్
మంగళవారం 18-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 202 ▼ | 68 ▼ |
| 41,056 | 12,046 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ (శుక్రవారం ముగింపు) | 9,731 | ▲ 19 |
| డోజోన్స్ (శుక్రవారం ముగింపు) | 29,398 | ▼ 25 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,433 | ▲ 24 |
| డాక్స్ | 13,784 | ▲ 39 |
| షాంఘై | 2,984 | ▲ 67 |
| నికాయ్ | 23,523 | ▼ 164 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.70 | 72.34 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.70 | 94.91 |
| యూరో | ఎస్‌బీఐ | 76.11 | 78.96 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.93 | 66.34 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.09 | 49.23 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.57 | 52.34 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.23 | 19.83 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.95 | 20.16 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.59 | 10.85 |

# బాకీలు చెల్లిస్తున్న టెల్కోలు

**పాక్షికంగా కట్టిన ఎయిర్‌టెల్, వొడా, టాటా**

- డాట్ లెక్కలపై వివాదం; కంపెనీల స్వీయ మదింపు
- బ్యాంకులపై ప్రభావాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఐ



**న్యూఢిల్లీ:** ఏజీఆర్ బాకీలకు సంబంధించి సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో టెలికం సంస్థలు చెల్లింపులు ప్రారంభించాయి. సోమవారం భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, టాటా టెలీసర్వీసెస్ కొంత మొత్తాన్ని కట్టాయి. టెలికం శాఖకు (డాట్) ఎయిర్‌టెల్ రూ. 10,000 కోట్లు, టాటా గ్రూప్ రూ.2,197 కోట్లు చెల్లించాయి. 'భారతి ఎయిర్‌టెల్, భారతి హెక్సాకామ్, టెలినార్‌ల తరపున రూ.10,000 కోట్లు చెల్లించాం. మిగతా బాకీలపై స్వీయ మదింపు చేపట్టాం. సుప్రీం కోర్టులో తదుపరి విచారణ తేదీలోగా దీన్ని కట్టేస్తాం' అని ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ.9,500 కోట్లు భారతి ఎయిర్‌టెల్‌కి సంబంధించినవి కాగా రూ.500 కోట్లు భారతి హెక్సాకామ్‌కు చెందినవి. మరోవైపు, టాటా టెలీ, టాటా టెలీ (మహారాష్ట్ర) తరపున మొత్తం బాకీల కింద రూ.2,197 కోట్లు కట్టేశామని, వీటికి సంబంధించిన లెక్కల వివరాలను కూడా డాట్‌కు అందజేశామని టాటా టెలీసర్వీసెస్ తెలిపింది. సోమవారం రూ.2,500 కోట్లు కట్టిన వొడాఫోన్ ఐడియా.. శుక్రవారం నాటికి మరో రూ.1,000 కోట్లు కడతామంటూ సుప్రీం కోర్టుకు విన్నవించింది. అప్పటిదాకా డాట్ ఎటువంటి చర్యలు తీసుకోకుండా సూచనలివ్వాలని కోరింది. అయితే, సుప్రీం కోర్టు దీన్ని తోసిపుచ్చింది. బ్యాంక్ గ్యారంటీల స్వాధీనం సహా బాకీల వసూలుకు అన్ని చర్యలూ తీసుకునేందుకు డాట్‌కు వెసులుబాటునిచ్చింది.

డాట్ గణాంకాలను బట్టి సవరించిన స్థూల ఆదాయ (ఏజీఆర్) లెక్కల ప్రకారం టెల్కోల నుంచి లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల బాకీల కింద సుమారు రూ.1.47 లక్షల కోట్లు వసూలు కావాలి. ఎయిర్‌టెల్ సుమారు రూ. 35,586 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ. 53,000 కోట్లు, టాటా టెలీసర్వీసెస్ సుమారు రూ.13,800 కోట్లు చెల్లించాలి. ఈ ఏడాది జనవరి 23లోగా వీటిని కట్టేయాలంటూ గతేడాది ఆదేశించినా.. అమలు కాకపోవడంపై ఇటీవల సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో కంపెనీలు, డాట్ కదిలాయి. దీనిపై మార్చి 17న సుప్రీం కోర్టు తదుపరి విచారణ జరపనుంది.

**బ్యాంక్ గ్యారంటీలపై డాట్ దృష్టి..**

బాకీలను పూర్తిగా వసూలు చేసుకునే క్రమంలో.. టెల్కోలిచ్చిన బ్యాంక్ గ్యారంటీలను స్వాధీనం చేసుకునే అవకాశాలను డాట్ పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ అంశంపై డాట్ అధికారులు మంగళవారం సమావేశమై, నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించాయి. ఒకవేళ బ్యాంక్ గ్యారంటీలను నిజంగానే స్వాధీనం చేసుకుంటే... నిధులు సమీకరించుకునేందుకు నానా తంటాలు పడుతున్న వొడాఫోన్ ఐడియా వంటి సంస్థలు మూతబడక తప్పకపోవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడ్డాయి. రెండు త్రైమాసికాల లైసెన్సు ఫీజులు, ఇతర బకాయిలకు సరిపడే స్థాయిలో ఈ బ్యాంక్ గ్యారంటీ ఉంటుంది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాకు సంబంధించి ఇది సుమారు రూ.5,000 కోట్ల మేర ఉంటుంది. డాట్ లెక్కలను టెల్కోలు ప్రశ్నించాయి. తమ సొంత మదింపు ప్రకారమే కడతామంటూ సూచనప్రాయంగా వెల్లడించాయి. ఈ మొత్తం వివాద ప్రభావం బ్యాంకులపై ఎలా ఉండవచ్చన్న అంశాన్ని రిజర్వ్ బ్యాంక్ పరిశీలిస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఒక ఇంటర్వ్యూ సందర్భంగా తెలిపారు.

### ఆ ఉత్తర్వులు.. నాన్–టెల్కోలకు కాదేమో: ధర్మేంద్ర ప్రధాన్



నాన్ టెలికామ్ ఆదాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని కంపెనీలు ఏజీఆర్ బాకీలు కట్టాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలు.. టెలికంయేతర ప్రభుత్వ రంగ సంస్థలకు వర్తించకపోవచ్చని కేంద్ర చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభిప్రాయపడ్డారు. సమాచార లోపం వల్లే చమురు కంపెనీలకు కూడా డాట్ నోటీసులిచ్చి ఉంటుందని, న్యాయనిపుణుల సలహాలు తీసుకున్నాక తమ అభిప్రాయం తెలియజేశామని చెప్పారు. నోటీసులు అందుకున్న కంపెనీలకు టెలికం కార్యకలాపాలు ప్రధాన వ్యాపారం కాదన్నారు. స్పెక్ట్రం వాడుకున్నందుకు గాను గెయిల్, ఆయిల్ ఇండియా, పవర్‌గ్రిడ్ వంటి టెలికంయేతర కంపెనీలు కూడా రూ.2.7 లక్షల కోట్లు కట్టాలంటూ డాట్ నోటీసులివ్వటం తెలిసిందే.

### ద్రవ్య లోటు తగ్గుతుంది: ఆర్థికవేత్తల అంచనా

టెలికం సంస్థలు రూ.1.20 లక్షల కోట్ల బాకీలు కట్టిన పక్షంలో 2019–20 ఆర్థిక సంవత్సరంలో.. సవరించిన గణాంకాల కన్నా ద్రవ్య లోటు తగ్గగలదని ఆర్థికవేత్తలు తెలిపారు. స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) ఇది 3.5 శాతానికి పరిమితం కాగలదని ఎస్‌బీఐ ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. సవరించిన గణాంకాల ప్రకారం ఇది 3.8 శాతం స్థాయిలో ఉండొచ్చని గతంలో అంచనా వేశారు. 'టెల్కోలు బాకీలు కట్టేందుకు గడువైన మార్చి 16 తర్వాత ద్రవ్య లోటు పరిస్థితి గణనీయంగా మారిపోతుంది. ఏజీఆర్ బాకీలు కనీసం రూ.1.20 కోట్లు వసూలైనా.. ప్రస్తుత 2019–20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు.. జీడీపీలో 3.5 శాతానికి దిగి రావొచ్చు' అని ఎస్‌బీఐ ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. మరోవైపు, వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రజలు మళ్లీ కాలుష్యకారక పాత ప్రత్యామ్నాయాల వైపు మళ్లుతున్నారని తెలిపారు. గ్యాస్ సిలిండర్ అందుబాటు ధరల్లో అందించడం ద్వారా ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించవచ్చని ఆర్థిక వేత్తలు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో 'ఇమేజ్' సెంటర్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** గేమింగ్, వీఎఫ్‌ఎక్స్, కంప్యూటర్ విజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల కోసం భారత్‌లో తొలి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. 'ఇమేజ్' పేరుతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) దీనిని నెలకొల్పింది. ఈ రంగాల్లో మేధో సంపత్తిపై దృష్టిసారించిన కంపెనీలకు ఇది తొలి ఇంక్యుబేషన్ సెంటర్ కావడం విశేషం. ఎస్‌టీపీఐ ఫెసిలిటీలో 10,000 చదరపు అడుగుల్లో దీనిని ఏర్పాటు చేశారు. ఏటా 25–30 స్టార్టప్స్‌కు ఇక్కడ అవకాశం కల్పిస్తామని ఎస్‌టీపీఐ డీజీ ఓంకార్ రాయ్ తెలిపారు. అయిదేళ్ల కాలానికి గాను రూ.19.68 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా 28 ఎక్సలెన్స్ కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించామని, ఇప్పటికే ఏడు అందుబాటులోకి వచ్చాయని, మిగిలిన 21 సెంటర్లు పలు దశల్లో ఉన్నాయని వివరించారు. ఇమేజ్ కేంద్రంలో చోటు కోసం మార్చి 31లోగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన దరఖాస్తుదారులకు రూ.5 లక్షల సీడ్ ఫండ్ ఇస్తారు. స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు తెలంగాణ వీఎఫ్‌ఎక్స్, యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్, హైదరాబాద్ ఏంజిల్స్, హైసియా, ఐఐఐటీ హైదరాబాద్, టై హైదరాబాద్‌తో ఇమేజ్ కేంద్రం అవగాహన ఒప్పందం చేసుకుంది. కాగా, ఎస్‌టీపీఐ నుంచి ఎగుమతులు 2018–19లో రూ.4,24,000 కోట్లు నమోదైంది. 2019–20లో 10 శాతం వృద్ధి ఆశిస్తున్నట్టు ఓంకార్ రాయ్ తెలిపారు.

## ఓయో నష్టాలు 335 మిలియన్ డాలర్లు

**న్యూఢిల్లీ:** ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ కన్సాలిడేటెడ్ నష్టాలు మరింత అధికమయ్యాయి. 2019 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 335 మిలియన్ డాలర్ల (రూ.2,390 కోట్లు) నష్టాలను ప్రకటించింది. 2018 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి నష్టాలు రూ.52 మిలియన్ డాలర్లుగానే (రూ.370 కోట్లు) ఉండడం గమనార్హం. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఉన్న 211 మిలియన్ డాలర్ల నుంచి 951 మిలియన్ డాలర్లకు పెరిగింది. అంతర్జాతీయంగా కార్యకలాపాల విస్తరణ నష్టాలు పెరగడానికి కారణమైంది. దేశీయ కార్యకలాపాలపై నష్టాలను మొత్తం ఆదాయంలో 24 శాతం నుంచి 12 శాతానికి సంస్థ తగ్గించుకుంది.

## ఎయిరిండియా డిజిన్వెస్ట్‌మెంట్ ఈ సారి సాఫీగా

**విమానయాన శాఖ మంత్రి భరోసా**



**న్యూఢిల్లీ:** ఎయిరిండియా వాటా విక్రయం ఈ సారి సాఫీగా జరిగిపోనున్నదని విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ధీమా వ్యక్తం చేశారు. సంస్థను కొనేందుకు సత్తా గల కంపెనీలు మరింత ఆసక్తిగా ఉన్నాయని చెప్పారాయన. అందుకని ఎయిర్ ఇండియా వాటా విక్రయం విషయంలో ఈసారి ఎలాంటి సమస్యలు తలెత్తబోవన్నారు. భవిష్యత్తులో కూడా ఒక బ్రాండ్‌గా ఎయిరిండియా కొనసాగాలన్నదే ప్రభుత్వ అభిమతమన్నారు. ''సంస్థ ఉద్యోగుల ప్రయోజనాలు పరిరక్షిస్తాం. కొన్నేళ్లుగా ఎలాంటి రిక్రూట్‌మెంట్లూ లేవు కనక మిగులు సిబ్బంది అనే సమస్య ఉండదు'' అని చెప్పారాయన.

**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**

- 12000 మద్దతు కోల్పోతే కరెక్షన్!
- ఏడాది కోసం టాప్ సిఫార్సులు
- ఎయిర్‌టెల్‌లో ఎఫ్అండ్ఓ వ్యూహం!
- మిధానీ షేరు.. రెండేళ్లలో 3 రెట్లు

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

## జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ చేతికి జీఎంఆర్ కమళంగ ఎనర్జీ

**డీల్ విలువ రూ.5,321 కోట్లు**



**న్యూఢిల్లీ:** జీఎమ్‌ఆర్ ఎనర్జీకి చెందిన ఒడిషాలోని 1,050 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ కొనుగోలు చేయనుంది. డీల్ విలువ రూ.5,321 కోట్లు. ఒడిశాలోని ఈ ప్లాంట్‌ను నిర్వహించే జీఎమ్‌ఆర్ ఎనర్జీకి చెందిన జీఎమ్‌ఆర్ కమళంగ ఎనర్జీ లిమిటెడ్‌లో వంద శాతం వాటాను కొనుగోలు చేయడానికి షేర్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తెలిపింది. ఈ ప్లాంట్ కొనుగోలుతో తమ మొత్తం స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 5,609 మెగావాట్లకు చేరుతుందని పేర్కొంది. ఈ ప్లాంట్ కొనుగోలుతో దేశపు తూర్పు ప్రాంతంలోకి విస్తరిస్తామని వివరించింది. కాగా ఈ కొనుగోలుకు వివిధ సంస్థల ఆమోదాలు పొందాల్సి ఉంది. ఈ ప్లాంట్ టేకోవర్ పూర్తయితే, జేఎస్‌డబ్ల్యూకి వంద శాతం అనుబంధ సంస్థగా జీఎమ్‌ఆర్ కమళంగ ఎనర్జీ లిమిటెడ్(జీకేఈఎల్) మారుతుంది.

## నోయిడాలో మైక్రోసాఫ్ట్ ఇంజినీరింగ్ హబ్



**న్యూఢిల్లీ:** టెక్నాలజీ రంగ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. భారత్‌లో తన మూడవ అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. నోయిడాలో ఇంజినీరింగ్, ఇన్నోవేషన్ హబ్‌ను సోమవారం ప్రారంభించింది. ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో ఇటువంటి కేంద్రాలను ఏర్పాటుచేసిన సంస్థ.. తాజాగా 'ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడీసీ)–ఎన్‌సీఆర్'ను ఆరంభించింది. మైక్రోసాఫ్ట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రీసెర్చ్ గ్రూప్, క్లౌడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్ గ్రూప్, ఎక్స్‌పీరియన్స్ అండ్ డివైసెస్‌తో పాటు కోర్ సర్వీసెస్ ఇంజినీరింగ్ అండ్ ఆపరేషన్స్ ఇక్కడ కొనసాగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

# కార్వీ తరహా మోసాలకు చెక్



- చర్యలు తీసుకుంటామన్న సెబీ చైర్మన్ అజయ్ త్యాగి
- సంతృప్తికరంగా పదవీ కాలం
- ఫండ్ స్కీమ్‌ల పునఃవర్గీకరణ..!
- ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల అర్హతలు మరింత కఠినం

**ముంబై:** భవిష్యత్తులో కార్వీ తరహా మోసాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ చీఫ్ అజయ్ త్యాగి చెప్పారు. క్లయింట్లకు సంబంధించి రూ.2,000 కోట్ల మేర విలువైన సెక్యూరిటీలను దుర్వినియోగం చేసిన విషయమై కార్వీ బ్రోకింగ్ సర్వీసెస్‌పై పెద్ద దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ నెల 14 నాటికి కార్వీ సంస్థ చెల్లించాల్సిన బకాయిలు రూ.1,189 కోట్లుగా ఉన్నాయని త్యాగి పేర్కొన్నారు. ఈ విషయమై కార్వీకి నోటీసులు జారీ చేశామని వివరించారు. తమ కంపెనీల్లో ఒకదాంట్లో వాటా విక్రయ ప్రయత్నాలు చేస్తున్నామని, అది పూర్తవ్వగానే ఈ బకాయిలను చెల్లిస్తామని, మార్చి కల్లా అన్ని బకాయిలను చెల్లిస్తామని కార్వీ వెల్లడించిందని వివరించారు. ఇక ఏం జరుగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు.

సోమవారం జరిగిన సెబీ బోర్డ్ సమావేశ వివరాలను ఆయన వెల్లడించారు. 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సెబీ బోర్డ్ ఆమోదించింది.

**సంతృప్తికరంగానే...**

ఈ నెలలోనే సెబీ చైర్మన్‌గా అజయ్ త్యాగి మూడేళ్ల పదవీకాలం పూర్తవుతుంది. తన హయాంలో పారదర్శకంగా, సంప్రదింపుల పద్ధతిలోనే సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించామని, అధికారం చెలాయించడానికి ప్రయత్నించలేదని అజయ్ త్యాగి పేర్కొన్నారు. తన హయాం సంతృప్తికరంగానే గడిచిందని తెలిపారు. సోమవారం జరిగిన సెబీ బోర్డ్ కీలక నిర్ణయాలు ఇవీ...,

- కంపెనీల్లో చైర్మన్, ఎమ్‌డీ పోస్ట్‌ల విభజన విషయంలో పలు ఆచరణాత్మక, పరిపాలనా పరమైన సమస్యలున్నాయి. అందుకే ఈ పోస్ట్‌ల విభజనకు గడువును మరో రెండేళ్లు (2020, ఏప్రిల్ వరకూ) పొడిగించారు.
- స్మాల్, మిడ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్‌ల పునః వర్గీకరణపై మరింత కసరత్తు జరుగుతోంది. త్వరలోనే మార్గదర్శకాలను వెల్లడించనున్నది.
- ఇన్వెస్టర్ల ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం మదుపు సలహాదారుల(ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల) అర్హతలను మరింత కఠినతరం చేయనున్నది. ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసే ఫీజులపై గరిష్ట పరిమితిని నిర్దేశించనున్నది.


## 2020లో భారత్ వృద్ధి 5.4 శాతమే..: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధి 2020 అంచనాలకు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ– మూడీస్ కోత పెట్టింది. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు కేవలం 5.4 శాతమే ఉంటుందని పేర్కొంది. ఇంతక్రితం 2019 నవంబర్‌లో వేసిన అంచనా ప్రకారం ఈ రేటు 6.6%. ఆర్థిక రికవరీ అంచనాలకన్నా నెమ్మదిగా ఉందని తన తాజా అవుట్‌లుక్‌లో పేర్కొంది. ఇక 2021లో భారత్ ఆర్థిక వృద్ధి రేటు అంచనాలకూ మూడీస్ కోత పెట్టింది. ఈ రేటును 6.7% నుంచి 6.6 శాతానికి కుదించింది. క్యాలెండర్ ఇయర్ ప్రాతిపదకన వేసిన ఈ అంచనాల ప్రకారం– 2019లో భారత్ జీడీపీ వృద్ధి రేటు 5%. అంతర్జాతీయ అంశాలకన్నా దేశీయ అంశాలే భారత్ వృద్ధిపై కొంత అధిక ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అవుట్‌లుక్ పేర్కొంది. దేశీయ డిమాండ్ పెంపు, బ్యాంకింగ్ మందగమనం వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఆర్థిక వృద్ధి మెరుగుపడ్డానికి ఈ అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఆర్థిక ఉద్దీపనలకు 2020 బడ్జెట్ పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదని వివరించింది.

# త్వరలోనే ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ!

- ఈ నెల చివర్లో... లేదా మార్చి మొదట్లో ఆఫర్...
- ఇష్యూ సైజు రూ.6,000 కోట్లపైనే
- ముకేశ్ ట్రెండ్స్ ఐపీఓకు సెబీ ఓకే



**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) క్రెడిట్ కార్డ్ విభాగం, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ ఐపీఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఈ నెల చివరి వారంలో గానీ, వచ్చే నెల మొదట్లో గానీ ఉండొచ్చని సమాచారం. ఈ ఐపీఓకు ఇటీవలనే మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ ఆమోదం తెలిపింది. ఈ ఐపీఓలో రూ.500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. వీటితో పాటు 13.05 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయిస్తారు. దీంట్లో ఎస్‌బీఐ 3.7 కోట్లు, కార్లైల్ గ్రూప్ 9.32 కోట్ల షేర్లను విక్రయిస్తాయి. ఈ ఐపీఓ సైజు రూ.6,000 కోట్లకు మించి ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

**జీఎమ్‌పీ రూ.296–298 రేంజ్‌లో**

ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, డీఎస్‌పీ మెరిల్ లించ్, నొముర ఫైనాన్షియల్ అడ్వయిజరీ, హెచ్‌ఎస్‌బీసీ సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ వ్యవహరిస్తున్నాయి. భారత్‌లో అత్యధికంగా క్రెడిట్ కార్డ్‌లు జారీ చేస్తున్న రెండో అతి పెద్ద కంపెనీ ఇదే. 18 శాతం మార్కెట్ వాటా ఈ కంపెనీదే. ఐపీఓ ఇష్యూ ధర రూ.690–750 రేంజ్‌లో ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్రే మార్కెట్ ప్రీమియమ్(జీఎమ్‌పీ) రూ.296–298గా ఉందని సమాచారం.

**ముకేశ్ ట్రెండ్స్ ఐపీఓకు సెబీ ఓకే...**

ఎస్‌బీఐ కార్డ్స్‌తో పాటు ముకేశ్ ట్రెండ్స్ లైఫ్‌స్టైల్ ఐపీఓకు కూడా సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా ఈ కంపెనీ కోటి వరకూ ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. ఈ ఐపీఓ సూజు రూ.70–90 కోట్ల రేంజ్‌లో ఉండొచ్చని అంచనా.

# రూ.300 కోట్లతో బీఈ కొత్త ప్లాంటు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ రంగ సంస్థ బయాలాజికల్–ఇ (బీఈ) లిమిటెడ్ హైదరాబాద్ సమీపంలోని శామీర్‌పేట వద్ద ఉన్న జీనోమ్ వ్యాలీ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లో కొత్త ప్లాంటును ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కె.తారక రామారావు ఈ కేంద్రాన్ని సోమవారమిక్కడ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ రూపొందించిన టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్‌ను ఆయన ఆవిష్కరించారు. 2017 బయో ఆసియా కార్యక్రమం సందర్భంగా ఈ ప్లాంటుకు పునాది రాయి వేశామని.. 2020 బయో ఆసియాలో ప్రారంభోత్సవం జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. కాగా, 29 ఎకరాల విస్తీర్ణంలోని ఈ తయారీ కేంద్రానికి బీఈ సుమారు రూ.300 కోట్లు వెచ్చించింది. కొత్త ఫెసిలిటీ ద్వారా 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సంస్థ ఎండీ మహిమ దాట్ల వెల్లడించారు. టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్‌ను ఇటలీకి చెందిన జీఎస్‌కే వ్యాక్సిన్స్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా, తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు.

**సింజీన్ ఆర్అండ్‌డీ కూడా..**

కాంట్రాక్ట్ రీసెర్చ్ సేవల్లో ఉన్న సింజీన్ ఇంటర్నేషనల్ జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన కొత్త పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని కూడా కేటీఆర్ ప్రారంభించారు. తొలి దశలో 52,000 చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చింది. 2020 చివరికల్లా 94,000 చ.అ. విస్తీర్ణంలో సిద్ధం కానున్న ఈ సెంటర్‌కు రూ.167 కోట్లు వెచ్చిస్తున్నట్టు సింజీన్ సీఈవో జోనాథన్ హంట్ వెల్లడించారు. సైంటిస్టుల సంఖ్య ప్రస్తుతమున్న 150 నుంచి 270కి చేరనుంది.



బీఈ కొత్త ప్లాంటు ప్రారంభోత్సవంలో కేటీఆర్ తదితరులు

# ఫాలో ఆన్ ఇష్యూకి ఐఓబీ

**రెండు, లేదా మూడో క్వార్టర్లో : ఈడీ అజయ్ శ్రీవాస్తవ**




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు (ఐఓబీ) వచ్చే ఆర్థిక సంవత్సరం ఫాలో ఆన్ ఇష్యూకు (ఎఫ్‌పీవో) రానుంది. ఈ నిర్ణయం ఇంకా బోర్డ్ పరిధిలోనే ఉందని, అది పూర్తయ్యాక.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), సెబీ అనుమతుల కోసం వెళతామని.. కచ్చితంగా 2020–21 ఆర్థిక సంవత్సరం రెండు లేదా మూడో త్రైమాసికంలో ఎఫ్‌పీవోకి రావాలని నిర్ణయించామని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు అజయ్ కుమార్ శ్రీవాస్తవ చెప్పారు. అయితే ఎఫ్‌పీఓ ద్వారా ఎంత వాటాను కేటాయించాలి? ఎన్ని నిధులు సమీకరించాలి? అనేది బోర్డ్ నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సోమవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**50 వేల కోట్లకు ఎంఎస్‌ఎంఈ రుణాలు..**

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లుగా ఐఓబీ ఆథరైజ్డ్ క్యాపిటల్‌ను రూ.25 వేల కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. దీంతో పాటు బ్యాంక్‌లకు మూలధన పునరుద్ధరణలో భాగంగా ఐఓబీకి రూ.4,360 కోట్లు క్యాపిటల్‌ను కేటాయించింది కూడా. ప్రస్తుతం ఐఓబీ నికర వడ్డీ మార్జిన్స్‌ను (ఎన్ఐఎం) మెరుగుపర్చుకునే స్థితిలో ఉందని.. ప్రస్తుతం 1.94 శాతంగా ఉన్న ఎన్ఐఎం ఈ త్రైమాసికంలో 2 శాతానికి చేరుతుందని.. 3–4 త్రైమాసికాల్లో 3 శాతానికి చేరడం ఖాయమని శ్రీవాస్తవ ధీమా వ్యక్తం చేశారు. ఎంఎస్‌ఎంఈ రుణాల మీద ప్రత్యేక దృష్టి సారించామని.. ప్రస్తుతం రూ.31 వేల కోట్లుగా ఉన్న ఎంఎస్‌ఎంఈ రుణ వ్యాపారం.. వచ్చే 18–24 నెలల్లో రూ.50 వేల కోట్లకు చేరుతుందని తెలిపారు.



## నిజామాబాద్‌లో మలబార్ గోల్డ్ షోరూం



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిజామాబాద్ పట్టణంలో తన నూతన షోరూంను సోమవారం ప్రారంభించింది. సినీ నటి తమన్న చేతుల మీదుగా షోరూం ఆరంభమైంది. తక్కువ బరువుతో ఆకర్షణీయంగా ఉండే ఫ్యాషనబుల్, ఫ్యూజన్, ట్రెడిషనల్ ఆభరణాలను 'మైన్' పేరిట అందిస్తుండగా.. 'ఎరా' పేరిట కళాత్మకంగా ఉండే అన్–కట్ డైమండ్స్‌ను ఇక్కడ అందిస్తున్నట్లు గ్రూప్ చైర్మన్ ఎం.పీ అహ్మద్ అన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ కింద ప్రతి రూ.15వేల కొనుగోలుపై ఒక బంగారు నాణాన్ని ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,740 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,750 |
| వెండి (కిలో) | 50,200 |
| **హైదరాబాద్/చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,970 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,020 |
| వెండి (కిలో) | 50,200 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,020 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,080 |
| వెండి (కిలో) | 47,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,190 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,020 |
| వెండి (కిలో) | 47,700 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 18-2-2020

| | |
|---|---|
| విశాఖ | 417–00 |
| చిత్తూరు | 433–00 |
| వరంగల్ | 388–00 |
| విజయవాడ | 398–00 |
| గోదావరి | 398–00 |
| 17–2–2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 385–00 |

# మూడీస్ నష్టాలు

- వృద్ధి అంచనాల్లో మూడీస్ కోత
- కోవిడ్ –19 వైరస్ భయాలు
- మూడో రోజూ వరసగా నష్టాలు
- 202 పాయింట్లు క్షీణించి 41,056కు సెన్సెక్స్
- 68 పాయింట్లు పతనమై 12,046కు నిఫ్టీ



మూడీస్ సంస్థ వృద్ధి అంచనాల్లో కోత విధించడం, కోవిడ్–19 (కరోనా) వైరస్ విస్తృతి మరింతగా పెరుగుతుండటంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్, నిఫ్టీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. ఏజీఆర్(సవరించిన స్థూల రాబడి) బకాయిల విషయంలో టెలికం కంపెనీలకు ఊరట లభించకపోవడంతో ఈ కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంక్ షేర్లు పతనం కావడం కూడా ప్రతికూల ప్రభావం చూపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 202 పాయింట్లు పతనమై 41,056 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 68 పాయింట్లు నష్టపోయి 12,046 పాయింట్ల వద్ద ముగిశాయి.

**పెరుగుతున్న కోవిడ్ విలయం...**

చైనాలో కోవిడ్ వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య సోమవారానికి 1,800కు చేరగా, ఈ వైరస్ సోకిన వారి సంఖ్య 70,000కు చేరింది. మరోవైపు ఇతర దేశాలకు కూడా ఈ వైరస్ విస్తరిస్తోంది. ఇక ఈ ఏడాది భారత వృద్ధి అంచనాలను మూడీస్ రేటింగ్ సంస్థ 6.6 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గించడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. భారత్‌లో ఆర్థిక రికవరీ అంచనాల కంటే తక్కువగానే ఉందన్న కారణంగా వృద్ధి అంచనాలను మూడీస్ సంస్థ తగ్గించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి.

**389 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్**

సెన్సెక్స్ లాభాల్లోనే మొదలైంది. అరగంటలోపే నష్టాల్లోకి జారిపోయింది. మధ్యాహ్నం వరకూ లాభ, నష్టాల మధ్య పరిమితి శ్రేణిలో కదలాడింది. ఆ తర్వాత నష్టాలు కొనసాగాయి. ఆరంభంలో 162 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, ఆ తర్వాత 227 పాయింట్లు నష్టపోయింది. రోజంతా 389 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

**ఐదేళ్ల కనిష్టానికి ఐదు పీఎస్‌బీ బ్యాంక్‌లు**

ఏజీఆర్ బకాయిల చెల్లింపుల్లో విఫలమైతే, టెలికం కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంక్‌ల మొండి బకాయిలు పెరిగిపోయి, ఆ బ్యాంక్‌ల రుణ నాణ్యత దెబ్బతినగలదన్న ఆందోళనతో బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, అలహాబాద్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు ఐదేళ్ల కనిష్టానికి పడిపోయాయి.

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 1,731 |
| ఎన్ఎస్ఈ | 33,456 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 10,76,069 |
| ఎఫ్ఐఐ | -379 |
| డీఐఐ | -154 |

### టెలికం షేర్లకు ఏజీఆర్ కష్టాలు...

ఏజీఆర్ బకాయిల విషయమై టెలికం కంపెనీలకు ఊరట లభించకపోవడంతో ఆ షేర్లు నష్టాల్లో ముగిశాయి. వొడాఫోన్ ఐడియా షేరుఇంట్రాడేలోఈ షేర్ 19 శాతం లాభంతో రూ.3.78 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. ఏజీఆర్ బకాయిలను సోమవారం రూ.2,500 కోట్లు, శుక్రవారం రూ.1,000 కోట్లు చొప్పున చెల్లిస్తామన్న ఈ కంపెనీ అభ్యర్థనను సుప్రీం కోర్ట్ తోసిపుచ్చింది. దీంతో ఈ షేర్ చివరకు 0.5 శాతం నష్టంతో రూ.3.42 వద్ద ముగిసింది. రూ.10,000 కోట్ల చెల్లింపులు జరిపిన భారతీ ఎయిర్‌టెల్ షేర్ ఇంట్రడేలో ఆల్‌టైమ్ హై, రూ.569ను తాకింది. చివరకు 0.02 శాతం నష్టంతో రూ.565 వద్దకు చేరింది. ఎంటీఎన్ఎల్ షేర్ 8.1 శాతం నష్టంతో రూ.9.35 వద్ద ముగిసింది.

- ఈ క్యూ3లో నికర లాభం సగానికి తగ్గడంతో ఓఎన్‌జీసీ షేర్ 3.2 శాతం నష్టంతో రూ.100 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. ఈ షేర్‌తో పాటు ఐటీసీ, ఇండస్ఇండ్ బ్యాంక్ తదితర 230 షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. మరోవైపు 300కు పైగా షేర్లు లోయర్ సర్క్యూట్లను తాకాయి.

## ఐటెల్ నుంచి బడ్జెట్ ఫోన్ విజన్-1




న్యూఢిల్లీ: ట్రాన్సియాన్ ఇండియా ఐటెల్ బ్రాండ్‌పై విజన్–1 స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేసింది. 6.088 అంగుళాల హెచ్‌డీ ప్లస్ వాటర్‌డ్రాప్ నాచ్ డిస్‌ప్లేతో కూడిన ఈ ఫోన్‌ధర రూ.5,499. ఫోన్‌తో పాటు రూ.799 విలువ చేసే ఐటెల్ బ్లూటూత్ హెడ్‌సెట్ కూడా ఉచితంగా లభిస్తుంది. దీనికి అదనంగా ఇన్‌స్టంట్‌గా రూ.2,000 వరకు క్యాష్ బ్యాక్, 25జీబీ జియో డేటా ఆఫర్లు ఉన్నట్టు కంపెనీ తెలిపింది. 2.5డీ కర్వ్‌డ్ లామినెటెడ్ డిస్‌ప్లే, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఏఐ డ్యుయల్ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్, ఫేస్ అన్‌లాక్, 1.6 గిగాహెర్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 2జీబీ ర్యామ్, 32జీబీ స్టోరేజీ సామర్థ్యాలున్నాయి. గ్రాడేషన్ బ్లూ, పర్పుల్ రంగుల్లో లభిస్తుంది.

## 25,000 కోట్ల ఎల్‌టీఆర్‌ఓకు రూ.1.94 లక్షల కోట్ల బిడ్లు...

ముంబై: బ్యాంకింగ్ వ్యవస్థలో మరిన్ని నిధులు లభ్యమయ్యే కీలక చర్యలకు ఆర్‌బీఐ సోమవారం శ్రీకారం చుట్టింది. మూడేళ్ల కాలవ్యవధికి సంబంధించి రూ.25,000 కోట్ల దీర్ఘకాలిక రెపో ఆపరేషన్స్ (ఎల్‌టీఆర్‌ఓ)ను ప్రారంభించింది. ఈ మొత్తానికి రూ.1.94 లక్షల కోట్ల బిడ్స్ వచ్చినట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఏడాది కాలానికి సంబంధించి రూ.25,000 కోట్ల దీర్ఘకాలిక రెపో ఆపరేషన్ ఈ నెల 24న ఆర్‌బీఐ నిర్వహించనుంది. దీనివల్ల బ్యాంకింగ్‌కు అదనపు నిధులు అందుబాటులోకి వస్తాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో వడ్డీరేటు మరింత తగ్గడానికి ఈ చర్యలు దోహదపడతాయి. నిజానికి రెపో ఆపరేషన్స్ స్వల్ప కాలానికి ఇంకా చెప్పాలంటే ఓవర్‌నైట్ కార్యకలాపాలకు ఉద్దేశించి జరుగుతోంది. అంటే తమ వద్ద ఉన్న బాండ్లను ఆర్‌బీఐ వద్ద ఉంచి (రీపర్చేజింగ్ అవగాహన మేరకు) స్వల్ప కాలానికి రుణాలను పొందుతాయి. ఇలా బ్యాంకులు పొందిన నిధులపై ఆర్‌బీఐ వడ్డీనీ వసూలు చేస్తుంది. దీనినే రెపో రేటు అని అంటారు. ప్రస్తుతం ఈ రేటు 5.15 శాతంగా ఉంది. అంటే రెపో ఆపరేషన్స్‌కు బిడ్స్‌వేసే బ్యాంకులు 5.15 శాతంకన్నా తక్కువ వడ్డీకి డబ్బు ఇవ్వమని అడగరాదన్నమాట.

## ఎన్‌సీఎల్‌ఏటీలో పూర్తి న్యాయం జరగలేదు!

**సుప్రీంకోర్టులో సైరస్ మిస్త్రీ క్రాస్ అప్పీల్**



ముంబై: నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) డిసెంబర్ 18న తనకు అనుకూలంగా రూలింగ్ ఇచ్చినా, తన పిటిషన్‌లోని ఎన్నో అంశాలను పట్టించుకోలేదని, తనకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని పేర్కొంటూ సైరెస్ మిస్త్రీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన వివాదానికి సంబంధించి అత్యున్నత న్యాయస్థానంలో క్రాస్ అప్పీల్ వేశారు. మిస్త్రీని టాటా సన్స్ చైర్మన్‌గా తిరిగి నియమించాలంటూ ఎన్‌సీఎల్ఏటీ ఇచ్చిన రూలింగ్‌పై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిన నెలలోపు మిస్త్రీ కూడా తాజాగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం గమనార్హం. ఎన్‌సీఎల్ఏటీ నుంచి తమ కుటుంబం మరింత న్యాయాన్ని కోరుతోందని మిస్త్రీ తన తాజా అప్పీల్‌లో పేర్కొన్నారు. టాటా సన్స్‌లో మిస్త్రీ కుటుంబానికి 18.37% వాటా ఉంది. టాటా సన్స్‌తో తమ గ్రూప్‌కు 60 సంవత్సరాలుగా పరస్పర విశ్వాస పూర్వక సంబంధం ఉందని మిస్త్రీ పేర్కొన్నారు.

**మైనారిటీ షేర్ హోల్డర్ల ప్రయోజనాలు ఎక్కడ?**

ప్రస్తుతం దాదాపు 100 బిలియన్ డాలర్ల టాటా సన్స్‌లో తమ వాటా విలువ 1.5 లక్షల కోట్ల డాలర్లుగా పేర్కొన్న మిస్త్రీ... మైనారిటీ షేర్‌హోల్డర్ల ప్రయోజనాలను పరిరక్షించడానికి సంబంధించిన తమ వాదనలను ఎన్‌సీఎల్ఏటీ పరిగణనలోకి తీసుకోలేదని పిటీషన్‌లో పేర్కొన్నారు. అలాగే టాటా సన్స్‌ను ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చడానికి సంబంధించిన అంశంపైనా తగిన న్యాయం జరగలేదన్నారు. ''నాకు టాటా సన్స్‌లో ఎగ్జిక్యూటివ్ పొజిషన్ చేపట్టాలన్న ఉత్సాహం ఏదీ లేదు. కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాణాల పరిరక్షణే నా ధ్యేయం. కానీ ఈ దిశలో ఎన్‌సీఎల్ఏటీలో నాకు తగిన న్యాయం దక్కలేదు'' అని ఈ నెల 14న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన 45 పేజీల పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ వాటాకు తగిన విధంగా టాటా సన్స్ బోర్డ్‌లో దామాషా ప్రాతినిధ్యం ఇవ్వకుండా మైనారిటీ షేర్ హోల్డర్ల ప్రయోజనాలను అణచివేసేలా ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌లో (ఏఓఏ) కొన్ని నిబంధనలు పెట్టారని, వాటిని కొట్టివేయడంపై తమకింకా న్యాయం జరగాల్సి ఉందని వివరించారు.

## వెలుగురేఖలు కనబడుతున్నాయ్... కొనసాగాలి!

- భారత్ ఆర్థిక వ్యవస్థపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్
- ప్రభుత్వం నుంచి సంస్కరణలు కొనసాగాలని ఆకాంక్ష



న్యూఢిల్లీ: పదకొండు సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత మందగమన ధోరణిని ఎదుర్కొంటున్న భారత్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు కొంత పుంజుకుంటున్న దాఖలాలు కనిపిస్తున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. అయితే ఈ పరిస్థితి మరింత పటిష్టం కావాల్సి ఉందని అన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి వ్యవస్థాగత సంస్కరణలు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవస్థలో డిమాండ్ పునరుద్ధరణకు వ్యవస్థాగత సంస్కరణల కొనసాగింపు అవసరమని అన్నారు. ఈ మేరకు ఆయన ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యాంశాలను చూస్తే...

- తీవ్ర ఆందోళన సృష్టిస్తున్న చైనా కోవిడ్–19 (కరోనా) వైరస్‌ను పరిణామాలను ప్రతి ''విధాన నిర్ణేత'' జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది. తగిన తక్షణ చర్యలు తీసుకోడానికి ఇది అవసరం. అతి పెద్ద రెండవ ఆర్థిక వ్యవస్థలో వైరెస్ సంక్షోభ ప్రభావం ప్రపంచ వృద్ధిపై ప్రతికూలత చూపుతుంది.
- తాజా 2020–21 బడ్జెట్ ప్రతిపాదనలు, అలాగే కార్పొరేట్ పన్నుకోతసహా ఇటీవల కేంద్రం తీసుకున్న మరికొన్ని కీలక చర్యలు డిమాండ్, వినియోగం పునరుద్ధరణ దిశలో తగిన సానుకూల పరిస్థితులను సృష్టించాయి. అయితే మరిన్ని వ్యవస్థాగత చర్యలూ అవసరం. భూ, కార్మిక వ్యవహారాలకు సంబంధించి సంస్కరణలు, వ్యవసాయ మార్కెటింగ్ పటిష్టత, మానవ వనరుల విషయంలో నైపుణ్యత పెంపు వంటి అంశాలను ఇక్కడ ప్రస్తావించుకోవాలి.
- 2019 మొదట్లోనే మందగమన ఛాయలను ఆర్‌బీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో ధరల కట్టడి పరిస్థితిని అదనుగా తీసుకుని బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను వరుసగా ఐదుసార్లు తగ్గించింది.
- అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితి పరిస్థితులు, దేశీయంగా డిమాండ్ మందగించడం, బ్యాంకింగ్ మొండి బకాయిల తీవ్రత ,కార్పొరేట్ రుణ భారాలు వంటి అంశాలు భారత్ ఆర్థిక వ్యవస్థలో మందగమనానికి ప్రధాన కారణాలు. అయితే ఇప్పుడు కొన్ని సానుకూల అంశాలు కనిపిస్తున్నాయి. ఆయా అంశాల ధోరణి ఎలా ఉండబోతోందన్న విషయం వేచిచూడాల్సి ఉంది.

### భారత్...ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ

2019లో బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించి భారత్ ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని యూఎస్‌కు చెందిన విశ్లేషణా సంస్థ వరల్డ్ పాపులేషన్ రివ్యూ నివేదిక ఒకటి తెలిపింది. భారత్ జీడీపీ విలువను 2.94 ట్రిలియన్ డాలర్లుగా లెక్కగట్టింది. బ్రిటన్ ఎకానమీ పరిమాణాన్ని 2.83 ట్రిలియన్ డాలర్లుగా, ఫ్రాన్స్‌కు సంబంధించి ఈ విలువను 2.71 ట్రిలియన్ డాలర్లుగా పేర్కొంది.

**రాష్ట్రీయం**



సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ గీతారెడ్డి

## 4న యాదగిరీశుడి కల్యాణం

**గవర్నర్, ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఈఓ, అర్చకులు**

యాదగిరిగుట్ట: ఈ నెల 26వ తేదీనుంచి ప్రారంభమయ్యే యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 4వ తేదీన నిర్వహించే శ్రీస్వామి అమ్మవార్ల తిరుకల్యాణ వేడుకకు రావాలని కోరుతూ సోమవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆలయ ఈఓ గీతారెడ్డి, ప్రధాన అర్చకుడు నల్లంధీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి శ్రీస్వామి అమ్మవార్ల లడ్డూ ప్రసాదం అందజేశారు.

## ఆరో రోజు ఆదాయం 1.05 కోట్లు

హన్మకొండ కల్చరల్: మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతర హుండీల లెక్కింపులో ఆరోరోజు రూ.1,05,50,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేందర్ తెలిపారు. హన్మకొండ లష్కర్ బజార్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో సోమవారం 78 హుండీలోని కానుకలను లెక్కించారు. దీంతో మొత్తం 454 ఐరన్ హుండీలకుగాను ఇప్పటి వరకు 419 హుండీల లెక్కింపు పూర్తికాగా ఆరోరోజు ఆదాయంతో కలుపుకొని మొత్తం రూ. 9.,81 కోట్లు నమోదైనట్లు ఈఓ పేర్కొన్నారు.

## లక్ష్మీబ్యారేజీ వద్ద మహారాష్ట్ర ఎమ్మెల్యే ధర్నా

మహదేవపూర్: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీ బ్యారేజీలో నీటిని నిల్వ చేయడం వల్ల ఇప్పటికే బ్యాక్ వాటర్ కారణంగా మహారాష్ట్రలోని పోచంపల్లి, హరుడ, మద్దికుంట తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. దీంతో ఆ రాష్ట్ర అహేరి ఎమ్మెల్యే ధర్మారావు బాబా సోమవారం బ్యారేజీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా కాల్వలు నిర్మించక ముందే నీటిని నిల్వ చేయడంతో బ్యాక్ వాటర్ వల్ల రైతులకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. రైతులు 100 ఎకరాల మేరకు పంటలు నష్టపోయారని, ఎకరానికి రూ.50 లక్షల వరకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# సీసీ రోడ్లకు రూ.500 కోట్ల నిధులు

- డంప్‌యార్డులు, వైకుంఠ ధామాల బిల్లులకు ప్రతినెలా రూ. 61 కోట్లు
- నాలుగు నెలల్లో సింగూరుకు కాళేశ్వరం జలాలు
- బాగా పనిచేసే సర్పంచ్‌లకు సన్మానం
- పంచాయతీరాజ్ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సంగారెడ్డి: గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు వేసేందుకు రూ.500 కోట్లు కేటాయిస్తామని ఆర్థిక మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన 'పల్లె ప్రగతి– పంచాయతీరాజ్ సమ్మేళనం'లో మాట్లాడారు. డంప్‌యార్డులు, వైకుంఠ ధామాల నిర్మాణం పూర్తిచేసిన గ్రామాలలో బిల్లుల చెల్లింపులకుగాను మెటీరియల్ కాంపోండ్ కింద రూ.61 కోట్లు ఇక నుంచి ప్రతినెలా విడుదల చేస్తామని చెప్పారు. ఈ నిధులు ప్రతి నెలా పల్లెలకు అందుతున్న రూ.339 కోట్లకు అదనమని వివరించారు. మరో నాలుగు నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సింగూరుకు నీటిని తరలిస్తామని, దానితో మంచినీటికి కొరత ఎప్పటికీ ఉండదన్నారు. బాగా పని చేసిన సర్పంచ్‌లు, అధికారులను జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున సన్మానిస్తామని తెలిపారు. ఈనెల 26 తరువాత సీఎంతోపాటుగా మంత్రులు, ఉన్నతాధికారులు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బిల్లులపై సంతకాలు పెట్టడానికి సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉపసర్పంచ్‌లపై చర్యలుంటాయని హెచ్చరించారు.

**85 శాతం మొక్కలు బతకాల్సిందే..**

హరితహారం పథకం కింద గ్రామాల్లో నాటిన మొక్కల్లో తప్పనిసరిగా 85 శాతం బతికించాలని మంత్రి తెలిపారు. లేకపోతే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..పల్లె ప్రగతి తోపాటు త్వరలో పట్టణ ప్రగతి కూడా ప్రారంభమవుతోందని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేటలో మొక్కలు నాటుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో పార్టీ నాయకులు

### సీఎం పుట్టినరోజు లక్ష మొక్కల కానుక


సాక్షి సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ 66వ జన్మదినం సందర్భంగా సోమవారం సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 'లక్ష మొక్కల కానుక'తో ప్రజాప్రతినిధులు సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. లక్షా పదివేల మొక్కలు నాటి వినూత్నంగా సీఎం కేసీఆర్‌కు బర్త్‌డే గిఫ్ట్ అందించారు. వారం రోజులుగా మంత్రి హరీశ్‌రావు దగ్గరుండి మొక్కలు నాటే ప్రణాళికను రూపొందించారు. అందుకు అనుగుణంగానే సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా, పట్టణాల్లో రోడ్లకు ఇరువైపున మొక్కలు నాటారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల విద్యార్థులు కూడా ఇందులో పాల్గొన్నారు. సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు.

- కేసీఆర్ జన్మదిన వేడుకల్లో భాగంగా తమ శాఖల ఆధ్వర్యంలో లక్ష మొక్కలను నాటి సీఎంకు బహుమానంగా ఇస్తున్నామని మంత్రి సత్యవతి తెలిపారు.




## డ్రోన్ల సాయంతో విత్తనాలు

**పైలట్ ప్రాజెక్టుగా వీర్నపల్లి ఎంపిక**



ఎల్లారెడ్డిపేట: హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్ల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టింది. ఇందుకోసం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. మారుత్ డ్రోన్స్ ఆధ్వర్యంలో సోమవారం వీర్నపల్లి పరిధి రాశిగుట్ట అటవీ ప్రాంతంలో డ్రోన్ల సాయంతో విత్తన బంతులు జార విడిచారు. తొలిరోజు 15 వేల విత్తన బంతులు జార విడిచామని జెడ్పీటీసీ గుగులోతు కళావతి తెలిపారు. విత్తన బంతులు పడిన ప్రాంతాలను జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించనున్నట్లు డ్రోన్స్ నిర్వహణ సీఈవో ప్రేమ్‌కుమార్ ఇస్లావత్ తెలిపారు.

## 'మిడ్‌మానేరు' బాగుంది

**మెగసెసె అవార్డు గ్రహీత రాజేందర్ సింగ్ ప్రశంస**



ప్రాజెక్టు వద్ద రాజేందర్‌సింగ్ బృందం

బోయినపల్లి: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద గల శ్రీ రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టును సోమవారం వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత రాజేందర్ సింగ్ బృందం సందర్శించింది. ప్రాజెక్టు కట్ట పరిసరాలు, ప్రాజెక్టు నుంచి లోయర్ మిడ్‌మానేరుకు విడుదల అవుతున్న జలాలను చూశారు. సాగునీటి రంగలో మిడ్‌మానేరు అందించే సేవలపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో నిండుకుండలా ఉన్న నీరు చూసి ఆనందం వ్యక్తం చేశారు. సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట జలవనరుల బోర్డు ప్రతినిధి ప్రకాశ్, మిడ్‌మానేరు ఇంజనీర్లు అంజయ్య తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వ జీవోలపై రహస్యమెందుకు?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వం జీవోలను విడుదల చేసిన వెంటనే వెబ్‌సైట్‌లో ఎందుకు ఉంచడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. జీవోలన్నీ ప్రజల కోసమే జారీ అవుతాయని, అలాంటి జీవోలను రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. జీవోలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని 2019 సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేస్తే ఇప్పటివరకూ ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనికి సంబంధించి ఈ నెల 28లోగా కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. జీవోలను వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.శేఖర్‌రావు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. పిటిషనర్ న్యాయవాది వాదిస్తూ.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అయ్యాక 2014 జూన్ 2 నుంచి 2019 ఆగస్టు వరకూ 1,04,171 జీవోలు జారీ అయ్యాయని, వాటిలో 42,462 జీవోలను వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చెప్పారు. ప్రభుత్వ గోప్యానికి సంబంధించిన జీవోలను రహస్యంగా ఉంచవచ్చని, అయితే 42 వేల జీవోలను ఎందుకు వెబ్‌సైట్‌లో పొందుపర్చడం లేదో తేల్చాలన్నారు.



# సీఏఏతో నష్టమేంటో చెప్పాలి

### సీఏఏ చట్టంపై సీఎం కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి సవాల్

**హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేస్తానన్న సీఎం కేసీఆర్ ఆ చట్టం వల్ల ముస్లింలకు ఎలాంటి నష్టం జరుగుతుందో వివరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ చేశారు. సోమవారం యూసుఫ్‌గూడ సవేరా ఫంక్షన్ హాల్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. భారతదేశ సమగ్రతకు, దేశ అభ్యున్నతికి, ముస్లిం సోదరులకు అండగా నిలుస్తూ చట్టాలు చేస్తున్న ప్రధాని మోదీని అభినందించడం పోయి ఇలా విమర్శిస్తూ, తీర్మానాలు చేయడం సిగ్గుచేటన్నారు. మోదీ హయాంలోనే ఆర్టికల్ 370 రద్దు, రామమందిర వివాదాలు పరిష్కారమయ్యాయని, దేశంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారని అన్నారు. అసత్య ప్రచారాలతో సీఏఏ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న కేసీఆర్ మాటలు ఎవ్వరూ నమ్మవద్దని సూచించారు.



# సీఏఏకు వ్యతిరేక నిర్ణయం చారిత్రాత్మకం

### ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అభివర్ణించారు. తెలంగాణ మంత్రివర్గ తీర్మానాన్ని స్వాగతించారు. కేరళ మాదిరిగా జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)పై స్టే విధించాలని ఆయన సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తిచేశారు. సోమవారం హైదరాబాద్ దారుస్సలాంలో మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఎన్‌పీఆర్‌పై కూడా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌పీఆర్‌కు జనాభా గణన, సాంఘిక సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని, ఇది భవిష్యత్తులో నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్‌ఆర్‌సీ) చేపట్టడానికి చేసే ప్రక్రియ అని తెలిపారు.



# డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికలకు కసరత్తు

### 20న నోటిఫికేషన్, 28, 29 తేదీల్లో ఎన్నికలు

**సాక్షి, హైదరాబాద్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికలు ముగియడంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఎన్నికల నిర్వహణపై సహకార శాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా డీసీసీబీ, డీసీఎంఎస్ ఓటర్ల జాబితాను రూపొందించడంపై జిల్లా సహకార అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సోమవారం ఈ మేరకు జిల్లా సహకార అధికారులతో సహకార శాఖ కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఓటర్ల జాబితా రూపకల్పనకు అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేసినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్‌ల ఎన్నికలకు ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేసి, 28, 29 తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి డీసీసీబీలో 20 మంది డైరెక్టర్లు, డీసీఎంఎస్‌లో 10 మంది డైరెక్టర్లను ఆయా జిల్లాల్లోని ప్యాక్స్ చైర్మన్లు ఎన్నుకుంటారు. టెస్కాబ్ చైర్మన్ ఎన్నిక కోసం వచ్చే నెల 3న నోటిఫికేషన్ జారీ చేసి 5న ఎన్నిక నిర్వహిస్తారు.

# 'ఇంటర్నల్ మార్కులు అప్‌లోడ్ చేయండి'

**సాక్షి, హైదరాబాద్:** మార్చిలో పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థుల (రెగ్యులర్) ఇంటర్నల్ మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ.సత్యనారాయణరెడ్డి డీఈవోలను ఆదేశించారు. ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఎస్ఎస్‌సీ వొకేషనల్ విద్యార్థులకు సంబంధించిన ఇంటర్నల్ (ఫార్మేటివ్ అసెస్‌మెంట్–ఎఫ్ఏ) మార్కులను సంబంధిత హెడ్‌మాస్టర్లు వచ్చే నెల 2వ తేదీ నుంచి 21లోగా అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. www.bsetelangana.org వెబ్‌సైట్‌లోకి తమ స్కూల్ ఐడీతో లాగిన్ అయి, మార్కులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

# ఈ నెల 20న సర్టిఫికెట్ వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** పాఠశాల విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ మీడియం పోస్టుల భర్తీలో భాగంగా 64 మంది దివ్యాంగులైన అభ్యర్థులకు ఈ నెల 20న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ వెరిఫికేషన్ హైదరాబాద్ నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఉంటుందని పేర్కొంది. పూర్తి వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.



సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన బయో ఆసియా సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, కార్ల్ జూన్, స్విట్జర్లాండ్ రాయబారి ఆండ్రియాస్ బావుమ్, జయేశ్ రంజన్, వివిధ దేశాల ప్రతినిధులు

# పరిశోధనలకు ప్రపంచస్థాయి కేంద్రం

- ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం: మంత్రి కేటీఆర్

**సాక్షి, హైదరాబాద్:** వైద్యం తీరుతెన్నులు మారిపోతున్న ఈ ఆధునిక కాలానికి తగ్గ చికిత్స విధానాలపై పరిశోధనలు చేసే ఓ అంతర్జాతీయ స్థాయి సంస్థ ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కణ, జన్యు స్థాయి చికిత్సలపై పరిశోధనలు చేపట్టే ఈ సంస్థను నిర్మించడంలో ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సహాయం తీసుకోనున్నట్లు సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన బయో ఆసియా సదస్సులో తెలిపారు. ఈ సంస్థ భారతీయులకు, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రమే పరిమితమైన వ్యాధుల చికిత్సకు ప్రాధాన్యమిస్తుందని, కణ, జన్యుస్థాయి చికిత్సలను వీలైనంత తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవడంపై దృష్టి పెడుతోందని వెల్లడించారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**జీవశాస్త్ర రంగాలకు రాజధాని..**

హైదరాబాద్ జీవశాస్త్ర రంగాలకు దేశంలోనే ప్రధాన కేంద్రంగా మారిందని, బయో ఆసియా వంటి సదస్సులు ఇందుకు ఎంతగానో దోహదపడ్డాయని మంత్రి వివరించారు. సుమారు 37 దేశాల నుంచి 2 వేల మంది సభ్యులు ఈ సదస్సులో పాల్గొనడం విశేషమన్నారు. దేశవ్యాప్త ఫార్మా ఉత్పత్తుల్లో హైదరాబాద్ వాటా 35 శాతం కంటే ఎక్కువని, 800కుపైగా ఫార్మా, బయోటెక్, మెడికల్ టెక్నాలజీ కంపెనీలు ఇక్కడ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోని అన్ని జీవశాస్త్ర రంగ కంపెనీల విలువ ఇప్పటికే 5 వేల కోట్ల డాలర్లుగా ఉంటే రానున్న పదేళ్లలో దీన్ని రెట్టింపు చేసేందుకు, కొత్తగా 4 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు అనువుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. లైఫ్ సైన్సెస్ గ్రిడ్ పేరుతో ఏర్పాటు చేసుకున్న ప్రణాళిక ప్రకారం జినోమ్ వ్యాలీ విస్తరణతో జీవశాస్త్ర రంగ కంపెనీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. వైద్య పరికరాల తయారీ కేంద్రంలో ఇప్పటికే కనీసం 20 కంపెనీలు పనిచేయడం మొదలుపెట్టాయని, సహజానంద్ మెడికల్ డివైజెస్ కంపెనీ ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించి రంగం సిద్ధమైందని, పర్యావరణ అనుమతులు కూడా లభించాయని చెప్పారు. బయోకాన్ సంస్థ పరిశోధన విభాగం సిన్‌జీన్ హైదరాబాద్‌లో రూ.170 కోట్లతో కేంద్రాన్ని, లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఇక్కడ ఓ కేంద్రం ఏర్పాటు చేయడం జీవశాస్త్ర రంగం కేంద్ర బిందువుగా హైదరాబాద్ స్థాయిని పెంచేవేనన్నారు.

**కార్ల్ జూన్‌కు ఎక్సలెన్సీ అవార్డు..**

శరీర రోగ నిరోధక కణాలను చైతన్యవంతం చేయడం ద్వారా కేన్సర్‌కు చికిత్స అందించే ఇమ్యూనోథెరపీని అభివృద్ధి చేసిన అమెరికన్ శాస్త్రవేత్త, పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కార్ల్ జూన్‌కు ఈ ఏడాది బయో ఆసియా జినోమ్ వ్యాలీ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. జీవశాస్త్ర రంగంలో విశేష కృషి జరిపిన వారికి ఈ అవార్డు ఇస్తారు. రోగ నిరోధక కణాలనే కేన్సర్‌కు చికిత్స అందించొచ్చని తాము ముందు అనుకోలేదని కార్ల్ జూన్ తెలిపారు. అయితే 2010లో ఒక రోగితో మొదలైన ఈ ఇమ్యూనోథెరపీ విధానం రెండేళ్ల తర్వాత ముగ్గురికి విస్తరించిందని, ఆ తర్వాత 2017లో ఈ చికిత్స విధానానికి ఎఫ్‌డీఏ అనుమతులు లభించాయని, ప్రస్తుతం దీన్ని చాలా కేన్సర్ల చికిత్సలో ప్రపంచవ్యాప్తంగా వినియోగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి జయేశ్ రంజన్, బయో ఆసియా సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరియంటల్ విద్యార్థులకు ఎడ్‌సెట్

### ఈ నెల 24 నుంచి ఎడ్ సెట్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఎడ్‌సెట్–2020 నోటిఫికేషన్‌ను ఈనెల 20న జారీ చేయాలని, 24నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఎడ్‌సెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి ఎడ్‌సెట్ రాసేందుకు ఓరియంటల్ కాలేజీల్లో డిగ్రీ చేసిన వారికి కూడా అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు ఓరియంటల్ కాలేజీల్లో బీఏ (లాంగ్వేజెస్) చేసిన వారిని పండిట్ కోర్సులకే పరిమితం చేయగా, ఇకపై వారు బీఎడ్ చేసేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులు ఆన్‌లైన్లో (https://edcet.tsche.ac.in) ఏప్రిల్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎడ్‌సెట్ కన్వీనర్ టి.మృణాళిని చెప్పారు. రూ.650 పరీక్ష ఫీజుగా నిర్ణయించామని, ఎస్సీ, ఎస్టీలతో పాటు వికలాంగులకు రూ.450గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 25 వరకు, రూ.100 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 30 వరకు, రూ.2 వేల ఆలస్య రుసుముతో మే 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎడ్‌సెట్ పరీక్షను మే 23 నిర్వహిస్తామన్నారు. రెండు సెషన్లలో పరీక్షలు ఉంటాయని, ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గం టల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఫలితాలను జూన్ 11 విడుదల చేస్తామన్నారు.

**14 రీజనల్ సెంటర్ల ఏర్పాటు..**

ఇక ఎడ్‌సెట్ పరీక్షల నిర్వహణ కోసం తెలంగాణ, ఏపీలో 14 రీజనల్ సెంటర్లను ఏర్పాటు చేశామని ఎడ్‌సెట్ కన్వీనర్ టి.మృణాళిని తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నర్సంపేట్, నిజామాబాద్, ఖమ్మం, సత్తుపల్లి, కోదాడ, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, విజయవాడ, కర్నూల్‌లో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# ప్రాణం తీసిన చాక్లెట్

- వనస్థలిపురం డీమార్ట్‌లో ఇంటర్ విద్యార్థి సతీష్ అనుమానాస్పద మృతి
- కొనకుండానే చాక్లెట్ జేబులో వేసుకున్నాడంటున్న సెక్యూరిటీ
- అడగడంతో భయంతో కుప్పకూలాడంటున్న యాజమాన్యం
- సిబ్బంది దాడి వల్లే సతీష్ మృతిచెందాడంటున్న బంధువులు
- పోస్టుమార్టం నివేదిక వస్తే తెలియనున్న కారణం

**హైదరాబాద్:** నోరూరించే చాక్లెట్ ఓ ఇంటర్ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. డీమార్ట్‌లో చాక్లెట్ తీసుకొని డబ్బులు చెల్లించలేదని, సెక్యూరిటీ సిబ్బంది అడగడంతో ఆదివారం సాయంత్రం షాపింగ్‌కు వచ్చిన సతీష్ (18) భయంతో కుప్పకూలాడని ఆ సంస్థ చెబుతోంది. సెక్యూరిటీ సిబ్బంది దాడివల్లనే తమ కుమారుడు మృతిచెందాడని అతని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హయత్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ఇది హత్యా?.. లేక ఆకస్మిక మరణమా అనేది తేలనుంది. డీమార్ట్‌లో షాపింగ్ చేసి బయటకు వచ్చేంత వరకు సీసీటీవీ కెమెరాల్లో రికార్డుకాగా, బయటకొచ్చాక అతడు కింద పడిపోయిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాకు చిక్కకపోవడం అనుమానాలకు తావిస్తోంది. డీమార్ట్ ఎంట్రన్స్‌కు 40 మీటర్ల దూరంలో పడిపోయిన సతీష్‌ను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లుగా రాత్రి 10 గంటల ప్రాంతంలో నిర్ధారించారు. ఘటనాస్థలిని ఎల్బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, వనస్థలిపురం ఏసీపీ జయరాం సందర్శించారు.

**అసలేం జరిగిందంటే...**

సూర్యాపేట జిల్లా జగ్గు తండాకు చెందిన లౌడ్య బాలాజీకి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సతీష్(18) హయత్‌నగర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతూ అదే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఇంటర్ ఫైనల్ పరీక్షలు సమీపిస్తుండటంతో స్టేషనరీ సామగ్రి తెచ్చుకుంటామని 10 మంది విద్యార్థులు కాలేజీ యాజమాన్యానికి చెప్పి ఆదివారం సాయంత్రం ఔటింగ్‌కు వెళ్లారు. సతీష్ తన ఇద్దరు స్నేహితులతో కలసి రాత్రి 8.10 గంటలకు వనస్థలిపురం డీమార్ట్‌లోనికి వెళ్లాడు. ఈ క్రమంలో సతీష్ డైరీ మిల్క్ చాక్లెట్ జేబులో వేసుకున్నట్లు సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమైంది. అప్పటికే ఎగ్జిట్ గేట్ దాటి బయటకు వచ్చిన సతీష్‌ను సెక్యూరిటీ సిబ్బంది పిలవడంతో చాక్లెట్‌ను జేబులో నుంచి కిందపడేశాడు. అప్పటికే చెమటలు పట్టిన సతీష్ ఒక్కసారిగా కుప్పకూలడంతో మిగతా ఇద్దరు స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. మరణవార్త తెలుసుకొని వచ్చిన సతీష్ తల్లిదండ్రులు మాత్రం కాలేజీ యజమాన్యం నిర్లక్ష్యం, డీమార్ట్ సెక్యూరిటీ సిబ్బంది దాడివల్లనే తమ కుమారుడు చనిపోయాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

# మద్దతు ధరకు కందులు కొంటాం

### రైతులకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి భరోసా

**సాక్షి, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కందులు కొనుగోలు చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కంది రైతుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకురాగా, ఈ విషయంలో అభయం ఇచ్చారని వెల్లడించారు. ఈ మేరకు మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు. కంది కొనుగోళ్లకు దాదాపు రూ. 200 కోట్లు అదనంగా ప్రభుత్వంపై భారం పడుతుందనీ, కంది కొనుగోలు కోటాను పెంచాలని లేఖ రాసినా కేంద్రం స్పందించలేదన్నారు. దీని మద్దతు ధరకు కొనుగోలు చేసేలా కేంద్ర సాయం కోరగా, క్వింటాకు రూ.5,800 వంతున 47,500 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని రోజూ కేంద్రం ప్రగల్భాలు పలుకుతోందన్నారు. సరిహద్దు రాష్ట్రాల వద్ద నిఘా పెంచాలనీ, ఇతర రాష్ట్రాల కందులు మన మార్కెట్లకు రానివ్వొద్దన్నారు. కేసీఆర్ పుట్టిన రోజును రైతులకు పర్వదినంగా భావిస్తామనీ, దేశం చూపు తెలంగాణ రైతుల వైపు, వ్యవసాయం వైపు ఉందన్నారు.









Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com